శుక్రవారం 13-1-2023



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 293

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సంప్రదించండి: 040 – 4753 5555

vijay sales

Shop On www.vijaysales.com

సంక్రాంతి వేడుకలు!





EMI STARTS FROM ₹7,700/-
CASHBACK UP TO ₹20,000/-

Up To ₹7,500/- Instant Discount On Bank Cards

Bank of Baroda Credit Card | HSBC | AU Small Finance Bank | IDFC First Bank Credit & Debit Cards | One card

Scan to Shop Online

SANSUI 43 (108cm) 4K UHD LED TV — 30% Savings
PRICE ₹38,990/- OFFER PRICE ₹26,990/-

LG 55 (139cm) 4K UHD LED TV
EMI STARTS FROM ₹2,999/-
CASHBACK UP TO ₹3,500/-

Panasonic 65 (164cm) 4K UHD LED TV
EMI STARTS FROM ₹3,625/-
CASHBACK UP TO ₹9,000/-

SAMSUNG 65 (164cm) Neo QLED
Free Galaxy A23 (4G|64GB)
EMI STARTS FROM ₹1,990/-
CASHBACK UP TO ₹9,000/-

DELL INSPIRON 3000
Get Dell 2 Years' Additional Warranty @ ₹1 Worth ₹4,200/-
On select models

hp
- On Select Omen/Spectre/Envy Get Up To ₹10,000/- Cashback
- On Select HP 14&15/Pavilion/Victus/Envy Get Up To ₹5,000/- Cashback

Also Get Up To ₹14,000/- Exchange Bonus On Select Laptops

*T&C – Offers applicable on Select Banks CC/DC EMI transactions.

Lenovo
LEGION GAMING, SLIM 5, FLEX 5 & YOGA SERIES
5% Cashback Up To ₹ 5,000/- On Select Bank Cards (CC / DC)
Avail 3|0, 6|0, EMI on Select Bank Cards (CC / DC)

---

iPhone 13 (128GB)
PRICE ₹65,900/-
Instant Cashback ₹2,000
Trade in Value ₹15,000
Trade in Bonus ₹6,000
Effective Price ₹42,900*/-
(Price inclusive of offer)

REALME C21Y 3GB | 32GB
SPECIAL PRICE ₹8,799/-

OPPO F21S Pro 8GB | 128GB
10% Cashback Up To ₹2,000/- Leading Banks
VSP ₹21,999/-

VIVO V25 5G 8GB | 128GB
Cashback Up To ₹2,000/- Leading Banks
VSP ₹27,999/-

REDMI Note 12 5G 6GB | 128GB — New Arrival
Cashback Up To ₹1,500/- ICICI Bank CC/DC
EFFECTIVE PRICE ₹18,499/-

SAMSUNG GALAXY FOLD 4 5G 12GB | 256GB
Get GALAXY Watch 4 Classic 46MM BT @ ₹2,999/- + ₹8,000/- Cashback*
VSP ₹1,54,999/-

Direct Cool 192 Ltr. — 45% Savings
PRICE ₹21,990/- OFFER PRICE ₹11,990/-

Frost Free 255 Ltr. — 29% Savings
PRICE ₹29,690/- OFFER PRICE ₹20,990/-

Frost Free 335 Ltr. — 41% Savings
PRICE ₹48,990/- OFFER PRICE ₹28,990/-

Frost Free 470 Ltr. — 38% Savings
PRICE ₹70,490/- OFFER PRICE ₹43,990/-

Side By Side 625 Ltr. — 52% Savings
PRICE ₹1,33,890/- OFFER PRICE ₹63,990/-

Fully Automatic Top Load 6.5 KG — 41% Savings
PRICE ₹23,890/- OFFER PRICE ₹13,990/-

Fully Automatic Top Load 7.5 KG — 28% Savings
PRICE ₹22,090/- OFFER PRICE ₹15,990/-

Fully Automatic Front Load 7 KG — 41% Savings
PRICE ₹45,890/- OFFER PRICE ₹26,990/-

Fully Automatic Front Load 8 KG — 50% Savings
PRICE ₹59,890/- OFFER PRICE ₹29,990/-

Fully Automatic Front Load 9 KG — 40% Savings
PRICE ₹57,900/- OFFER PRICE ₹34,990/-

Smart Watches Starting ₹1,399/- UP TO 80% OFF

Portable Speaker Starting ₹999/- UP TO 65% OFF
JBL | HARMAN | boAt | mi | PORTRONICS

boAt Airdopes 501 ANC — 77% Savings
PRICE ₹9,990/- Spl. VSP ₹2,199/-

EUREKA FORBES AQUAGUARD EDEN Water Purifier RO+UV+MTDS + SS — 40% Savings
PRICE ₹36,500/- VSP ₹21,990/-

BAJAJ 10 L Storage Water Geyser Maestro — 44% Savings
PRICE ₹16,130/- VSP ₹8,990/-

Chimney & Cooktop UP TO 50% OFF
elica | FABER | BOSCH | KAFF | Whirlpool

విజయ్ సేల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్: హైదరాబాద్ | వరంగల్ | విజయవాడ | విశాఖపట్నం | రాజమండ్రి | తిరుపతి | కాకినాడ | ముంబై | ఢిల్లీ | థానే | నవీ ముంబై | పూనే | సూరత్ | వడోదర | అహ్మదాబాద్ | గురుగ్రామ్ | ఫరీదాబాద్ | నోయిడా | ఇందిరాపురం

ఎ.ఎస్.రావు నగర్: VRK సిల్క్స్ పక్కన
అత్తాపూర్: పిల్లర్ నెం. 143 ఎదురుగా
[illegible]: SBI పక్కన, కానుకుంట
పీర్జాదిగూడ: హోటల్ తులిప్స్ గ్రాండ్ ప్రక్కన, (బోడుప్పల్)

చంపాపేట్: ఓనస్ హాస్పిటల్ పక్కన
కొత్తపేట: మెట్రో పిల్లర్ నెం. 1632 ఎదురుగా
కొండాపూర్: కిమ్స్ హాస్పిటల్ దగ్గర
కూకట్‌పల్లి: మెట్రో పిల్లర్ నెం. 771 ఎదురుగా, వివేకానంద నగర్

మలక్‌పేట్: మెట్రో పిల్లర్ నెం. 1441 ఎదురుగా
మదీనాగూడ: సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ఎదురుగా
నాగోల్: గ్రీన్ హోండా షోరూమ్ ఎదురుగా
నల్లకుంట: పద్మ కాలనీ, శంకర్ మఠం దగ్గర

నాచారం: స్పార్ హైపర్ మార్కెట్ దగ్గర
శాలిబండ: సయ్యద్ అలీ చబుత్ర, మస్జిద్-ఈ-ఉరూబ్ ఎదురుగా
సుచిత్ర X రోడ్స్: HDFC బ్యాంక్ పక్కన
సన్ సిటీ: విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ పక్కన

టోలీచౌకి: వరుణ్ మోటార్స్ పక్కన
వనస్థలిపురం: VRK సిల్క్స్ పక్కన
వరంగల్: SBI బ్యాంక్ ఎదురుగా, నక్కలగుట్ట, హన్మకొండ

*Conditions apply. This offer includes all other discounts also. No other offer can be clubbed with this offer. Images shown are for illustrative purpose only. Offer till stocks last. Finance offer applicable at the sole discretion of Financier. *Processing Fee is applicable as per Financier. For Paper Finance: Please bring Adhaar Card, Pan Card, Electric Bill & Cancelled Cheque. Offer is based on minimum transactions slabs defined by Finance Com Kindly speak to our store sales staff for the "Terms and Conditions" of all the bank offers, and for the respective Instant Discount/Cashback amounts applicable on each Bank. For corporate bookings or bulk orders, please mail us at corporatesales@vijaysales.com

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 15 సంచిక: 293
శుక్రవారం 13-1-2023



'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'



వన్డే సిరీస్ భారత్ సొంతం

శ్రీలంకతో జరిగిన రెండో మ్యాచ్‌లో 4 వికెట్లతో టీమిండియా గెలుపు -15లో



మస్క్.. టెస్లాకు 'ట్విటర్' షాక్!

ఏడాదిలో షేరు 70% కుదేలు.. మస్క్ సంపద 188 బిలియన్ డాలర్లు డౌన్ -15లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



యురేనియం కలకలం

లండన్‌లోని హీత్రో విమానాశ్రయంలో యురేనియం పార్శిల్ కలకలం సృష్టించింది. పాక్ నుంచి ఇది వచ్చినట్టు వార్తలొచ్చాయి.

వివరాలు 6లో ▸



శరద్‌యాదవ్ కన్నుమూత

సీనియర్ రాజకీయవేత్త, లోక్‌తాంత్రిక్ జనతా దళ్ (ఎల్‌జేడీ) అధినేత, కేంద్ర మాజీ మంత్రి శరద్‌యాదవ్ (75) తుదిశ్వాస విడిచారు.

వివరాలు 6లో ▸



'శతఘ్ని'లోకి మహిళా అధికారులు

దేశంలో అతిపెద్ద సాయుధ దళం 'ఆర్మీ' పోరాట విభాగంలోనూ మహిళలను చేర్చుకోవాలని ఆర్మీ నిర్ణయించింది.

వివరాలు 6లో ▸



హిందూ దేవాలయం అపవిత్రం

ఆస్ట్రేలియాలోని స్వామి నారాయణ్ మందిరంపై ఖలిస్తాన్ మద్దతుదారులు రంగులతో దాడి చేశారు.గోడలపై మోదీ వ్యతిరేకరాతలు రాశారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

పెట్టుబడులతో రండి



ముంబై పర్యటనకు వెళ్లిన మంత్రి కేటీఆర్ పలువురు పారిశ్రామిక దిగ్గజాలతో భేటీ అయ్యారు. తెలంగాణ పారిశ్రామిక విధానం ప్రత్యేకతలను వారికి వివరించారు. టాటా గ్రూప్ చైర్మన్, జేఎస్‌డబ్ల్యూ ఎండీ, హెచ్‌యూఎల్ ఎండీలతో భేటీ అయ్యారు.

-వివరాలు 2లో▶

ఏడోసారి పొడిగింపు..



'సింగరేణి' సీఎండీ ఎన్.శ్రీధర్ పదవీకాలం గత డిసెంబర్ 31తో ముగిసిపోగా, రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మరో ఏడాదిపాటు పొడిగించింది. ఇప్పటికే 6 సార్లు ఆయన పదవీకాలాన్ని పొడిగించడంపై కేంద్రం అభ్యంతరం తెలిపింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఏడోసారి ఏడాది కాలాన్ని పొడిగించింది. - వివరాలు 2లో▶

వాళ్లు చెప్పినట్టు వింటే.. తాలిబన్ రాజ్యమే



మహబూబాబాద్‌లో పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

బీజేపీ మతాల మధ్య చిచ్చుపెడుతోంది: కేసీఆర్

- రాష్ట్రంలో అశాంతి పెరిగిపోతుంది.. పెట్టుబడులు, ఉద్యోగాలు రావు
- కేంద్ర ప్రభుత్వాల తప్పుడు విధానాలతోనే నీటి, కరెంట్ కష్టాలు
- మేధావులు, యువత ఇవన్నీ ఆలోచించాలి..
- మేం వచ్చాక దేశానికే ఆదర్శంగా తెలంగాణ అభివృద్ధి
- నీటి గోస తీర్చేందుకు తెగించి కాళేశ్వరం కట్టాం
- నాటి కరువు ప్రాంతాలు నేడు పచ్చగా మారాయన్న సీఎం
- మానుకోట, కొత్తగూడెం జిల్లాల్లో కలెక్టరేట్లు.. బీఆర్ఎస్ కార్యాలయాల ప్రారంభం

దేశాన్ని రక్షించేందుకు తెలంగాణ బిడ్డలు ముందుకు రావాలి

ప్రజలు అభివృద్ధి వైపు సాగాలంటే సమాజంలో శాంతి, సహనం అవసరం. మతపిచ్చి, కులపిచ్చి పెంచి విద్వేషాలు రెచ్చగొడితే దేశం తిరోగమనం వైపు పయనిస్తుంది. మేధావులు, యువత దీనిపై ఆలోచన చేయాలి. మన చుట్టూ ఏం జరుగుతోందో పరిశీలన చేయాలి. మనం బాగున్నాం కదా, పొరుగింటోళ్లు ఏమైపోతే ఏమిటని అనుకుంటే, ఓ రోజు మనకూ ప్రమాదం వస్తుంది. అందువల్ల ఉద్యమ పంథా, పోరాట రక్తమున్న తెలంగాణ బిడ్డలు ఈ దేశాన్ని రక్షించడానికి ముందుకు రావాలి. - సీఎం కేసీఆర్

సాక్షి ప్రతినిధి, వరంగల్/ సాక్షి, మహబూబాబాద్/ సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: 'కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ మతాలు, కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తోంది. వారి ప్రయత్నాలు ఫలిస్తే రాష్ట్రంలో అశాంతి పెరిగిపోతుంది. సమాజం మరో తాలిబన్‌లా మారిపోతుంది. ఇక్కడికి పెట్టుబడులు రావు. ఉద్యోగాలు, ఉపాధి లభించవు. మన చుట్టూ జరుగుతున్న విద్వేష రాజకీయాల పట్ల అవగాహన పెంచుకోవాలి. దీనిపై సమాజంలో చర్చ జరగాలి..'' అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. గురువారం మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో నూతన కలెక్టరేట్లను, బీఆర్ఎస్ జిల్లా కార్యాలయాలను సీఎం కేసీఆర్ ప్రారంభించారు. ఆయా చోట్ల కలెక్టర్లను వారి చాంబర్లలోని కుర్చీల్లో కూర్చోబెట్టి అభినందించారు. తర్వాత రెండు చోట్ల నిర్వహించిన సభల్లో ప్రసంగించారు. ఈ వివరాలు ఆయన మాటల్లోనే..

''తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దేశంలో ఎక్కడా లేవు. దేశానికే మార్గదర్శకంగా నిలిచాం. దీనికి ఉదాహరణలు అనేకం ఉన్నాయి. రెండు రోజులు చెప్పినా అవి ఒడవవు. తెలంగాణలో గతంలో 3 మెడికల్ కాలేజీలు ఉంటే.. ఇప్పుడు 33 జిల్లా కేంద్రాల్లో మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసుకుంటున్నాం. ధైర్యం చేసి తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చాం. ప్రజలు సంక్షేమ పథకాల జాతరను అనుభవిస్తున్నారు. గతంలో 600 ఫీట్లు బోరు వేసినా

మిగతా 2వ పేజీలో ▶

పని మీది .. పరిష్కారాలు నావి!



- అంతర్గత విభేదాలు పక్కనపెట్టి ఒక్కతాటిపైకి రావాలి.. వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా ప్రతి నేత, కార్యకర్త పనిచేయాలి
- రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు ఠాక్రే దిశానిర్దేశం
- సీనియర్లతో పాటు అన్ని కమిటీలతో భేటీ
- రెండురోజుల పర్యటన ముగించుకొని ఢిల్లీకి పయనం

8లో

అసెంబ్లీ ఎన్నికలను సమష్టిగా ఎదుర్కొంటాం

- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే
- తెలంగాణలో ఇది కీలక సమయం .. అన్ని విధాలా సిద్ధం కావాలి
- రాహుల్ సందేశాన్ని రాష్ట్రంలో ఇంటింటికీ చేరవేయాలి
- ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఠాక్రే, కోమటిరెడ్డి వెంకటరెడ్డి భేటీ

8లో

18న సీఎం చేతుల మీదుగా కంటివెలుగు ప్రారంభం

మంత్రి హరీశ్‌రావు వెల్లడి

కంటివెలుగు రెండోదశ కార్యక్రమాన్ని ఈనెల 18న మధ్యాహ్నం ఒంటి గంటకు సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు చెప్పారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. 5లో

అరవణ ప్రసాదం విక్రయాలు నిలిపివేయండి

శబరిమలలో అరవణ ప్రసాదం విక్రయాలను నిలిపివేయాలని ట్రావెన్‌కోర్ దేవస్వామ్ బోర్డు (టీడీబీ)ను కేరళ హైకోర్టు తాజాగా ఆదేశించింది. ఈ ప్రసాదం తయారీకి ఉపయోగించిన యాలకుల్లో పరిమితికి మించి పురుగు మందుల అవశేషాలున్నట్లు నిర్ధారణ కావడమే ఇందుకు కారణం. 6లో

ప్రైవేట్ ఆస్తులపై హక్కులను సబ్ రిజిస్ట్రార్లు నిర్ణయించలేరు

అవసరమైన పత్రాలతో వచ్చిన వారి ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయాల్సిందే: హైకోర్టు

- వివరాలు 2లో▶

క్లుప్తంగా...

ప్రైవేట్ ఆస్తులపై హక్కులను సబ్‌రిజిస్ట్రార్లు నిర్ణయించలేరు

హైకోర్టు స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: ఏవైనా ప్రైవేట్ ఆస్తులపై హక్కులను నిర్ణయించే అధికారం సబ్ రిజిస్ట్రార్లకు లేదని, దానికి అవసరమైన పత్రాలతో వచ్చిన వారి ఆస్తులను రిజిస్ట్రేషన్లు చేయాల్సిందేనని హైకోర్టు తేల్చిచెప్పింది. వాలిడేట్ డాక్యుమెంట్‌ను లింక్ డాక్యుమెంట్‌గా పరిగణించి రిజిస్ట్రేషన్లు చేయరాదంటూ స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ జారీ చేసిన సర్క్యులర్‌ను పలువురు హైకోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్లపై న్యాయమూర్తి జస్టిస్ ఎం.సుధీర్‌కుమార్ విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఐజీ జారీ చేసిన సర్క్యులర్‌కు చట్టబద్ధత లేదంటూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ చట్టం ప్రకారం పొందిన వాలిడేట్ డాక్యుమెంట్‌ను లింక్ డాక్యుమెంట్‌గా పరిగణనలోకి తీసుకోకుండా రిజిస్ట్రేషన్‌ను తిరస్కరించే అధికారం సబ్ రిజిస్ట్రార్లకు ఉండదని స్పష్టంచేశారు. అలా రిజిస్ట్రేషన్లు చేస్తే వివాదాలు పెరుగుతాయన్నది నిజమే అయినా.. చట్టంలో మార్పులు చేయలేదని గుర్తుచేసింది. ఆ చట్టం ప్రకారం ఎవరైనా వ్యక్తి పత్రాలు సమర్పించినప్పుడు సబ్ రిజిస్ట్రార్లు రిజిస్ట్రేషన్లు చేయాల్సిందేనని చెప్పింది.

శాంతికుమారి నియామకంతో తెలంగాణ ప్రగతి: చిరంజీవి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారి చిత్తశుద్ధి తెలంగాణ అభివృద్ధికి దోహదపడుతుందని మెగాస్టార్ చిరంజీవి పేర్కొన్నారు. సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన శాంతికుమారికి ఆయన అభినందనలు తెలిపారు. ఈ మేరకు చిరంజీవి గురువారం ట్వీట్ చేశారు. ఆమె తెలంగాణ తొలి మహిళా సీఎస్‌గా నియమితులు కావడం సంతోషంగా ఉందని చిరంజీవి తెలిపారు.

రెండు కెమికల్ కంపెనీల్లో ఐటీ సోదాలు

సాక్షి, హైదరాబాద్: ఆదాయపన్నుశాఖ అధికారులు గురువారం హైదరాబాద్‌లోని రెండు కెమికల్ కంపెనీల్లో సోదాలు నిర్వహించారు. ఢిల్లీ నుంచి వచ్చిన మొత్తం ఆరు ఐటీ అధికారుల బృందాలు బాలాపూర్ ప్రాంతంలోని ఈ రెండు రసాయన కంపెనీల కార్యాలయాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించాయి. పన్ను ఎగవేత ఆరోపణలపైనే ప్రధానంగా ఈ రెండు కంపెనీల్లో ఐటీ అధికారులు సోదాలు జరిపినట్టు సమాచారం. ఈ సందర్భంగా కొన్ని కీలక పత్రాలను సైతం ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. కాగా, అధికారులు ఆ కంపెనీల పేర్లు, ఇతర వివరాలను అధికారికంగా ధ్రువీకరించలేదు. ఈ తనిఖీలకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

అలిశెట్టి ప్రభాకర్ కుటుంబానికి అండ

మంత్రి కేటీఆర్ హామీ

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ కవి అలిశెట్టి ప్రభాకర్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి కె.తారకరామారావు ప్రకటించారు. అలిశెట్టి జయంతి, వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ పరిస్థితిని పలువురు మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన కేటీఆర్.. అలిశెట్టి కుటుంబ సభ్యులతో మాట్లాడాలని తన కార్యాలయ అధికారులను ఆదేశించారు. అలిశెట్టి భార్య భాగ్యతో మాట్లాడిన అధికారులు.. ఆమె అభిప్రాయాన్ని మంత్రికి తెలియజేశారు. దీనిపై కేటీఆర్ సానుకూలంగా స్పందిస్తూ.. అలిశెట్టి కుటుంబానికి సొంత ఇల్లు మంజూరుకు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

22న హైదరాబాద్‌కు చేగువేరా కుమార్తె రాక

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): మనుషుల స్వేచ్ఛకు ముళ్లకంచెలు కడుతున్న వ్యవస్థపై పోరాడి, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట యోధుడిగా పేరొందిన క్యూబా విప్లవ యోధుడు చేగువేరా కుమార్తె డాక్టర్ అలైదా గువేరా ఈనెల 22న హైదరాబాద్‌కు వస్తున్నారు. ఆమె రాక నేపథ్యంలో శంషాబాద్ విమానాశ్రయం నుంచి హిమాయత్‌నగర్ వరకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు నేషనల్ కమిటీ ఫర్ సాలిడారిటీ విత్ క్యూబా చెప్పింది. అలైదా గువేరా రాక నేపథ్యంలో గురువారం మఖ్దూం భవన్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు సమావేశమై కార్యాచరణను రూపొందించారు. ఈసందర్భంగా విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మల్లు రవి మాట్లాడుతూ.. ఈనెల 22న సాయంత్రం 4 గంటలకు రవీంద్రభారతిలో ఆమెను సత్కరించనున్నట్లు చెప్పారు.

జీస్క్వేర్ బహుమతుల పంట





మహబూబాబాద్‌లో సీఎం సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు.. మహబూబాబాద్ కలెక్టరేట్ చాంబర్‌లో కలెక్టర్ కె.శశాంకకు సీఎం అభినందనలు.. బీఆర్ఎస్ కార్యాలయంలో ఎంపీ కవితను ఆశీర్వదిస్తున్న సీఎం

..తాలిబన్ రాజ్యమే





సీఎంకు సీతారాముల చిత్రపటాన్ని బహూకరిస్తున్న పువ్వాడ, వనమా.. కొత్తగూడెంలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించాక రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, విప్ రేగా కాంతారావు.. కలెక్టరేట్ చాంబర్‌లో కలెక్టర్ అనుదీప్‌కు సీఎం శుభాకాంక్షలు

▶ మొదటి పేజీ తరువాయి

నీరు ఉండేది కాదు. ప్రస్తుతం సమృద్ధిగా నీరు,కరెంట్ అందుబాటులో ఉన్నాయి. ప్రతి జిల్లాలో ప్రజలకు, ఉద్యోగులకు సౌకర్యంగా ఉండేలా సమీకృత కలెక్టరేట్లను నిర్మించుకుంటున్నాం. ఇతర రాష్ట్రాల్లో మంత్రుల చాంబర్ కంటే తెలంగాణలో కలెక్టర్ చాంబర్ అద్భుతంగా ఉందని పంజాబ్ మంత్రి సైతం ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

కేంద్ర అసమర్థత వల్లే తగ్గిన ఆదాయం

తెలంగాణ ఏర్పడే నాటికి రాష్ట్ర జీఎస్‌డీపీ రూ.5లక్షల కోట్లు ఉండేది. ఇప్పుడు రూ.11.54 లక్షల కోట్లకు చేరింది. మనస్థాయిలో కేంద్ర ప్రభుత్వం కూడా పనిచేసి ఉంటే రాష్ట్ర జీఎస్‌డీపీ రూ.14.5 లక్షల కోట్లకు చేరేది. కేంద్ర అసమర్థ పనితీరు వల్ల ఒక్క తెలంగాణ రాష్ట్రానికే దాదాపు రూ.3 లక్షల కోట్ల నష్టం జరిగింది. అన్ని రాష్ట్రాలను కలిపితే ఈ నష్టం మరెంతో ఉంటుంది.

జల వివాదాలు తీర్చడం లేదు

దేశవ్యాప్తంగా నదుల్లో సమృద్ధిగా నీరు అందుబాటులో ఉన్నా.. రైతుల పొలాల వద్దకు రావు. కృష్ణా నదిపై ఏర్పాటు చేసిన ట్రిబ్యునల్ 19 ఏళ్లు గడిచినా తీర్పు ఇవ్వలేదు. మనం మొండి పట్టుదలతో తెగించి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించుకున్నాం. నీటి సమస్య లేకుండా చేసుకున్నాం. దేశంలో సమృద్ధిగా నీటి వనరులున్నా నదులపై ఉన్న వివాదాలను తేల్చకుండా కేంద్రం నిర్లక్ష్యం చేస్తోంది. దేశ రాజధాని ఢిల్లీలో సైతం తాగునీటి సమస్య తీరలేదు. కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో తాగునీటి ఎద్దడి ఇంకా ఉండటం ఏమిటి? 10 రోజులకోసారి నీళ్లు సరఫరా చేసే దుస్థితికి కారణాలేమిటి? ఇప్పటివరకు కేంద్రాన్ని పాలించిన బీజేపీ, కాంగ్రెస్‌ల అసమర్థత, తప్పుడు విధానాల ఫలితమే ఇది...'' అని సీఎం కేసీఆర్ మండిపడ్డారు.

బిజీ బిజీగా కార్యక్రమాలు

సీఎం కేసీఆర్ తొలుత హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో మహబూబాబాద్‌కు చేరుకున్నారు. అక్కడ నూతన కలెక్టరేట్‌ను, జిల్లా గ్రంథాలయాన్ని, బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. కలెక్టరేట్ సమీపంలో నిర్వహించిన సభలో ప్రసంగించారు. తర్వాత హెలికాప్టర్ ద్వారా కొత్తగూడెం చేరుకున్న సీఎం కేసీఆర్.. తొలుత కొత్తగూడెం–పాల్వంచ మధ్యలో నిర్మించిన సమీకృత కలెక్టరేట్‌ను ప్రారంభించారు. అక్కడే నిర్వహించిన సభలో మాట్లాడారు. తర్వాత రోడ్డు మార్గంలో కొత్తగూడెం వెళ్లి బీఆర్ఎస్ జిల్లా ఆఫీసును ప్రారంభించారు. అనంతరం హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. ఈ కార్యక్రమాల్లో సీఎం వెంట మంత్రులు సత్యవతిరాథోడ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, పువ్వాడ అజయ్, ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, మాలోతు కవిత, పసునూరి దయాకర్, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, బండా ప్రకాశ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పోచంపల్లి శ్రీనివాస రెడ్డి, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, తాతా మధు, ఎమ్మెల్యేలు శంకర్‌నాయక్, రెడ్యానాయక్, బానోతు హరిప్రియ, చల్లా ధర్మారెడ్డి, యాదగిరిరెడ్డి, టి.రాజయ్య, గండ్ర వెంకటరమణారెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రెండు జిల్లాలకు వరాలు

● మహబూబాబాద్‌కు కొత్తగా ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలను మంజూరు చేస్తున్నామని.. వచ్చే విద్యా సంవత్సరంలోనే తరగతులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఇక అభివృద్ధి పనుల కోసం మహబూబాబాద్ మున్సిపాలిటీకి రూ.50 కోట్లు, జిల్లాలోని మిగతా 3 మున్సిపాలిటీలకు రూ.25 కోట్లు చొప్పున నిధులు ఇస్తున్నట్టు తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీకి సీఎం ప్రత్యేక నిధులనుంచి రూ.10 లక్షల చొప్పున మంజూరు చేస్తామన్నారు. ● భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 481 గ్రామ పంచాయతీలకు రూ.10 లక్షల చొప్పున ప్రత్యేక నిధిని మంజూరు చేస్తున్నామని సీఎం చెప్పారు. జిల్లాలోని పాల్వంచ, కొత్తగూడెం మున్సిపాలిటీలకు రూ.40 కోట్ల చొప్పున.. ఇల్లెందు, మణుగూరు మున్సిపాలిటీలకు రూ.25 కోట్ల చొప్పున నిధులు ఇస్తున్నట్టు ప్రకటించారు.

హామీలు నెరవేర్చని వారిని నిలదీయాలి

ఎన్నికల్లో గెలవాల్సింది పార్టీలు, నాయకులు కాదు.. ప్రజలు, ప్రజాభిప్రాయం గెలవాలి. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చని వారిని నిలదీయాలి. అలా జరిగినప్పుడే పరిపూర్ణ ప్రజాస్వామ్యం వచ్చినట్టు. లేదంటే ఉపన్యాసాలు, సొల్లు పురాణాలు, కాలక్షేపాలే చూస్తాం తప్ప ప్రజలకు న్యాయం జరగదు. చైతన్యవంతమైన ఖమ్మం గడ్డ నుంచే మార్పు కోసం మా వంతు ప్రయత్నాన్ని ఈనెల 18న మొదలు పెడుతున్నాం. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలి. – కేసీఆర్

పాలనలో ఉద్యోగుల భాగస్వామ్యం పెంచుతాం: సీఎస్

రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగుతోందని, పరిపాలనా ఫలాలను ప్రజలకు చేర్చేందుకు ఉద్యోగుల భాగస్వామ్యం పెంచుతామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. తాను జిల్లాలో పనిచేసినప్పుడు కలెక్టర్ కార్యాలయాలు ఇరుకుగా ఉండి ప్రజలు ఇబ్బంది పడేవారని గుర్తుచేసుకున్నారు. ఇప్పుడు సమీకృత కలెక్టరేట్లు ఇంద్ర భవనాల్లా ఉన్నాయని, వీటిని చూస్తే అసూయగా ఉందని పేర్కొన్నారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం ఉద్యోగులంతా సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

పొంగులేటి వర్గానికి అందని ఆహ్వానం..

కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ కార్యాలయ ప్రారంభోత్సవానికి మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డితోపాటు ఆయన వర్గానికి చెందిన నేతలకు ఆహ్వానం అందలేదు. జెడ్పీ చైర్‌పర్సన్ కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు తదితరులు పొంగులేటి వర్గం నేతలుగా కొనసాగుతున్నారు. కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి మాత్రం ప్రొటోకాల్ ప్రకారం జెడ్పీ చైర్‌పర్సన్ కోరం కనకయ్యకు ఆహ్వానం అందింది. ఈ మేరకు కలెక్టరేట్‌కు వెళ్లిన ఆయన.. సీఎం రావడానికి ముందు ఒంటరిగానే కూర్చున్నారు. మధ్యలో ఒకరిద్దరు నేతలతో మాట్లాడారు. సభా వేదికపై ఇల్లెందు నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలంటూ సీఎంకు వినతిపత్రం సమర్పించారు. సీఎం కాన్వాయ్ వెంట ఆయన బీఆర్ఎస్ కార్యాలయానికి చేరుకున్నా.. లోపలికి వెళ్లకుండానే వెనక్కి వెళ్లి పోయారు. కనకయ్యను పోలీసులు, పార్టీ నేతలు అడ్డుకున్నట్టు ప్రచారం జరిగినా.. తనకు ఆహ్వానమే అందలేదని ఆయన తెలిపారు.

ఆంక్షలు.. అదుపులోకి..

సీఎం పర్యటన నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రతిపక్ష నాయకులను ముందుగానే అదుపులోకి తీసుకున్నారు. సీఎం పర్యటనలో నల్ల జెండాలు, చొక్కాలతో నిరసన తెలపకుండా ఆంక్షలు విధించారు.

అడగకుండానే వరాలిచ్చే కేసీఆర్: ఎర్రబెల్లి

అడిగితే వరాలు ఇచ్చేవాళ్లు ఉంటారేమోగానీ.. సీఎం కేసీఆర్ మాత్రం అడగకుండానే కష్టాలను అర్థం చేసుకొని వరాలు ఇచ్చే పేదల ఆరాధ్య దైవమని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కొనియాడారు. ఇదే తరహాలో ఆయన మానుకోట ప్రజలపై చల్లని చూపు సారించాలని కోరారు. సీఎం ఆశీస్సులతో మానుకోట అభివృద్ధిలో బంగారు కోట కావాలని ఆకాంక్షించారు.

నూకల రాంచంద్రారెడ్డి విగ్రహాలు పెడతాం

తెలంగాణ రాష్ట్రం కోసం పరితపించిన ఆదర్శ నాయకుడు నూకల రాంచంద్రారెడ్డి అని కేసీఆర్ కొనియాడారు. చాలామంది నాయకులకు మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు గురువు అయితే.. పీవీకి గురువు నూకల రాంచంద్రారెడ్డి అన్నా రు. అలాంటి నేత గురించి ఈ తరం యువతకు తెలపడం ప్రభుత్వ బాధ్యత అని.. మహబూబాబాద్, వరంగల్‌ల్లో ప్రభుత్వ ఖర్చులతో రాంచంద్రారెడ్డి కాంస్య విగ్రహాలు ఏర్పాటు చేస్తామన్నారు.

పెట్టుబడులతో ముందుకు రండి



హిందుస్తాన్ యూనిలీవర్ ప్రతినిధులతో కేటీఆర్



జేఎస్ డబ్ల్యూ ఎండీ సజ్జన్ జిందాల్‌తో భేటీ అయిన మంత్రి కేటీఆర్

- ముంబైలో పారిశ్రామిక దిగ్గజాలను కోరిన మంత్రి కేటీఆర్
- టీసీఎస్ కార్యకలాపాలను వరంగల్‌కు విస్తరించాలని వినతి
- టాటా, జిందాల్, హిందుస్తాన్ యూనిలీవర్ కార్యాలయాల సందర్శన

సాక్షి, హైదరాబాద్: దేశ ఆర్థిక రాజధాని ముంబై పర్యటనకు వెళ్లిన మంత్రి కేటీఆర్ గురువారం పలువురు పారిశ్రామిక దిగ్గజాలతో భేటీ అయ్యారు. తెలంగాణలో అమలవుతున్న పారిశ్రామిక విధానం ప్రత్యేకతలు వివరించడంతోపాటు రాష్ట్రంలో ఉన్న విస్తృత వ్యాపార, వాణిజ్య అవకాశాలపై చర్చించారు. తొలుత టాటా కార్పొరేట్ కేంద్ర కార్యాల యం బాంబే హౌజ్‌లో టాటా గ్రూప్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్‌తో భేటీ అయ్యారు. తెలంగాణలో టాటా గ్రూప్ విస్తరణకు ఉన్న అవకాశాలను వివరిస్తూ సంస్థ విస్తరణ ప్రణాళికల్లో రాష్ట్రానికి ప్రాధాన్యతనివ్వాలని కేటీఆర్ కోరారు. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగంలో హైదరాబాద్ కేంద్రంగా టాటా గ్రూప్ ప్రగతిని ప్రస్తావించడంతోపాటు టీసీఎస్ కార్యకలాపాలను వరంగల్‌కు విస్తరించాలని కోరారు. ఎలక్ట్రానిక్స్ రంగంలో సానుకూల వాతావరణాన్ని వివ రిస్తూ పెట్టుబడులతో ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. విమానయాన రంగంలో పురోగతిలో ఉన్న టాటా సంస్థ హైదరాబాద్‌లో నిర్వహణ, మరమ్మ తు, ఓవర్‌హాలింగ్ (ఎంఆర్‌ఓ) కేంద్రాన్ని ఏర్పా టు చేయాలని కోరారు. తెలంగాణలో తమ సంస్థ కార్యకలాపాలపై నటరాజన్‌చంద్రశేఖరన్ సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వ్యాపార నిర్వహణ అత్యంత సులువుగా ఉందనే విషయం తమ అనుభవంలో తేలిందన్నారు. దేశ ఆర్థిక పురోగతి, అంతర్జాతీయ వ్యాపార వాణిజ్య పరిస్థితులు, పెట్టుబడి అవకాశాల వంటి అనేక అంశాలపై ఇద్దరు చర్చించారు.

ఎఫ్ఎంసీజీలో పెట్టుబడులు

తెలంగాణ ప్రజల తలసరి ఆదాయంతోపాటు అనేక ఇతర ఆర్థిక సూచీలు వేగంగా వృద్ధి చెందుతున్నాయని హిందుస్తాన్ యూనిలీవర్ మేనేజింగ్ డైరెక్టర్ సంజీవ్ మెహతాతో జరిగిన భేటీలో కేటీఆర్ చెప్పారు. ప్రజల కొనుగోలు శక్తి పెరిగిన నేపథ్యంలో ఎఫ్ఎంసీజీ రంగంలో తెలంగాణను పెట్టుబడుల గమ్యస్థానంగా ఎంచుకునేందుకు ఇదే సరైన అవకాశమని తెలిపారు. పామాయిల్ ఉత్పత్తి కోసం ఒక బృహత్తర లక్ష్యాన్ని ఎంచుకున్న ప్రభుత్వం, ఆ దిశగా రైతులను చైతన్యపరిచి ప్రోత్సహి స్తోందని తెలిపారు. వంట నూనెల ఉత్పత్తి కోసం హిందుస్తాన్ యూనిలీవర్ పెట్టుబడులు పెట్టేందుకు ఇదే సరైన సమయమని సూచించారు.

ఫార్ములా–ఈ రేసింగ్ కౌంట్‌డౌన్ షురూ..

హైదరాబాద్‌లో జరగనున్న 'ఫార్ములా–ఈ' ఎలక్ట్రానిక్ కార్ల రేసింగ్ 30 రోజుల కౌంట్‌డౌన్‌ను ముంబైలోని ఇండియాగేట్ వద్ద ప్రారంభించారు. మహారాష్ట్ర సీఎం షిండే, కేంద్ర మంత్రి గడ్కరీ, మంత్రి కేటీఆర్, గ్రీన్‌కో– ఏస్ గ్రూప్ వ్యవస్థాపకుడు అనిల్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బయ్యారంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయండి

బయ్యారంతోపాటు పొరుగునే ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో ఇనుప ఖనిజం నిల్వలను దృష్టిలో ఉంచుకొని అక్క డ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీ లించాలని ప్రముఖ పారిశ్రామిక సంస్థ జేఎస్‌డబ్ల్యూ ఎండీ సజ్జన్ జిందాల్‌ను కేటీఆర్ కోరారు. సజ్జన్ జిందాల్‌తో ఆయన జేఎస్‌డబ్ల్యూ కేంద్ర కార్యాలయంలో భేటీ అయ్యారు. జేఎస్‌డబ్ల్యూ సంస్థకు స్టీల్, సిమెంట్ వంటి రంగాల్లో ఉన్న అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని తెలంగాణకు పెట్టుబడులతో రావాలని ఆహ్వానించారు. బయ్యారంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు జేఎస్‌డబ్ల్యూ ముందుకు వస్తే అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. విద్య, క్రీడలు తదితర రంగాల్లోనూ పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని జిందాల్‌ను కోరారు. తెలంగాణ ప్రభుత్వం సాధిస్తున్న ప్రగతి, పెట్టుబడుల విషయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వాన్ని జిందాల్ ప్రశంసించారు.

సీఎం జగన్‌తో సోమేశ్‌కుమార్ భేటీ



సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సోమేశ్‌కుమార్

సాక్షి, అమరావతి/ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ)/గన్నవరం: హైకోర్టు తీర్పుతోపాటు డీఓపీటీ ఆదేశాలతో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పదవి నుంచి రిలీవ్ అయిన సీనియర్ ఐఏఎస్ అధికారి సోమేశ్‌కుమార్ గురువారం సీఎం క్యాంపు కార్యాలయంలో ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీ కేడర్‌కు చెందిన సోమేశ్‌కుమార్ తెలంగాణలో పనిచేయడం కుదరదని తెలంగాణ హైకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఆయన గురువారం ఉదయం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్ జవహర్‌రెడ్డిని విజయవాడలోని సీఎస్ క్యాంపు కార్యాలయంలో కలిసి రిపోర్ట్ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని కలిశారు. సోమేశ్‌కుమార్‌కు రాష్ట్ర ప్రభుత్వం పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది. అనంతరం.. విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను ఆయన దర్శించుకున్నారు.

ఏ బాధ్యతలిచ్చినా ఓకే..

ఇక ఏపీ ప్రభుత్వం ఎటువంటి బాధ్యతలు అప్పగించినా స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలంగాణ మాజీ సీఎస్ సోమేశ్‌కుమార్ గన్నవరం విమానాశ్రయంలో మీడియాకు తెలిపారు.

ఈఎస్ఐ 'కార్పొరేట్' సేవలు మరింత చేరువలో!

- వైద్య సేవల విస్తరణకు డీఐఎంఎస్ కసరత్తు
- జిల్లాకో కార్పొరేట్ ఎంప్యానెల్ ఆస్పత్రి ఉండేలా ప్రతిపాదనలు
- ఈఎస్ఐ కార్పొరేషన్ ఆమోదం లభిస్తే మరో 40 ఎంప్యానెల్ ఆస్పత్రులు అందుబాటులోకి



ఈఎస్ఐ సేవలు ఇలా...

రాష్ట్రంలోని ఈఎస్ఐ చందాదారులు **17.32** లక్షలు..

చందాదారులతో కలిపి ఆధారితులు **72** లక్షలు..

ప్రస్తుతం ఎంప్యానెల్ అయిన కార్పొరేట్ ఆస్పత్రులు	కొత్తగా ఎంప్యానెల్ చేయాలనుకున్న కార్పొరేట్ ఆస్పత్రులు
21	40

సాక్షి, హైదరాబాద్: ఈఎస్ఐ (ఉద్యోగ రాజ్య బీమా) చందాదారులకు వైద్య సేవలను మరింత చేరువలోకి తెచ్చే దిశగా డీఐఎంఎస్ (డైరెక్టర్ ఇన్సూ్యరెన్స్ మెడికల్ సర్వీసెస్) చర్యలు చేపట్టింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఒక సూపర్ స్పెషాలిటీ, మూడు జనరల్ ఆస్పత్రులతోపాటు 71 డిస్పెన్సరీల ద్వారా వైద్య సేవలందుతున్నాయి. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, రెండు జనరల్ ఆస్పత్రులు హైదరాబాద్ సమీపంలో ఉండగా.. మరో రెండు ఆస్పత్రులు వరంగల్, సిర్పూర్‌లో ఉన్నాయి. మిగతా డిస్పెన్సరీలు జిల్లాల్లో ఉన్నప్పటికీ అక్కడ కేవలం అవుట్ పేషెంట్ విభాగాల సేవలతోనే సరిపెడుతున్నాయి. ఈక్రమంలో శస్త్ర చికిత్సలు, మేజర్ చికిత్సల కోసం హైదరాబాద్‌లోని ఆస్పత్రులకు రావాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో చందాదారులకు మరింత మెరుగైన సేవలను వేగంగా అందించేందుకు కొత్తగా ప్రైవేటు కార్పొరేట్ ఆస్పత్రులను ఎంపిక చేయాలని డీఐఎంఎస్ భావిస్తోంది. ఈమేరకు ప్రతిపాదనలను రూపొందించింది.

జిల్లాకో ఆస్పత్రి చొప్పున...

రాష్ట్రంలో ఈఎస్ఐ కార్పొరేషన్ 21 కార్పొరేట్ ఆస్పత్రులను ఎంప్యానెల్ చేసింది. ఇందులో మెజార్టీ ఆస్పత్రులన్నీ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే ఉన్నాయి. అలాకాకుండా రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ జిల్లాలో ఎంప్యానెల్ ఆస్పత్రులు ఉండేలా డీఐఎంఎస్ కార్యాచరణ రూపొందిస్తోంది. జిల్లాకొక కార్పొరేట్ ఆస్పత్రిని ఎంప్యానెల్ చేస్తే సంబంధిత జిల్లా పరిధిలోని చందాదారులకు అత్యవసరంగా మెరుగైన సేవలు అందుతాయనే లక్ష్యంతో ఈ మేరకు చర్యలు చేపట్టింది. ఇందులోభాగంగా రాష్ట్రవ్యాప్తంగా మరో 40 ఆస్పత్రులను ఎంప్యానెల్ చేయాలని భావిస్తోంది. కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతోనూ ఇటీవల సమావేశం నిర్వహించినట్లు తెలిసింది. కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అధ్యక్షతన ఇటీవల జరిగిన ఈఎస్ఐ ప్రాంతీయ బోర్డు సమావేశంలోనూ ఈ అంశంపై చర్చించారు. డీఐఎంఎస్ ప్రతిపాదనలను త్వరలో ఈఎస్ఐ కార్పొరేషన్‌కు పంపాలని నిర్ణయించారు. అక్కడ ఆమోదం వచ్చాక ఆస్పత్రుల తుది ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తారు. ఇదంతా వచ్చే ఏప్రిల్ నాటికి పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు.

సింగరేణి సీఎండీ పదవీకాలం ఏడోసారి పొడిగింపు


- ఇప్పటికే సీఎండీగా 8 ఏళ్లు పూర్తి చేసుకున్న శ్రీధర్
- వరుస పొడిగింపులపై గతేడాది కేంద్రం తీవ్ర అభ్యంతరం

సాక్షి, హైదరాబాద్: సింగరేణి బొగ్గు గనుల సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్(సీఎండీ) ఎన్.శ్రీధర్ పదవీకాలం గత డిసెంబర్ 31వ తేదీతో ముగిసిపోగా, రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మరో ఏడాదిపాటు పొడిగించింది. ఈ మేరకు రాష్ట్ర సాధారణ పరిపాలన, ఇంధన శాఖలు గురువారం ఉత్తర్వులు జారీచేశాయి. 2023 డిసెంబర్ 31 వరకు ఆయన పదవీకాలం పొడిగిస్తున్నట్టు ఉత్తర్వుల్లో రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. 2015 జనవరి 1న సింగరేణి సీఎండీగా ఎన్.శ్రీధర్ బాధ్యతలు స్వీకరించారు. గతేడాది డిసెంబర్ 31తో ఆయన సింగరేణి సీఎండీగా 8 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఇప్పటి వరకు ఆయన పదవీకాలాన్ని ప్రభుత్వం ఆరు పర్యాయాలు పొడిగించింది. సింగరేణి సంస్థ చరిత్రలో శ్రీధర్ 8 ఏళ్లకుపైగా సీఎండీగా వ్యవహరించి రికార్డు సృష్టించారు. సింగరేణి సీఎండీగా శ్రీధర్ పదవీకాలాన్ని పదేపదే పొడిగించడంపట్ల గతేడాది కేంద్ర ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం తెలిపింది. సంస్థ వార్షిక సర్వసభ్య సమావేశం(ఏజీఎం)లో శ్రీధర్ పదవీకాలం పొడిగింపునకు వ్యతిరేకంగా కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ అండర్ సెక్రటరీ ఆల్కా శేఖర్ గతేడాది ఓటు సైతం వేశారు. రాష్ట్ర ప్రభుత్వ వాటాదారుల మద్దతుతో అప్పట్లో పదవీకాలం పొడిగింపు తీర్మానం ఆమోదం పొందింది. సింగరేణి సంస్థలో రాష్ట్ర ప్రభుత్వానికి 51, కేంద్రానికి 49 శాతం వాటాలుండటంతో మెజారిటీ ఓట్ల మద్దతుతో ఈ తీర్మానం నెగ్గింది. పదవీకాలం పొడిగింపును వ్యతిరేకిస్తూ కేంద్ర బొగ్గు గనుల శాఖ ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ సైతం రాసింది. అయినా, కేంద్ర ప్రభుత్వ వ్యతిరేకతను బేఖాతరు చేస్తూ గత రెండేళ్లలో రెండు పర్యాయాలు ఆయన పదవీకాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది.

ఫిబ్రవరిలో 'తెలుగు సేన' బస్సు యాత్ర

ప్రజా గాయకుడు గద్దర్ వెల్లడి

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): కులాల ఔన్నత్యం పెరుగుతోన్న ఈ రోజుల్లో 675 కులాలుగా ఉండి, భౌగోళికంగా విడిపోయిన తెలుగు జాతిని ఐక్యం చేసేందుకు సాంస్కృతిక తెలుగు సేన ముందుకు వచ్చిందని ప్రజా గాయకుడు గద్దర్ తెలిపారు. తెలుగు సేన పేరిట ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. విశాఖలోని వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలుగు సేన అధ్యక్షుడు సత్యారెడ్డి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 10న హైదరాబాద్‌లో బస్సు యాత్రను ప్రారంభించనున్నట్లు చెప్పారు. 10 రాష్ట్రాల్లో భారీ బహిరంగ సభలు, బస్సు యాత్రలు, రోడ్ షోలు నిర్వహిస్తామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో కూడా అన్ని ప్రాంతాల్లో ఈ యాత్ర సాగుతుందని చెప్పారు. తెలుగు వారు ఎక్కడ ఉన్నా ఒక జాతిగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.


JioMart.com
#HarGharKaMart
ఈ మకర సంక్రాంతిని
గొప్ప తగ్గింపు ధరలతో జరుపుకోండి
యాప్‌ను ఇప్పుడే డౌన్‌లోడ్ చేసుకోండి
మొబైల్స్ మరియు ఎలక్ట్రానిక్స్
మా ధర ₹77900*
MRP ₹89900
*Price incl. of HDFC Bank Offer
మా ధర ₹16999*
MRP ₹22999
*Price incl. bank offer
మా ధర ₹28999
MRP ₹41204
మా ధర ₹42990*
MRP ₹69990
*Price excl. of Additional Cashback
With Free Installation within 48 Hours
మా ధర ₹24990
MRP ₹30999
మా ధర ₹19490*
MRP ₹28990
వంటగది మరియు రోజువారీ కిరాణా
రోజువారీ అవసరమైనవి
మా ధర ₹85
MRP ₹120
మా ధర ₹105
MRP ₹149
మా ధర ₹499
MRP ₹1499
మా ధర ₹70
MRP ₹140
మా ధర ₹72
MRP ₹90
46% ఆఫ్
MRP ₹1499
Unless specified, the retail prices shown are for 1 unit of the product.
Terms & Conditions Apply. Offer valid till stocks last and all offers are subject to change without prior intimation/notice. The pictures/photographs of the products shown are for representation purposes only. MRP of all products are inclusive of all taxes. All offers are valid from 12th to 14th January 2023. All disputes are subject to the exclusive jurisdiction of the courts in Mumbai only. *Prices are inclusive of bank offers if and when applicable.


Hero
కొనండి
కొత్త GLAMOUR XTEC
రామ్ చరణ్‌ని
కలుసుకునే అవకాశం పొందండి*
1 బంపర్ ప్రైజ్*
గ్లామర్ XTEC రామ్ చరణ్ ఆటోగ్రాఫ్‌తో
100 లక్కీ కస్టమర్లు*
రామ్ చరణ్‌తో ఫొటోగ్రాఫ్
1000 లక్కీ కస్టమర్లు*
రామ్ చరణ్ ఆటోగ్రాఫ్ గల మర్చండైజ్
70116 70116
MISSED CALL TO CONNECT 8367796950
HeroMotoCorp.com
CALL TOLL-FREE 1800 266 0018
Wheels of Trust
ఏ పాత టూ-వీలర్ అయినా బెస్ట్ రీసేల్ ధరకి ఎక్స్ఛేంజ్ చేసుకొని కొత్త హీరోని ఇంటికి తెచ్చుకోండి.
మరిన్ని వివరాల కోసం www.wheelsoftrust.comని సందర్శించండి.
Hero MotoCorp Ltd. Regd. Office: The Grand Plaza, Plot No.2, Nelson Mandela Road, Vasant Kunj Phase - II, New Delhi - 110070, India. | CIN: L35911DL1984PLC017354 | For further information, contact your nearest Hero MotoCorp authorised outlet or call our toll-free no.: 1800 266 0018 or visit us on www.HeroMotoCorp.com. Accessories and features shown may not be a part of standard fitment. Always wear a helmet while riding a two-wheeler.
AUTHORISED DEALERS – Hyderabad

చెప్పడానికి తగిన మాటలు మనకు దొరకనప్పటికీ, అల్లాహ్ మన ప్రార్థనలను అర్థం చేసుకొంటాడు.
– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, జనవరి, 13

ప్రజాస్వామ్య పరిహాస క్రీడ

కింద పడ్డా పైచేయి నాదే అనడమంటే ఇదే. బ్రెజిల్‌లో ఎన్నికల తుది ఫలితాలొచ్చి రెండున్నర నెలలైనా వాటిలో మతలబు ఉందంటున్న తాజా మాజీ దేశాధ్యక్షుడు జైర్ బోల్సొనారో మాటలు, ఆయన మద్దతుదారుల చేష్టలు అచ్చంగా అలాగే ఉన్నాయి. ఆ దేశ రాజధాని బ్రసీలియాలోనే సైనిక శిబిరాల సమీపంలో మకాం వేసిన బోల్సొనారో భక్తులు సైనిక జోక్యంతోనైనా కొత్త దేశాధ్యక్షుడైన వామపక్ష లూలాను పదవి నుంచి తప్పించాలని పట్టుబట్టడం విడ్డూరం. పది వారాలైనా ఫలితం లేక వందల మంది జనవరి 8వ తేదీ ఆదివారం విధ్వంసానికి దిగిన దృశ్యాలు నివ్వెరపరుస్తున్నాయి.

ఎన్నికల ప్రక్రియపై బురద జల్లి, ప్రజాస్వామ్యానికి పాతర వేసే ప్రయత్నాలు ఆందోళనకరం. సరిగ్గా రెండేళ్ళ క్రితం అధ్యక్ష ఎన్నికల అనంతరం అమెరికాలో జరిగిన పరిణామాలను బ్రెజిల్‌లోని తాజా దాడులు గుర్తుచేస్తున్నాయి. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ఓటమి పాలైనప్పుడు 2021 జనవరి 6న ఆయన మద్దతుదారులు ఇలాగే వ్యవహరించారు. వాషింగ్టన్‌లోని ఆ దేశ పార్లమెంట్ భవనంపై వారు దాడికి దిగితే, తాజాగా బ్రెజిల్‌లో బోల్సొనారో సమర్థకులు అధ్యక్ష భవనం, పార్ల మెంట్ భవనం, సుప్రీమ్ కోర్ట్‌లలో చొరబడి, విధ్వంసం సృష్టించారు. ఓటమి పాలయ్యాక జనంలోకి రాకుండా కాలక్షేపం చేస్తున్న బోల్సొనారో జనవరి 1న లూలా పదవీ ప్రమాణానికి రెండు రోజుల ముందే అమెరికాకు చెక్కేశారు. కొత్త దేశాధ్యక్షుడికి దండాన్ని అందించే సంప్రదాయాన్నైనా పాటించక ముఖం చాటేయడం ఆయన మనోభావాలకీ, వాస్తవ నిరాకరణ దృక్పథానికీ అద్దం.

గత అక్టోబర్ 30న ముగిసిన బ్రెజిల్ ఎన్నికల్లో అతివాద ఛాందస నాయకుడు, అప్పటి దేశాధ్యక్షుడు బోల్సొనారో స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. దేశానికి మరోసారి ఘనకీర్తి కట్టబెడతానని ఎన్నికల వేళ వాగ్దానం చేసిన ఆయన ఓ పట్టాన ఓటమిని జీర్ణించుకోలేకపోతున్నారు. ఆ మాటకొస్తే ఎన్నికల్లో ఓటమికి చాలాకాలం ముందు నుంచే ఆయన ఓ పల్లవి అందుకున్నారు. తానంటూ తిరిగి ఎన్నిక కాకపోతే, అది ఎన్నికల్లో మోసం వల్లేనని పాట పాడసాగారు. ప్రజాతీర్పు ప్రతికూలంగా వచ్చాకా ఆ మాటే ప్రచారంలో పెడుతున్నారు. ఆయన సమర్థకుల్లో నల్లవాళ్ళు, తెల్లవాళ్ళు – ధనికులు, పేదలు – యువకులు, వృద్ధులు... ఇలా అందరినీ కలిపిన సూత్రం – కమ్యూనిజమ్‌పై విద్వేషం. అంతా కలసి పార్లమెంటరీ చిహ్నాలపై దాడి చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధం.

ఈ ఘర్షణల్లో తన ప్రమేయం లేదని బోల్సొనారో చేతులు దులుపుకొంటున్నారు. కానీ, ప్రాసంగిక సాక్ష్యాధారాలు విరుద్ధంగా ఉన్నాయి. రాజకీయ ప్రత్యర్థులను 'దొంగలు'గా పేర్కొంటూ, తాను ఓడిపోతే హింస తప్పదని ఎన్నికలప్పుడే ఆయన సెలవిచ్చారు. ఫలితాలు ప్రకటించిన నాటి నుంచి నేటికీ సాగుతున్న ఆయన సమర్థకుల నిరసనలు, విధ్వంసాలు అందుకు ఆచరణరూపమే. వాట్సప్, టెలిగ్రామ్ ద్వారా అనేక రోజుల క్రితమే ఈ దాడులకు వ్యూహం, నిర్వహణ జరిగిందట. బ్రెజిల్‌లోని వివిధ రాష్ట్రాల నుంచి పదులకొద్దీ బస్సుల్లో వచ్చి, విధ్వంసం రేపిన వ్యక్తుల వెనుక బోల్సొనారో పాలనలో యథేచ్ఛగా సాగిన పర్యావరణ విధ్వంసక వర్గాల డబ్బు ఉందనీ వినిపిస్తోంది. ప్రజాస్వామ్య పాలనను అడ్డుకోవాలనే ఈ తెర వెనుక వ్యక్తుల వ్యవహారం మరింత ఆందోళనకరం.

రెండుసార్లు అధ్యక్షుడిగా పనిచేసి, 2.5 కోట్ల మందిని దారిద్ర్యం నుంచి విముక్తి కల్పించిన చరిత్ర లూలాది. కమ్యూనిజాన్ని బూచిగా చూపి, అవినీతి ముద్ర వేసి ఓటర్ల దృష్టి మరల్చి, పబ్బం గడుపుకోవాలన్న బోల్సొనారో పాచిక తాజా ఎన్నికల్లో పారలేదు. అదీ స్వయంకృతమే. దేశంలో 7 లక్షల పైగా మరణాలతో కరోనా కట్టడిలో వైఫల్యం, అమెజాన్ అడవుల నరికివేత, కునారిల్లిన ఆర్థిక వ్యవస్థ వగైరా ఆయనకు శాపాలయ్యాయి. అయితే, వర్గాలుగా చీలిన సమాజంలో లక్షలాది ప్రజల్లో ఎన్నికల ఫలితాలపై అపనమ్మకం, లూలా అన్నా, వామపక్షమన్నా లేనిపోని భయం కలిగించడంలో బోల్సొనారో కొంత విజయవంతమైనట్టే ఉన్నారు. ఇప్పుడదే దేశానికి పెనుశాపం. తాజా విధ్వంసాలను ఆ కోణంలోనూ చూడాలి. బాధ్యులను గుర్తించి, దురంతాలను ఉక్కుపాదంతో అణచాలి.

1980లలో నిరంకుశత్వం నుంచి బ్రెజిల్ బయటపడినా, బోల్సొనారోకు సైనిక నియంతృత్వం పైనే మక్కువ. ప్రజాస్వామ్య సంస్థల పట్ల గౌరవం లేని ఆయన అధికారంలో ఉన్నప్పుడు తీవ్ర మితవాదులతో, సంపన్న వర్గాలతో అంటకాగారు. ఆ ప్రయోజనాలకు లూలా అడ్డు అన్నదే ఆయన కడుపు మంట. ఈ సవాలును కొత్త అధ్యక్షుడు ఎంత సమర్థంగా ఎదుర్కొంటారో చూడాలి. ఫాసిస్టు ధోరణులకు అడ్డుకట్ట వేసి, ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజల్లో నమ్మకం, గౌరవం కలిగించడం తక్షణ లక్ష్యం. ట్రంప్ ప్రవర్తన నుంచి ప్రేరణ పొందిన బోల్సొనారో ఇకనైనా మూర్ఖత్వం వీడాలి. ఓటమిని హుందాగా అంగీకరించాలి. రాజ్యాంగానికి కట్టుబడేలా తన మద్దతుదారులకు నచ్చజెప్పాలి.

ఆగని ఈ ఎన్నికల సంక్షోభం నుంచి ఎంత తొందరగా బయటపడితే 21.5 కోట్ల బ్రెజిలియన్లకూ అంత మంచిది. 'బ్రిక్స్' గ్రూపులో సభ్యదేశంగా, ద్వైపాక్షికంగా బ్రెజిల్‌తో భారత్‌కు సత్సంబంధాలున్నాయి. బోల్సొనారోను గతంలో మిత్రుడిగా భావించిన ప్రధాని మోదీ సైతం ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారిన తాజా ఘటనల్ని ఖండించారు. ప్రపంచంలోని మిగతా ప్రజాస్వామ్యాలూ ముందుకొచ్చి, మితవాద విద్రోహులకు ఊతమివ్వబోమని తెలిసేలా చేయాలి. ప్రజాస్వామ్య సుస్థిరతకు భంగం కలిగే ఏ పరిణామం వాంఛనీయం కాదు. ఎందుకంటే, బ్రెజిల్ హింసాత్మక గతాన్ని విస్మరించలేం. నియంతృత్వాలకూ, నిరంకుశత్వానికీ పేరుబడ్డ దక్షిణ అమెరికాలో కేవలం కొన్ని పదుల వసంతాల ఈ యువ ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఆ దేశ ప్రజలు, పార్టీలదే!

విధానాల శాపమే... ఈ పాపం!

విశ్లేషణ



దినేశ్ సి. శర్మ

బద్రీనాథ్ పవిత్ర మందిరానికి ప్రవేశ ద్వారం అయిన ఉత్తరాఖండ్‌లోని జోషీమఠ్ కుంగిపోవడం పాలకుల పర్యావరణ పట్టింపులేనితనానికి నిదర్శనం. కొండచరియలు విరిగిపడే ఈ భౌగోళిక సున్నిత ప్రాంతంలో సొరంగాల తవ్వకం, పేల్చడం వంటి నిర్మాణ పనులు చేయకూడదు. అయినా అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టుల కోసం కేంద్రం హద్దుల్లేని మద్దతిచ్చింది. ఇది సరిపోదన్నట్టుగా, ఈ కొండల్లో 800 కిలోమీటర్ల పొడవైన నాలుగు లేన్ల 'చార్‌ధామ్ హైవే ప్రాజెక్టు'ను ప్రారంభించింది. పైగా పర్యావరణ చట్టాల్లో 123 క్రమబద్ధీకరణ మార్పులను తీసుకొచ్చారు. ప్రధాని కార్యాలయం చార్‌ధామ్ వంటి ప్రాజెక్టులను నేరుగా పర్యవేక్షిస్తున్నప్పుడు, జోషీమఠ్ కుంగిపోతున్న ఘటనకు వారే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

జోషీమఠ్ కుంగిపోతోంది. ఈ ప్రాంతంలోని 600 ఇళ్లు బీటలు వారాయి. డజన్లకొద్దీ కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. హోటల్స్ వంటి కొన్ని వాణిజ్య భవనాలు అనిశ్చితంగా ఒకదానిపై ఒకటి ఒరిగిపోయాయి. సముద్ర మట్టానికి 6 వేల అడుగుల ఎత్తులో ఉండే ఈ పట్టణం 'చార్ ధామ్'లలో ఒకటైన బద్రీనాథ్ పవిత్ర మందిరం, హేమ్‌కుండ్ సాహిబ్ దగ్గరి సిక్కు తీర్థయాత్రా స్థలం, ఔలి దగ్గరి స్కీయింగ్ ఆకర్షణకు ప్రవేశ ద్వారం. హిమాలయాల్లో పర్యావరణపరంగా సున్నితమైన ప్రాంతంలో జోషీమఠ్ ఉంది. సాపేక్షికంగా యువ పర్వతమైన దీని భౌగోళికత ఇతర పర్వతాలతో పోలిస్తే భిన్నమైంది. సమీపంలోని హాథీ పర్వతం, ఔలి స్థిరమైన శిలలపై ఏర్పడి ఉండగా, జోషీమఠ్ ప్రాచీన కొండ చరియలలో భాగంగా ఉన్న స్థిరపడని బండరాళ్లతో ఏర్పడింది. అందువల్ల ఇది కొండచరియలు విరిగిపడే ప్రాంతం. ఇక్కడ సొరంగాల తవ్వకం, పేల్చడం వంటివి చేస్తే నేలకు భంగం కలుగుతుంది.

1970లో ఒక కొండ నుంచి పెద్ద బండరాయి విడివడి అలకనంద నదిలో పడిపోయింది. ఆ ప్రాంతంలో పెరిగిన నిర్మాణ కార్యకలాపాలు, పెరుగుతున్న జనాభా ఒత్తిడి వంటివే ఇలా కొండ చరియలు విరిగిపడటానికి కారణం అవుతున్నాయని డజన్ల కొద్దీ శాస్త్రీయ అధ్యయనాలు నిర్ధారించాయి. స్థానిక ప్రజలకు రోడ్లు, నీటి సరఫరా, మురుగు నీటి వ్యవస్థ, స్థానిక వినియోగం కోసం చిన్న జలవిద్యుత్ ప్రాజెక్టు వంటివి హేతుబద్ధమే కావొచ్చు. కానీ వరుసగా ఏర్పడుతూ వచ్చిన ప్రభుత్వాలు ఈ ప్రాంతంలో హైవేలు, జలవిద్యుత్, మౌలిక వసతుల అభివృద్ధి వగైరా అతిపెద్ద ప్రాజెక్టులకు తెరతీశాయి. జోషీమఠ్ వంటి ఘటనలకు ప్రకృతిని, వాతావరణ మార్పును లేదా స్థానిక ప్రజలను తప్పు పట్టి ప్రయోజనం లేదు. ఇవన్నీ న్యూఢిల్లీలో రూపొందిస్తున్న విధానాలు కలిగిస్తున్న విపత్తుల ఫలితమేనని కింది కారణాల వల్ల చెప్పవచ్చు.

మొదటి కారణం, 2013 కేదార్‌నాథ్ విషాదం జరిగిన తర్వాత కూడా ఈ ప్రాంతంలో అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం హద్దుల్లేని మద్దతును ఇవ్వడమే. ఉత్తరాఖండ్‌లో ఉనికిలో ఉన్న, నిర్మాణంలో ఉన్న జలవిద్యుత్ ప్రాజెక్టుల సుదీర్ఘ మన్నిక; అస్థిరమైన జోన్లలో అధిక అవక్షేపాల భారం... తీవ్ర సమస్యలుగా ఉంటూనే వచ్చాయి. దీన్ని దృష్టిలో ఉంచుకునే సుప్రీంకోర్టుచే నియమితులైన నిపుణుల బృందం, 'మెయిన్ సెంట్రల్ థ్రస్ట్' (ఎమ్‌సీటీ)పై ఉన్న భూభాగాన్ని సాధారణంగానూ, పేరుకుపోయే చలికాలపు మంచు భూభాగాన్ని ప్రత్యేకంగానూ జలవిద్యుత్ పనుల నుంచి దూరంగా ఉంచాలని సూచించింది.

2014 డిసెంబర్‌లో పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ ఒక అఫిడవిట్ దాఖలు చేసింది. 2013లో వరదలు ముంచెత్తడానికి జలవిద్యుత్ ప్రాజెక్టులు ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావం చూపుతున్నాయని ఇందులో పేర్కొంది. కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ కూడా ఈ ప్రాంతంలో నివసించే ప్రజల భద్రతను పరిరక్షించడానికి ఇలాంటి ప్రాజెక్టులపై సమీక్ష అత్యవసరమని 2016లోనే సుప్రీంకోర్టుకు తెలిపింది. అయితే 2013 నుంచి ఈ ప్రాంతంలోని ఏ జలవిద్యుత్ ప్రాజెక్టును కూడా సమీక్షించడం కానీ, నిలిపి వేయడం కానీ జరగలేదు. వివిధ మంత్రిత్వ శాఖలకు చెందిన ఈ అఫిడవిట్లన్నీ కాగితాల మీదే ఉండిపోయాయి.



హిమాలయాలపై జలవిద్యుత్ ప్రాజెక్టుల దాడి సరిపోలేదని కాబోలు... కేంద్ర ప్రభుత్వం 2016లో ఈ కొండల్లో 800 కిలోమీటర్ల పొడవైన నాలుగు లేన్ల 'చార్ ధామ్ హైవే ప్రాజెక్టు'ను ప్రారంభించింది. దీనికోసం మైదానాల్లో ఉండే విధంగానే రోడ్డుకు ఇరువైపులా ఖాళీ ప్రాంతంతో 12 మీటర్ల వెడల్పు డబుల్ లేన్‌ను డిజైన్ చేశారు. అంటే వందలాది చెట్లను విచ్చలవిడిగా నరకడం, కొండ వాలులను అస్థిర పరచడం, సహజమైన ఊటలను ధ్వంసం చేయడం, వీటితో పాటు లోయల కింది భాగంలో చెత్త, వ్యర్థాలను కుప్పతెప్పలుగా పోయడం అని అర్థం.

ఈ ప్రాజెక్టును మదింపు చేయడానికి సుప్రీంకోర్టు నియమించిన అత్యున్నత సాధికారిక కమిటీ ఈ ప్రాంతంలో పర్యావరణ విధ్వంసానికి రోడ్డు వెడల్పే ప్రత్యక్ష కారణంగా ఉంటోందని భావించింది. అందుకని వెడల్పును తగ్గించినట్లయితే నష్టాన్ని కనీస స్థాయికి తగ్గించే అవకాశముందని పేర్కొంది. నిజానికి 5.5 మీటర్ల 'క్యారేజ్ వే'తో పర్వత ప్రాంత రోడ్లను భిన్నంగా డిజైన్ చేయాలని సూచిస్తూ 2018లోనే రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ ఒక సర్క్యులర్ జారీ చేసింది. కానీ తన సొంత నిబంధనలను అదే లెక్కచేయకుండా, ఆ సర్క్యులర్‌ను కోర్టు నియమించిన ప్యానెల్‌కు కూడా చూపకుండా దాచింది. బలహీనమైన పర్వత ప్రాంతాల్లో వెడల్పాటి హైవే నిర్మాణం కోసం ఒత్తిడి చేయడం ద్వారా రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ పర్యావరణ విధ్వంసం జరగడాన్ని అనుమతించింది.

రెండో కారణం, ప్రాజెక్టుల కోసం పర్యావరణ నిబంధనలను పాతరేయడానికి సాహసించడమే. అన్ని భారీ ప్రాజెక్టులూ పర్యావరణ ప్రభావ మదింపు (ఈఐఏ)నకు లోబడి ఉండాలి; పర్యావరణ నిర్వహణ పథకాన్ని(ఈఎంపీ) తప్పనిసరిగా కలిగి ఉండాలి. రోడ్డు ప్రాజెక్టుల కోసం, ఈఐఏ పరిధి 100 కిలోమీటర్లు మాత్రమే. కానీ ఈ నిబంధన నుంచి తప్పించుకోవడానికి చార్ ధామ్ ప్రాజెక్టును ఒక్కొక్కటీ 100 కిలోమీటర్ల కంటే తక్కువ ఉండేలా 53 ప్రాజెక్టులుగా విభజించారు. కాబట్టి పర్యావరణంపై అవిచ్ఛిన్నమైన, సంచిత ప్రభావాలు ఉంటున్నట్లు తెలుస్తున్నప్పటికీ ఎలాంటి క్రమబద్ధీకరణ, తనిఖీ లేకుండా; ప్రతిక్రియాత్మక పర్యావరణ నిర్వహణ పథకం లేకుండా ప్రాజెక్టును ప్రారంభించేశారు. సరళతర వాణిజ్యం కోసం ప్రభుత్వం పర్యావరణ నిబంధనలకు తూట్లు పొడవడం కూడా అతిపెద్ద సమస్య అయింది. 2020 మార్చ్ నుంచి 2022 మార్చ్ వరకు పర్యావరణ చట్టాల్లో 123 క్రమబద్ధీకరణ మార్పులను తీసుకొచ్చారని 'విధి సెంటర్ ఫర్ లీగల్ పాలసీ' చేసిన అధ్యయనం తెలిపింది. ఈ మార్పుల్లో నాలుగింట మూడొంతులు చట్టాలను సడలించడానికీ, చట్టబద్ధమైన అవసరాలకు మినహాయింపులు ఇవ్వడానికీ సంబంధించినవే కావడం గమనార్హం.

మూడో కారణం ఏమిటంటే, ధార్మిక పర్యాటకం పేరుతో దాని సామర్థ్యాన్ని పట్టించుకోకుండా, పర్యావరణ సున్నిత ప్రాంతాల్లో విచ్చలవిడి టూరిజాన్ని ప్రోత్సహించడమే. హైవే ప్రాజెక్టుకు అదనంగా ప్రభుత్వం చార్ ధామ్ ప్రాంతంలో రైలు సర్వీసులను, రోప్ వేలను ప్రవేశపెట్టడానికి పథకాలు రూపొందిస్తోంది. క్రితంసారి కేదార్‌నాథ్‌ను సందర్శించిన సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ– రైళ్లు, రోడ్లు, రోప్ వేలు తమతో పాటు ఉద్యోగాలను కొనితెస్తాయనీ, జీవితాన్ని సులభతరం చేసి సాధికారతను కలిగిస్తాయనీ గొప్పగా ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీ దాదాపు 17 గంటలపాటు ఏకాంతంలో గడిపిన ధ్యాన గుహ భక్తులకు ముఖ్య ఆకర్షణ కేంద్రంగా మారిపోయింది. దీని ఫలితంగా ఇలాంటి మరో మూడు ధ్యాన గుహలను పర్యాటకుల కోసం నిర్మిస్తున్నారు.

అంతిమంగా, జోషీమఠ్‌లో విపత్తు కలిగిన తర్వాత కూడా ప్రభుత్వ స్పందన మిడిమిడి జ్ఞానంతోనే ఉంటోంది. ప్రధాని కార్యాలయం నిర్వహించిన ఒక సమావేశంలో, ఈ ప్రమాదంలో 350 మీటర్ల కొండ ప్రాంతం మాత్రమే ప్రభావితమైందని తేలికచేసి మాట్లాడారు. ప్రధానమంత్రి, ప్రధాని కార్యాలయం ఛార్ ధామ్ వంటి ప్రాజెక్టులను నేరుగా పర్యవేక్షిస్తున్నప్పుడు, జోషీమఠ్ కుంగిపోతున్న ఘటనకు వారే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఆకర్షణీయమైన ప్రదర్శనలు కాకుండా, నిజమైన ప్రతిక్రియకు పూనుకోవాల్సిన సమయం ఇది!

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పట్టించుకోకూడని క్రీడా?



హాకీ మీద ప్రధాన స్రవంతి మీడియా, భారత పెద్ద పత్రికల్లో ఏ కవరేజీ లేకపోవడం నిరుత్సాహం కలిగిస్తోంది. రేపు హాకీ ప్రపంచ కప్ ప్రారంభం అవుతోంది. ఇండియా ఆతిథ్యం ఇస్తోంది. ఏ వ్యాసాలు లేవు. కనీసం మన క్రీడాకారుల పైన కూడా. మనకు మంచి హాకీ జర్నలిస్టులు ఉన్నారు. వాళ్లకు దయచేసి కొంత స్థలం ఇవ్వండి.

– వీరేన్ రస్కిన్హా, హాకీ మాజీ కెప్టెన్

విచారిస్తావ్!



పాకిస్తాన్ నుంచి విచారంగా తిరిగొచ్చాను. ఊహించలేనంత గందరగోళంగా ఉంది పరిస్థితి. ఏ ఆశా లేదు. నేను కలిసిన అందరూ(పాత్రికేయులు, సివిల్ సర్వెంట్లు, రాజకీయ నాయకులు, ట్రాఫిక్ పోలీసులు, క్యాబ్ డ్రైవర్లు, వ్యాపారులు) భవిష్యత్ మీద ఆతురత, అనిశ్చితి, నిరాశతోనూ; ఎలాగైనా దీన్నుంచి బయట పడాలన్న తెగింపుతోనూ ఉన్నారు.

– అకీల్ షాహ్, ప్రొఫెసర్

చావాల్సిందేనా?



మహిళా రోగులకు మగ వైద్యులు చికిత్స చేయకూడదంటూ తాలిబన్లు ఉత్తర్వులిచ్చినట్టు వార్తలొచ్చాయి. అంటే, మహిళలను విశ్వవిద్యాలయాలకు వెళ్లకుండా, వాళ్లు వైద్యులు కాకుండా నిషేధిస్తారు. మళ్లీ మగ వైద్యులతో వైద్యం చేయించుకోకూడదు. వాళ్లు మరేం చేయాలి? రోగంతో చచ్చిపోవడమేనా?

– షబ్నమ్ నసీమీ, అఫ్గాన్ మాజీ సలహాదారు

పేరుకే భయమా?



తమిళ'నాడు' అనే మాట (తమిళ నాడు గవర్నర్) రవికి విభజన వాదంలా వినబడితే, మరి మహా'రాష్ట్ర'? ఇంకా నాగా'లాండ్'?

– చంద్రు, వ్యాఖ్యాత

కఠిన సత్యం



పెద్దవాళ్లవుతున్నాకొద్దీ ఎదుర్కోవాల్సిన కఠినమైన అంశం, తల్లిదండ్రులు వృద్ధులుగా మారడాన్ని చూస్తుండటం!

– మినీ చౌదరి, న్యాయవాది

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com

ప్రజల ఆకాంక్షలే అజెండాగా...

అభిప్రాయం



జూలూరి గౌరీశంకర్

దేశ రాజకీయాలను ప్రభావితం చేసే చారిత్రాత్మక వేదికగా ఖమ్మం సిద్ధమైంది. ఒకనాడు ఎర్రకోటగా ఉన్న స్తంభాద్రి ఇప్పుడు ఎర్రకోటపై ప్రజల అజెండాను ఎగురవేసే ఒక మహాశక్తికి శంఖారావ క్షేత్రం అవుతోంది. బీఆర్‌ఎస్ ఒక మహోన్నత సమాజ నిర్మాణం వైపు అడుగులు వేస్తూ సృజనాత్మక మార్పుకు నడుంబిగించే సభకు ఖమ్మం గుమ్మం స్వాగతం పలుకుతోంది.

దేశం అన్ని రంగాల్లో దివాళా తీసింది. ఎంతో స్ఫూర్తితో నిర్మించుకున్న ప్రభుత్వ రంగం కొడిగట్టే దీపమవుతోంది. అనేక ప్రభుత్వ రంగ సంస్థలు మూతపడుతున్న తరుణంలో ఖమ్మం వేదికగా బీఆర్‌ఎస్ గొంతు విప్పబోతుంది. ఎమర్జెన్సీ తర్వాత అన్ని ప్రజాస్వామిక హక్కులు కాలరాయబడటంతో ప్రజాస్వామ్య పరిరక్షణకు కదిలిన లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ వెంట దేశం నడిచింది. ఆనాడు ప్రజాస్వామ్య పరిరక్షణకు లెఫ్ట్, రైట్‌లందరూ కలిసి నడిచారు. ఇవ్వాళ కూడా కేంద్రంలో పెద్దలు రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేస్తున్న తీరును చాటిచెబుతూ దేశంలోని ప్రజాస్వామిక శక్తులందర్నీ కూడగట్టవలసిన అవసరం ఉంది. దేశానికి అత్యవసరమైన ఆర్థిక విధానాలను రచించుకోవాలి. 2014 నుంచి దేశం ఉత్పత్తిని పెంచుకోవటంలో పూర్తిగా వెనుకడుగు వేస్తూ ఉంది. ప్రభుత్వ రంగ ఆస్తులను మాత్రం తెగనమ్మటంలో ముందుంది. తక్షణం ఈ అమ్మకాల నుంచి దేశాన్ని కాపాడాలి. సహజ వనరులను, అడవి సంపదలను గుత్తకు అప్పజెబుతున్న తీరుకు అడ్డుకట్టవేయాలి. నానాటికీ పెరుగుతున్న నిరుద్యోగాన్ని తగ్గించడానికి యువతను ఉత్పత్తి రంగంలో ఎక్కువగా వాడుకోవాలి.

భారీగా పెరిగిపోయిన ప్రైవేట్ రంగంలోనూ రిజర్వేషన్లు అమలు జరపాలి. అంబేడ్కర్ పేరు జెప్పి ఆయన ఆశయాలను నిర్వీర్యం చేస్తున్న తీరును ఎత్తి చూపాలి. ఒక కులానికి వ్యతిరేకంగా మరొక కులాన్నీ, ఒక మతానికి వ్యతిరేకంగా మరో మతాన్నీ రెచ్చగొట్టి విద్వేష భారతాన్ని రచిస్తున్న తీరుకు అడ్డుకట్టవేయాలి. భారత గడ్డపై పుట్టిన వాళ్లనే పరాయి వాళ్లను చేస్తున్న తీరు ప్రమాదకరమైనది. దేశభక్తి కావాలి కానీ విద్వేషభక్తి ఉండకూడదు. ఒక్క భాషపైననే ప్రేమకాకుండా దేశ ప్రజలు మాట్లాడే అన్ని భాషలపై ప్రేమ ఉండాలి. ఇతరులపై గుడ్డి ద్వేషాన్ని పెంచే భావజాలం ఏదైనా అది విషాన్ని నింపటం కంటే ప్రమాదకరమైనది. చివరకు పాఠ్యప్రణాళికల్లో కూడా మతభావనలు చూపించే దశకు పోవటం అన్యాయమని ఎవరైనా అడిగితే వారిని జాతి వ్యతిరేకి అంటున్నారు. లౌకిక ప్రజాస్వామిక వ్యవస్థలను పరిరక్షించకపోతే దేశం కుప్పకూలుతుంది. మహాత్మాగాంధీ, జ్యోతిబాపూలే, బాబాసాహెబ్ అంబేడ్కర్ అనంతర భారతం ఇదేనా? దేశాన్ని సంపన్న భారతం చేయమంటే వలసల భారతంగా మార్చేశారు. వారి దుందుడుకు విధానాల పట్ల మొత్తం జాతిని మేల్కొలిపి ముందుకు నడిపించటానికే ఖమ్మం వేదికగా ప్రజల అజెండాకు రూపకల్పన జరుగుతోంది. కమండలాలకు సరైన సమాధానం చెప్పి బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవం నిలిపిన లల్లూప్రసాద్ యాదవ్‌లాగా, ములాయంసింగ్ యాదవ్‌లాగా, ఒక వీపీసింగ్ లాగా దేశంలోని వలస భారతానికి ధైర్యం చెప్పే సత్తా ఒక్క కేసీఆర్‌కే ఉంది.



తమకు అనుకూల రాష్ట్ర ప్రభుత్వాలపై ఒక పద్ధతీ, తమకు వ్యతిరేకంగా ఉండే ప్రభుత్వాలపైన కక్షకట్టే రాజకీయాలూ పోవాలి. తమకు అనుకూలురైన సీఎంలు లేకపోతే గవర్నర్‌తో పాలిస్తామనే సంస్కృతి ఫెడరల్ వ్యవస్థను పెను ప్రమాదంలో పడవేస్తుంది.


సంప్రదాయాల్లోకి, విశ్వాసాల్లోకి, నమ్మకాల్లోకి, మతాల్లోకి, కులాల్లోకి, గనుల్లోకి, గుడుల్లోకి, బడుల్లోకి, వనాల్లోకి, అడవుల్లోకి మన ఇంటి గడపల్లోకి, మంది మెదడుల్లోకి అన్నిట్లోకీ తమ పాత భావాలను, ఛాందసత్వాన్ని చొప్పించి ప్రజాస్వామ్యాన్ని లౌకికత్వాన్ని అవహేళన చేస్తున్నారు. ఎవరు తమను ప్రశ్నించినా ఈడీలు, బేడీలు వేస్తున్నారు. అన్ని వ్యవస్థలూ కళ్లముందే ధ్వంసం అవుతున్నప్పుడు ఇదేమి న్యాయమని అడిగితే నేరుగా జైలుకే పంపించేస్తున్నారు. ఇది ఫాసిజం కంటే ప్రమాదకరమైనది.

ఇపుడు తక్షణంగా దేశాన్ని రక్షించుకునేందుకు దేశభక్తియుత ఉద్యమాలు రావాలి. అటువంటి ఉద్యమాన్నే కేసీఆర్ ఖమ్మం వేదికగా ప్రారంభిస్తున్నారు. ఆ ఉద్యమంలో దేశ ప్రజ అంతా భాగం కావాలి.

వ్యాసకర్త చైర్మన్,
తెలంగాణ సాహిత్య అకాడమీ
(జనవరి 18న ఖమ్మంలో బీఆర్‌ఎస్ జనగర్జన)

రాజకీయ సంక్రాంతి

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

జిద్దు ఇడ్వని విక్రమార్కుడు మోటర్ దీస్కోని బొందల గడ్డ దిక్కు బోయిండు. రొండం త్రాల బంగ్లల బేతాలుడుం టున్నడు. ఆకలైతున్నా బేతాలునికి వొండుకోబుద్ధి గాలేదు. నాబి కాడ సల్లబడితె నవాబ్ కైన జవాబ్ జెప్పొచ్చు అనుకోని ఆన్‌లైన్ల చికెన్ బిర్యాని దెప్పిచ్చుకుండు. తిన్నంక కతల వయ్యి సద్దుకుంట గూసున్నడు.

సరింగ నాత్రి ఒకటి గొట్టంగ, విక్రమార్కుడు హారన్ గొట్టిండు. బేతాలు డింట్ల కెల్లి ఇవుతలికొచ్చిండు. మోటరెక్క సీట్ల ఆరాంగ గూసున్నడు. ఎప్పటి లెక్కనే విక్రమార్కుడు మోటర్ నడ్పలేదు. ఎన్కకు దిర్గి సకినాలు, సూల ముద్దలు ఇచ్చిండు.

''గియెందుకిస్తున్నవ్?'' అని బేతాలుడు అడిగిండు.

''సంక్రాతి పండ్గని.''

''లీడర్లు బిర్యాని పొట్లాలు ఇచ్చిన తీర్గ ప్రేమతోని నువ్వు గివ్వి నాకిచ్చినందుకు శెనార్తిలు. ఏం పండ్గనో ఏమో! ఒక్క దినం ఏసంకు మూతి మీసం గొర్గిచ్చుకును డెందుకో! అన్ని పండ్గలేమొగని సంక్రాతి పండ్గకు అందరు సంత ఊర్లకు బోవాలనుకుంటరు. మోకేకా ఫాయిదా ఉటాయించి బస్సు చార్జిలు డబల్, త్రిబల్ జేస్తరు. రేల్ గాడిలల్ల నిలబడెతందుక్క గూడ జాగ దొర్కదు. భారత్ జోడో అన్కుంట రాహుల్ గాంధి పాదయాత్ర జేస్తున్నడు. బండి సంజయ్, రేవంత్ రెడ్డి, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమారే గాకుంట యువగళం పేరు మీద లోకేశ్ గుడ్క పాదయాత్రలు జేస్తమంటున్నరు. గాల్ల తీర్గనే పాదయాత్ర జేస్కుంట పండ్గకు ఊర్లకు బోతె బాగుంటదని జెన మనుకుంటున్నరు. యథా లీడర్ తథా క్యాడర్.''

''ముగ్గుల సంగతేంది?''

''కిసాన్ సర్కార్ అన్కుంట బీఆర్‌ఎస్, రామరాజ్జెమన్కుంట బీజేపీ, ఇందిరమ్మ సర్కార్ అన్కుంట కాంగ్రెస్ జెనంను ముగ్గుల దించెతందుక్క ఒక్క తీర్గ కోషిస్ జెయ్యబట్టినయి.''

''పతంగులెక్కిస్తున్నరా?''

''ఫాంహౌస్‌ల సుతాయించిన మాంజతోని బీఆర్‌ఎస్ పతంగు లెక్కిస్తున్నది. ఈడీ, సీబీఐ మాంజతోని బీజేపీ పతంగులెక్కిస్తున్నది. సర్పంచుల మాంజ సుతాయించి కాంగ్రెస్ పతంగులెక్కిస్తున్నది. మేడినిండియా మాంజ అనుకుంటనే చైన మాంజతోని బీజేపీ పతంగులెక్కిస్తున్నదని అనుకుంట ఆల్ పిరీ మాంజతోని ఆప్ పతంగులెక్కిస్తున్నది. సీపీఐ, సీపీఎం తోక పతంగులు ఎక్కిస్తున్నయి. బీఆర్‌ఎస్, బీజేపీ పతంగుల నడ్మనే పేంచి నడుస్తున్నది'' అని బేతాలుడన్నడు.



''రాజకీయ బోగి మంటలు గిన ఉన్నయా?''

''ఎందుకు లెవ్వు. లీడర్లు దినాం జెనంల మంటలు బెడ్తున్నరు. గీ నెలల కమ్మంల బీఆర్‌ఎస్ లచ్చల మందిల మంట బెడ్తది. బీజేపీ గుడ్క గిదే నెలల లష్కర్ల లచ్చల మందితోని మంటలు షురువు జేస్తనని జెప్పింది. జన సేన, టీడీపీ గల్సి ఆంద్రల మాటల మంటలు బుట్టిస్తమంటున్నయి. అమెరికల డల్లాస్ల గుడ్క తెలుగోల్ల నడ్మ కులం, రాజకీయ మంటలు లేసినయి.''

''రాజకీయ కోడి పందాల సంగతేంది?''

''సంక్రాంతనంగనే కోడి పందాలే యాదికొస్తయి. కోల్ల కాల్లకు చిన్న కత్తులు గట్టి దంగలకిడుస్తరు. గవ్వి ఒక్క తీర్గ ఫైటింగ్ జేస్తయి. గా కోల్ల మీద కోట్ల రూపాయలు బిట్టు గడ్తరు. గీ నడ్మ ఆన్‌లైన్ కోడి పందాలు షురువు జేసింద్రు. గివ్వి యాదాదంత నడుస్తనే ఉంటాయి. లీడర్ల నడ్మ దినాం తిట్ల పందా లుంటయి. గీ రాజకీయ కోల్ల నాల్కలే కత్తులు. అసల్ కోడి పందాలల్ల రెండు కోల్లు ఉంటె ఒకటి సస్తది. రాజకీయ కోల్ల పందాలల్ల ఒక కోడి ఓడి పోతె ఇంకొక కోడి గెలుస్తది. గియ్యాల ఓడిన కోడి రేపు గెల్సినా గెలుస్తది. సంక్రాతి దినాలల్ల నోములు జేసేటి ఆడోల్లు వాడకట్టుల సకినాలు, సూల ముద్దలు బంచుతరు. కుర్సి నోములు జేసేటి లీడర్లు కొత్త కొత్త పద్కాలు బెట్టి జెనంకు రూపాయలు బంచుతరు. నిండ ముంచుతరు.''

''వహవ్వా, ఏం చెప్పినవ్ బేతాలా!''

''గది గంట్లుండ నియ్యి. ఉప్పరిపల్లి మూసీ నది ఒడ్డుకు మొసల్లు ఎందుకొచ్చినయి. గీ సవాల్కు జవాబ్ ఎర్కుండి గూడ జెప్పకుంటివా అంటె నీ మోటర్ బిరక్ ఫేలైతది'' అని బేతాలుడన్నడు.

''బేతాలా! సంక్రాతిని మకర సంక్రాంతంటరు. మకరము అంటె మొసలి. రాజకీయ మొసల్లు ఎట్లున్నయో అర్సుకునేతందుక్క పండ్గ నాడు అసలు మొసల్లు మూసీ నది ఒడ్డుకొచ్చినయి'' అని విక్రమార్కుడు జెప్పిండు.

చౌరస్తల రెడ్ సిగ్నల్ బడ్డది. మోటరాగింది. ఎన్క తలుపు దీస్కోని కిందికి దిగిన బేతాలుడు బొందలగడ్డ దిక్కు ఉర్కిండు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
మొబైల్: 99591 50491

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్‌నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్యమాసం, **తిథి:** బ.షష్ఠి ప.1.58 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** ఉత్తర ప.1.07వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** రా.9.51 నుండి 11.31 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.51 నుండి 9.33 వరకు, తదుపరి ప.12.31 నుండి 1.15 వరకు, **అమృతఘడియలు:** లేవు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.38, **సూర్యాస్తమయం:** 5.39

క్లుప్తంగా...

పోలీసు ఈవెంట్లలో కొత్త నిబంధనలు సవరించండి

సీఎం కేసీఆర్‌కు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని లేఖ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన ఎస్‌ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల ఈవెంట్లలోని కొత్త నిబంధనలు సవరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సీఎం కేసీఆర్‌ను కోరారు. ఈ మేరకు సీఎం కేసీఆర్‌కు కూనంనేని గురువారం లేఖ రాశారు. 'లాంగ్ జంప్ విభాగంలో పురుషులకు 3.80, మహిళలకు 2.50 మీటర్లు ఉండగా, ఇటీవల తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు వాటిని సవరించి 4.00, 2.50 మీటర్లకు పెంచింది. షాట్‌పుట్ విభాగంలో పురుషులు, మహిళలకు వరుసగా 5.60, 3.75 మీటర్లు ఉండగా, వాటిని 6.00, 4.00 మీటర్లకు పెంచారు. ఇలాంటి నిబంధనలు ఆర్మీ రిక్రూట్‌మెంట్‌లో కూడా లేవు. గతంలో ఐదు ఈవెంట్లలో ఏవైనా మూడింటిలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఫైర్‌మెన్, సివిల్, జైలు వార్డర్, ఎక్సైజ్, కమ్యూనికేషన్, డ్రైవర్ లాంటి పరీక్ష ఆధారిత పోస్టుల లో అర్హత కల్పించారు. ఈసారి జారీ చేసిన నోటిఫికేషన్‌లో ఐదు ఈవెంట్లను మూడుకు కుదించి, ఎలాంటి ఆప్షన్ లేకుండా మూడు ఈవెంట్లలోనూ అర్హత సాధించాలని నిబంధన పెట్టారు. ఏ ఒక్కదానిలోనూ అర్హత సాధించలేకపోయినా 15 రకాల పోస్టులకు అభ్యర్థులు అర్హత కోల్పోతున్నారు. కొత్త నిబంధనలతో వారు నష్టపోయే ప్రమాదం ఉంది'అని లేఖలో కూనంనేని ఆవేదన వ్యక్తం చేశారు.

681 మంది చిన్నారుల జాడ గుర్తింపు

- రాష్ట్రవ్యాప్తంగా ఆపరేషన్ స్మైల్
- చిన్నారులతో పనిచేయిస్తున్న వారిపై 135 ఎఫ్‌ఐఆర్‌లు

సాక్షి, హైదరాబాద్: అదృశ్యమైన, బాలకార్మికులుగా మారిన చిన్నారుల జాడను కనుగొనేందుకు చేపట్టిన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా కొనసాగుతోంది. జనవరి 1 నుంచి 31 వరకు నిర్వహించనున్న ఈ స్పెషల్ డ్రైవ్‌లో మొత్తం 106 అధికారిక బృందాలు పాల్గొంటున్నాయి. జనవరి 1 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించిన ఈ స్పెషల్ డ్రైవ్‌లో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 681 మంది చిన్నారుల జాడను గుర్తించినట్టు రాష్ట్ర మహిళా భద్రత విభాగం ఉన్నతాధికారులు తెలిపారు. వీరిలో 585 మంది బాలురు, 96 మంది బాలికలున్నట్టు వారు పేర్కొన్నారు. వీరిలో అత్యధికంగా సైబరాబాద్ కమిషనరేట్‌లో 212 మంది చిన్నారులు, వరంగల్‌లో 61 మంది చిన్నారులు, నారాయణపేట్ జిల్లాలో 54 మంది చిన్నారులు, గద్వాల్‌లో 39 మంది చిన్నారులు, నల్లగొండలో 30 మంది చిన్నారులు, మెదక్‌లో 30 మంది చిన్నారుల జాడను కనుగొన్నట్టు అధికారులు తెలిపారు. నిబంధనలు అతిక్రమించి చిన్నారులతో పనులు చేయిస్తున్న వారిని గుర్తించి మొత్తం 135 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసినట్టు అధికారులు పేర్కొన్నారు. ఈనెల 31 వరకు కొనసాగనున్న ఈ స్పెషల్ డ్రైవ్‌లో పోలీసులతోపాటు కార్మిక, శిశు సంక్షేమశాఖల అధికారులతో కూడిన బృందాలు పాల్గొంటున్నట్టు వారు తెలిపారు.

త్వరలో టెన్త్ మోడల్ పేపర్



ప్రశ్నపత్రాల్లో మార్పుల మేరకు కొత్త మోడల్ పేపర్ విడుదల

- ముందుగా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురానున్న విద్యాశాఖ
- ప్రశ్నపత్రాల ముద్రణకూ సన్నాహాలు
- పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచన

పదవ తరగతి ప్రశ్నపత్రాల్లో మార్పులు చేసిన నేపథ్యంలో విద్యాశాఖ కొత్త మోడల్ పేపర్ వెలువరించనుంది. వీలైనంత త్వరగా దీన్ని విడుదల చేస్తామని అధికార వర్గాలు తెలిపాయి. ముందుగా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకొచ్చి, ఆ తర్వాత పాఠశాలలకు పంపుతామని అధికారులు తెలిపారు. వ్యాస రూప, సూక్ష్మ రూప ప్రశ్నలు కఠినంగా ఉన్నాయంటూ విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల నుంచి తీవ్ర ఒత్తిడి రావడంతో టెన్త్ ప్రశ్నపత్రంలో మార్పులు తెచ్చారు. అయితే కొద్దిరోజుల క్రితమే టెన్త్ సిలబస్, పరీక్ష విధానాన్ని వెల్లడించి మోడల్ పేపర్‌ను కూడా విడుదల చేసిన విద్యాశాఖ, ఇప్పుడు దీన్ని పూర్తిగా మార్చి కొత్తది విడుదల చేసేందుకు సిద్ధమవుతోంది. అదేవిధంగా పరీక్షకు సంబంధించిన ప్రశ్నలు, సమాధానాలకు మార్కులను తెలియజేసే బ్లూ ప్రింట్‌ను కూడా విడుదల చేయాల్సి ఉంటుంది. ఎస్‌సీఈఆర్‌టీ ఈ ప్రక్రియను చేపడుతుంది. – సాక్షి, హైదరాబాద్

త్వరలో పేపర్ రూపకల్పన

వాస్తవానికి జనవరి మొదటి వారంలోనే ప్రశ్నపత్రాల రూపకల్పన చేపట్టాల్సి ఉంది. దీని కోసం వివిధ ప్రాంతాల నుంచి సబ్జెక్టు నిపుణులను రప్పించి, అత్యంత గోప్యత పాటిస్తూ మొత్తం 12 సెట్ల ప్రశ్నపత్రాలను రూపొందిస్తారు. ఇందులోంచి మూడింటిని ఎంపిక చేస్తారు. అయితే పేపర్‌లో మార్పులు చేపట్టాల్సి ఉండటంతో ఈ ప్రక్రియ ఇంతవరకు చేపట్టలేదు. చాయిస్ పెంచడంతో పాటు వ్యాస రూప ప్రశ్నల సంఖ్యను కుదించడంతో ఈ మేరకు పేపర్ల రూపకల్పన చేపట్టనున్నారు.

ఫిబ్రవరి కల్లా ముద్రణకు..

పదవ తరగతి పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి జరగనున్నాయి. పరీక్షలకు ఎంపిక చేసే మూడు సెట్ల ప్రశ్నపత్రాలను ఫిబ్రవరి నెలాఖరుకల్లా ప్రింటింగ్‌కు పంపాలని అధికారులు భావిస్తున్నారు. సంక్రాంతి తర్వాత ప్రశ్నపత్రాల రూపకల్పన చేపట్టి, ఫిబ్రవరి మొదటి వారం కల్లా ఒక్కో సబ్జెక్టులో 12 సెట్ల నుంచి మూడింటిని ఎంపిక చేస్తారు. వీటిని ఫిబ్రవరి నెలాఖరుకు ఎంపిక చేసిన ప్రింటింగ్ ప్రెస్‌కు పంపనున్నారు. మార్చి మొదటి వారం కల్లా పేపర్ ముద్రణ పూర్తి చేసే అవకాశం ఉందని ఓ అధికారి తెలిపారు.

హెచ్‌ఎంలూ అప్రమత్తంకండి

టెన్త్ పరీక్షల విషయంలో ప్రధానోపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని, మార్పుల విషయంలో విద్యార్థులు గందరగోళానికి గురికాకుండా చూడాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ ఏడాది ఆరు పేపర్లతో టెన్త్ పరీక్ష నిర్వహిస్తామని తొలుత ప్రకటించారు. అయితే ఎస్‌ఏ–1 పరీక్ష పేపర్ల ముద్రణ పూర్తయ్యాక ఈ నిర్ణయం రావడంతో పెద్ద ఎత్తున వివాదం చెలరేగింది. దీంతో ఎస్‌ఏ –1 వరకు 11 పేపర్లతో పరీక్ష పెట్టారు. ఫైనల్ పరీక్ష మాత్రం 6 పేపర్లతోనే నిర్వహించాలనే నిర్ణయం తీసుకున్నారు. తర్వాత ప్రశ్నపత్రాల్లో మార్పులతో మరోసారి గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలోనే విద్యార్థులకు పరీక్షల పట్ల అవగాహన కల్పించాలని ఉన్నతాధికారులు సూచించారు.

నీట్ పీజీ మెడికల్, ఎండీఎస్ పరీక్షలు వాయిదా వేయండి

- కేంద్రానికి, డీజీహెచ్‌ఎస్‌కు కాళోజీ వర్సిటీ లేఖ
- ఎంబీబీఎస్, బీడీఎస్ విద్యార్థుల ఇంటర్న్‌షిప్ పూర్తికాక ముందే పీజీ నీట్ పరీక్షల షెడ్యూల్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇంటర్న్ షిప్ చేస్తున్న ఎంబీబీఎస్, బీడీఎస్ విద్యార్థుల భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్నాయి. వీరి ఇంటర్న్‌షిప్ పూర్తి కాకముందే పీజీ నీట్ మెడికల్, పీజీ నీట్ ఎండీఎస్ ఎంట్రన్స్ ఎగ్జామ్స్ నిర్వహిస్తుండడంతో.. వీరు ఆయా పరీక్షలను రాయలేని పరిస్థితి నెలకొంది. బీడీఎస్ విద్యార్థులకు ఈ ఏడాది ఏప్రిల్లో, ఎంబీబీఎస్ విద్యార్థులకు ఆగస్టులో ఇంటర్న్‌షిప్ పూర్తి కానుంది. ఈ రెండు కోర్సులకూ ఈ ఏడాది మార్చిలోనే ప్రవేశపరీక్షలను నిర్వహించడానికి డైరెక్టర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్(డీజీహెచ్‌ఎస్) ప్రకటన విడుదల చేసింది. దీంతో ఏడాది కాలాన్ని నష్టపోవాల్సి వస్తుందనే ఆందోళనలో విద్యార్థులున్నారు. దీనిపై కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయానికి ఫిర్యాదులు రావడంతో.. గురువారం ఆరోగ్య వర్సిటీ కేంద్ర ప్రభుత్వానికి, డీజీహెచ్‌ఎస్‌కు వేర్వేరుగా లేఖలు రాసింది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని నీట్ పీజీ మెడికల్, నీట్ పీజీ ఎండీఎస్ పరీక్షలను వాయిదా వేయాల్సిందిగా కోరింది.

విద్యార్థులతో ప్రధాని మాటామంతీ 27న

సాక్షి, హైదరాబాద్: పరీక్షా పే చర్చ కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈనెల 27వ తేదీన ఢిల్లీలోని తల్కటరా స్టేడియంలో విద్యార్థులతో ముచ్చటించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి మోదీని ఏవైనా ప్రశ్నలు అడిగేందుకు కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. ప్రశ్నలు అడగాలనుకున్న విద్యార్థులు తమ సందేహాలను హెచ్‌డీ క్వాలిటీతో కూడిన వీడియో రూపంలో జనవరి 15వ తేదీలోగా pibhyderabad@gmail.comకు పంపాలని పీఐబీ గురువారం ఒక ప్రకటనలో సూచించింది.

ప్రేమోన్మాది వేధింపులకు విద్యార్థిని బలి

- డిసెంబర్ 31న ఆత్మహత్యాయత్నం చేసి కోలుకున్న బాలిక
- అయినా వేధింపులు ఆగకపోవడంతో ఉరివేసుకుని ఆత్మహత్య
- యాదాద్రి భువనగిరి జిల్లా జిబ్లక్‌పల్లిలో ఉద్రిక్తత



కావ్య (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి: ఓ ప్రేమోన్మాది వేధింపులకు మనస్తాపం చెంది పదో తరగతి విద్యార్థిని ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం జిబ్లక్‌పల్లి గ్రామానికి చెందిన ఉప్పునూతల కావ్య(16) చౌటుప్పల్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో పదోతరగతి చదువుతోంది. కావ్య ఇన్‌స్టాగ్రామ్‌లో ఇదే గ్రామానికి చెందిన మాచర్ల శివమణి తనను ప్రేమించాలని మెసేజ్‌లు పెడుతూ వేధింపులకు గురిచేస్తున్నాడు. అందుకు ఆమె తిరస్కరించడంతో తనను ప్రేమించకపోతే మీ నాన్న, అన్నను చంపేస్తానని, డబ్బులు కూడా కావాలని బెదిరింపులకు గురిచేశాడు. భయపడిన కావ్య ఇటీవల తన సోదరుడు నరేశ్‌కు విషయం చెప్పింది. దీంతో తన చెల్లెలికి మేసేజ్ పెడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని శివమణిని నరేశ్ హెచ్చరించాడు. ఇదే క్రమంలో డిసెంబర్ 31న అర్ధరాత్రి నరేశ్, శివమణి మధ్య గొడవ జరిగింది. ఆ రోజు రాత్రి కావ్యకు శివమణి ఫోన్‌చేసి 'మీ అన్నను చంపేస్తాను' అని బెదిరించడంతో ఆమె మనస్తాపం చెంది పురుగుమందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించడంతో కోలుకొని ఈ నెల 2న ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయి ఇంటికి వచ్చింది.



కావ్య మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మందలించినా మారని తీరు..

ఈ నెల 2న గ్రామంలో ఇరు కుటుంబాల పెద్ద మనుషులు పంచాయతీ పెట్టారు. ఇకపై కావ్య, ఆమె కుటుంబం జోలికి పోకుండా చూసుకోవాలని శివమణి తల్లిదండ్రులకు చెప్పారు. అయినా శివమణి మళ్లీ మెసేజ్‌లు పెడుతుండటంతో కావ్య కలత చెందింది. బుధవారం తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లగా ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆమె ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొంది. సాయంత్రం నరేశ్ ఇంటికి వచ్చి చూడగా కావ్య ఫ్యాన్‌కు వేలాడుతూ కన్పించింది. పోలీసులు పోస్టుమార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. గురువారం సాయంత్రం కావ్య అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతురాలి తండ్రి కనకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపారు. కాగా, నిందితుడిని కఠినంగా శిక్షించాలని పోచంపల్లిలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థినులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు.

18న సీఎం చేతులమీదుగా 'కంటివెలుగు' ప్రారంభం

- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు
- వేగంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్లు, డీఎంహెచ్‌ఓలకు ఆదేశం
- వాట్సాప్ గ్రూపులతో సమన్వయం చేయాలని సూచన
- ఖమ్మం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి సమీక్ష



సాక్షిప్రతినిధి, ఖమ్మం: కంటివెలుగు రెండో దశ కార్యక్రమాన్ని ఈనెల 18న మధ్యాహ్నం ఒంటిగంటకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఖమ్మం నుంచి ప్రారంభిస్తారని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. కంటివెలుగు ఏర్పాట్లపై మంత్రి గురువారం ఖమ్మం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, డీఎంహెచ్‌ఓలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. సీఎం కేసీఆర్ కార్యక్రమాన్ని ప్రారంభించిన వెంటనే అన్ని జిల్లాల్లో కంటి పరీక్షలు మొదలుపెట్టేలా ప్రజాప్రతినిధులు, జిల్లాస్థాయి అధికారులు కార్యాచరణ రూపొందించుకోవాలని ఆయన సూచించారు. పరీక్షలు నిర్వహించే అన్ని కేంద్రాలకు శుక్రవారం సాయంత్రానికల్లా కంటి పరీక్షల యంత్రాలు, అద్దాలు, మందులు చేరవేయాలని, ఏవైనా ఇబ్బందులు ఎదురైతే కుటుంబ సంక్షేమ విభాగం కమిషనర్ శ్వేతా మహంతికి తెలపాలని చెప్పారు. జిల్లాస్థాయి అధికారులతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుని సమన్వయం చేసుకోవాలని, సంబంధిత బృందాలు ఉదయం 9 గంటలకు, సాయంత్రం 4 గంటలకు ఒకసారి వాట్సాప్‌లో వివరాలు అప్‌డేట్ చేయాలని మంత్రి సూచించారు.

ప్రచార కార్యక్రమాలు చేపట్టండి

ప్రజలకు కంటివెలుగుపై అవగాహన కల్పించేలా గ్రామాలు, పట్టణాల్లో ప్రచారం చేయాలని, వారికి అర్థమయ్యేలా పూర్తి వివరాలతో ఫ్లెక్సీలు, బోర్డులు ఏర్పాటు చేయాలని.. ఆధార్ కార్డు తప్పక తీసుకు రావాలన్న విషయాన్ని చెప్పాలని మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. మొదటి విడత కంటి వెలుగు కార్యక్రమం ఎనిమిది నెలలు కొనసాగితే, ఈసారి వంద రోజుల్లో పూర్తి చేయాలనేది ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం గతంలో ఉన్న 827 బృందాలను ఈసారి 1,500కు పెంచామని చెప్పారు. వైద్య బృందం సభ్యులకు పరీక్షా కేంద్రాలకు సమీపంలో వసతి ఏర్పాటుచేయాలన్నారు. విడతల వారీగా, 16,533 కేంద్రా (గ్రామాల్లో 12,763, పట్టణ ప్రాంతాల్లో 3,788)ల్లో క్యాంపులు ఏర్పాటు చేయనుండగా, ప్రాథమికంగా 30 లక్షల రీడింగ్ గ్లాస్‌లు, 25 లక్షల ప్రిస్క్రిప్షన్ అద్దాలను అవసరమైన వారికి ఉచితంగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు మంత్రి వివరించారు.

క్యాంపులను సందర్శించాలి..

ఎంపీడీఓ, తహసీల్దార్, మండల స్పెషల్ ఆఫీసర్, ఎంపీఓలు మండల స్థాయిలో, జిల్లా స్థాయిలో డీఎంహెచ్‌ఓ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, ప్రోగ్రాం ఆఫీసర్లు కంటివెలుగు క్యాంపులను పర్యవేక్షించాలని మంత్రిహరీశ్‌రావు ఆదేశించారు. ప్రతిరోజూ క్యాంపులను సందర్శించేలా కలెక్టర్ టూర్ రూపొందించాలని.. మొత్తంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు పర్యవేక్షించాలని చెప్పారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజాప్రతినిధులంతా ఇందులో భాగస్వాములై అంధత్వ రహిత తెలంగాణ లక్ష్యానికి, సీఎం కేసీఆర్ సంకల్పానికి చేయూతనివ్వాలని మంత్రి పిలుపునిచ్చారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి రిజ్వీ, కమిషనర్ శ్వేతా మహంతి, డీఎంఇ.రమేశ్‌రెడ్డి, డీహెచ్ శ్రీనివాసరావు, టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొత్తగా 5 కరోనా కేసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గురువారం 5322 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో అయిదుగురు వైరస్ బారిన పడ్డారు. దీంతో రాష్ట్రంలో ఇప్పటివరకు నమోదైన మొత్తం కేసుల సంఖ్య 8.41 లక్షలకు చేరింది. ఒక్కరోజులో కరోనా నుంచి ఎనిమిది మంది కోలుకోగా, ఇప్పటివరకు కోలుకున్నవారి సంఖ్య 8.37 లక్షలకు చేరింది. ప్రస్తుతం 53 మంది ఐసోలేషన్ లేదా చికిత్స పొందుతున్నట్లు ప్రజారోగ్య సంచాలకుడు శ్రీనివాసరావు వెల్లడించారు.

శరద్ యాదవ్ కన్నుమూత



న్యూఢిల్లీ: సీనియర్ రాజకీయ వేత్త, లోక్‌తాంత్రిక్ జనతా దళ్(ఎల్‌జేడీ) అధినేత, కేంద్ర మాజీ మంత్రి శరద్ యాదవ్ తుది శ్వాస విడిచారు. 75 ఏళ్ల శరద్ యాదవ్ గుర్గావ్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి కన్నుమూశారు. ఈ విషయాన్ని ఆయన కుమార్తె సుభాషిణి ధ్రువీకరించారు. అనారోగ్యం పాలై అపస్మారక స్థితికి చేరుకున్న యాదవ్‌ను తమ ఆసుపత్రికి తీసుకొచ్చారని, ఎమర్జెన్సీ వార్డులో చేర్చి చికిత్స ప్రారంభించామని, నాడి పనిచేయలేదని, రక్తపోటు రికార్డు కాలేదని ఫోర్టిస్ మెమోరియల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వెల్లడించింది. రాత్రి 10.19 గంటలకు మరణించారని తెలియజేసింది. శరద్ యాదవ్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. శరద్ యాదవ్ మొత్తం పదిసార్లు పార్లమెంట్ సభ్యుడిగా పనిచేశారు. ఏడు సార్లు లోక్‌సభకు, మూడు సార్లు రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1970వ దశకంలో జయప్రకాశ్ నారాయణ్ శిష్యుడిగా రాజకీయ రంగ ప్రవేశం చేశారు. సోషలిస్టు ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. జనతాదళ్ నుంచి బయటకు వచ్చి 1997లో జేడీ(యూ)ను స్థాపించారు. జేడీ(యూ) నితీశ్ వర్గానికే చెందుతుందని 2017లో ఈసీ ప్రకటించింది. 2018లో తాను స్థాపించిన ఎల్‌జేడీని శరద్ యాదవ్ ఇటీవలే జేడీ(యూ)లో విలీనం చేశారు. శరద్ మృతి పట్ల తెలంగాణ సీఎం కేసీఆర్ సంతాపం ప్రకటించారు.

క్లుప్తంగా...

వంట గ్యాస్ లీకై.. ఇంట్లో మంటలు

దంపతులు, పిల్లలు సజీవదహనం

చండీగఢ్: వంటగ్యాస్ సిలిండర్ లీకై ఇంట్లో మంటలు చెలరేగిన ఘటనలో దంపతులు, వారి నలుగురు సంతానం సజీవ దహనమయ్యారు. హరియాణా రాష్ట్రం పానిపట్ జిల్లా బిచ్‌పారీ గ్రామంలో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఇంట్లో నుంచి పొగలు రావడం గమనించిన ఇరుగుపొరుగు వారు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. వారు వచ్చే సరికే ఇంట్లో ఉన్న మొత్తం ఆరుగురూ ఆహుతయ్యారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన బాధిత దంపతులు అబ్దుల్(45), ఆయన భార్య(40) గ్రామంలోని ఓ ఫ్యాక్టరీలో పనిచేస్తుండే వారని స్థానికులు తెలిపారు. దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన అబ్దుల్ ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కొడుకుల వయస్సు 10–18 ఏళ్ల మధ్య ఉంటుంది.

'అంజలి' కేసులో నిందితుడికి నో బెయిల్

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో డిసెంబర్ 31వ తేదీ అర్ధరాత్రి అంజలీ సింగ్(20)ను కారుతో ఢీకొట్టి 12 కిలోమీటర్ల దూరం లాక్కెళ్లిన ఘటనలో నిందితుడు అశుతోష్ భరద్వాజ్‌కు మెట్రోపాలిటన్ కోర్టు బెయిల్ నిరాకరించింది. ఘటన సమయంలో సహ నిందితుడైన దీపక్ కారు నడుపుతున్నట్లుగా అశుతోష్ దర్యాప్తును పక్కదోవ పట్టించారని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అతుల్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. ఆయనకు స్వేచ్ఛ లభిస్తే దర్యాప్తును మళ్లీ పక్కదోవ పట్టించే అవకాశం ఉందని తెలిపారు. ఘటన సమయంలో వాస్తవానికి మరో నిందితుడు అమిత్ కారు నడుపుతున్నట్లు దర్యాప్తులో తేలిందని అన్నారు. కేసు దర్యాప్తు ప్రాథమిక దశలో ఉండటం, నిందితుడిపై మోపిన ఆరోపణలపై సెషన్స్ కోర్టు ప్రత్యేకంగా విచారణ జరుపుతున్నందున బెయిల్ ఇవ్వడం కుదరదని మేజిస్ట్రేట్ సాన్యా దలాల్ స్పష్టం చేశారు.

ఆస్ట్రేలియాలో హిందూ దేవాలయం అపవిత్రం

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాలోని స్వామి నారాయణ్ మందిరంపై ఖలిస్తాన్ మద్దతుదారులు రంగులతో దాడిచేశారు. గోడలపై తమ హిందూ విద్వేషాన్ని చూపించారు. ప్రధాని మోదీ వ్యతిరేక రాతలు రాశారు. మెల్‌బోర్న్ సమీపంలోని మిల్ పార్క్‌లోని స్వామి నారాయణ్ మందిరంపై గురువారం కొందరు ఖలిస్తాన్ మద్దతుదారులు దాడిచేశారు. 1980లలో పంజాబ్‌లో స్వర్ణదేవాలయంలో దాక్కొన్న నాటి సిక్కు వేర్పాటువాద నేత, ఖలిస్తాన్ ఉద్యమకారుడు దివంగత జర్నైల్ సింగ్ భింద్రావాలే 'అమరుడు', ప్రధాని మోదీ ఒక హిట్లర్ అంటూ నలుపు రంగుతో గ్రాఫిటీ చేశారు. భారతదేశాన్ని వ్యతిరేకిస్తూ హిందుస్తాన్ ముర్దాబాద్ వంటివి రాశారు. దాడి ఘటనను ఆస్ట్రేలియాలోని భారతీయ హిందువులు, భారతీయ మూలాలున్న నేతలు తీవ్రంగా ఖండించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో, ఎంపీలకు ఫిర్యాదుచేశారు.

మరో చోటా రహస్య పత్రాలు లభ్యం

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తరహాలో ప్రస్తుత అధ్యక్షుడు బైడెన్ దేశ రహస్య పత్రాల వివాదంలో మరింతగా కూరుకుపోతున్నారు. గత ఏడాది నవంబర్‌లో తన ప్రైవేట్ కార్యాలయంలో దేశ రహస్య పత్రాలు లభించాయని మీడియాకు చెప్పకుండా దాచిపెట్టారని ఆరోపణలు ఎదుర్కొంటున్న బైడెన్‌కు మరో సమస్య ఎదురైంది. తాజాగా బైడెన్‌కు చెందిన మరో ప్రాంతంలోనూ రహస్య డాక్యుమెంట్లను ఆయన వ్యక్తిగత లాయర్లు కొనుగొన్నారనే వార్త అమెరికాలో పెద్ద చర్చనీయాంశమైంది. రెండో చోట పత్రాలు లభించాయన్న వార్తపై స్పందించేందుకు అమెరికా అధ్యక్ష భవనం(వైట్‌హౌజ్), న్యాయ మంత్రిత్వ శాఖ నిరాకరించాయి.

అడవికి ఊపిరి.. తుపాకీకి ఉరి

- బ్రెజిల్ కొత్త అధ్యక్షుడు లూలా ముందున్న సవాళ్లు
- గన్ కల్చర్, గోల్డ్ మైనింగ్ కట్టడికి చర్యలు షురూ



కొత్త సంవత్సరంలో ముచ్చటగా మూడోసారి బ్రెజిల్ గద్దెనెక్కిన లూలా డ సిల్వా రెండు కీలక అంశాలపై దృష్టి సారించారు. జనవరి 1న దేశాధ్యక్షుడిగా ప్రమాణం చేసినప్పుడు తుపాకుల సంస్కృతిని కట్టడి చేస్తానని, అమెజాన్‌లో బంగారం తవ్వకాలకు అడ్డుకట్ట వేసి అడవులకి కొత్త ఊపిరిలూదుతానని ప్రకటించారు. ఈ రెండు అంశాలు లూలా ప్రభుత్వానికి ఎందుకంత ప్రాధాన్యంగా మారాయి ? వామపక్ష భావజాలం కలిగిన నాయకుడైన లూలా రెండు పర్యాయాల పాలనలో ఎన్నో ప్రజా సంక్షేమ కార్యక్రమాలు తీసుకువచ్చి జన హృదయాలను గెలుచుకున్నారు. వీటిని కూడా నెరవేరిస్తే ఆయన పేరు మరోసారి ప్రపంచవ్యాప్తంగా మారుమోగిపోవడం ఖాయం.

సరిగ్గా 20 ఏళ్ల కిందట బ్రెజిల్ అధ్యక్షుడిగా లూలా డ సిల్వా తొలిసారి అధ్యక్షుడైనప్పటి పరిస్థితులు ఇప్పుడు లేవు. ఈ సారి ఎన్నికల్లో లూలా అత్యంత స్వల్ప మెజార్టీతో నెగ్గారు. 50.9% ఓటు షేర్ లూలాకు వస్తే, మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సోనారోకి 49.1% ఓట్లు వచ్చాయి. కేవలం రెండు శాతం ఓట్లతో తేడాతో నెగ్గిన లూలా తాను అనుకున్నవీ ఎంత సాధించగలరో అన్న అనుమానాలైతే ఉన్నాయి. ఇప్పటికే బోల్సోనారో మద్దతుదారులు రోడ్లపైకెక్కి తిరిగి తమ నాయకుడినే అధ్యక్షుడిని చేయాలంటూ దేశాన్ని రణరంగంగా మారుస్తున్నారు. శాంతి భద్రతలకే సవాల్ విసురుతున్నారు. ఈ నేపథ్యంలో లూలా తన పీఠాన్ని కాపాడుకోవడానికే సర్వశక్తులు ఒడ్డాల్సి వస్తోంది. దేశానికి ఒకప్పుడు అధ్యక్షుడిగా ఉన్న సమయంలో 4.4 కోట్ల మంది ప్రజల్ని పేదరికం నుంచి బయట పడేసి ప్రపంచవ్యాప్తంగా అందరి మన్ననలు అందుకున్న లూలా అధ్యక్ష పదవి నుంచి దిగిపోయాక అవినీతి ఆరోపణలపై జైల్లో గడపడంతో ఆయన పైనున్న విశ్వాసం కొంతవరకు ప్రజల్లో సన్నగిల్లింది. ఆ తర్వాత కేసుల నుంచి విముక్తుడైనప్పటికీ తుపాకుల సంస్కృతిని, అమెజాన్ అడవుల్ని కాపాడితే మరోసారి లూలా పేరు ప్రపంచవ్యాప్తంగా మారుమోగిపోవడం ఖాయం. అందుకే తన ప్రమాణ స్వీకారం రోజే బోల్సోనారో తుపాకులు సులభంగా కొనుక్కోవడానికి వీలుగా జారీ చేసిన డిక్రీలను రద్దు చేశారు. తుపాకుల నియంత్రణకు, బంగారం తవ్వకాలకి సంబంధించి కొత్త డిక్రీలు జారీ చేసి అభిమానుల నుంచి జేజేలు అందుకున్నారు.

పెచ్చు మీరుతున్న తుపాకుల సంస్కృతి



బ్రెజిల్‌లో మార్కెట్‌కి వెళ్లి బీన్స్ కొనుక్కోవడం ఎంత తేలికో తుపాకుల కొనుగోలు కూడా అంతే సులభం. జైర్ బోల్సోనారో 2019 జనవరి 1న దేశాధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశాక తుపాకుల నియంత్రణ చట్టాలను సులభతరం చేశారు. గన్ లైసెన్స్ లకుండే గడువుని అయిదేళ్ల నుంచి పదేళ్లకు పెంచారు. దీంతో ఆత్మరక్షణ పేరుతో తుపాకుల్ని విచ్చలవిడిగా కొనేవారి సంఖ్య పెరిగిపోయింది. తుపాకుల మరణాల్లో ప్రపంచంలో బ్రెజిల్ మొదటి స్థానంలో ఉంది. సగటున ఏడాదికి 40 వేల మంది మృత్యువాత పడడం చట్టాలను కఠినతరం చేయాల్సిన అవసరాన్ని తెలియజేస్తోంది. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాల్ని బహిరంగంగా ప్రశంసించే బోల్సోనారో అమెరికా బాటలో విచ్చలవిడి తుపాకుల విక్రయానికి తెరతీశారు. దీంతో బ్రెజిల్ తుపాకుల కాల్పుల ఘటనతో రక్తమోడుతోంది. లూలా డ సిల్వా అధ్యక్షుడయ్యాక తుపాకుల నియంత్రణకి చేపడుతున్న చర్యలు ప్రజల్ని ఆకర్షిస్తున్నాయి. ఒక సర్వే ప్రకారం దేశంలో మూడింట రెండు వంతుల మంది ప్రజలు తుపాకులు ప్రజల చేతుల్లో ఉండడాన్ని వ్యతిరేకిస్తున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

అమెజాన్ అడవుల్లో గోల్డ్ మైనింగ్

అమెజాన్ అటవీ ప్రాంతంలో 60శాతానికిపైగా బ్రెజిల్‌లో ఉంది. భూమ్మీద ఉండే ఆక్సిజన్‌లో 10శాతం ఇక్కడ నుంచి వస్తూ ఉండడంతో భూమాతకి ఊపిరితిత్తులుగా అమెజాన్‌ను అభివర్ణిస్తారు. ప్రపంచంలో అతి పెద్ద అన్‌రిజిస్టర్డ్ మైనింగ్ ఇండస్ట్రీకి ఈ అడవులే వేదికయ్యాయి. గనుల నుంచి బంగారాన్ని వెలికి తీయడానికి పాదరసాన్ని వాడుతుంటారు. ఈ పాదరసంతో అమెజాన్ నదుల్లో నీరు విషతుల్యంగా మారుతున్నాయి. దీంతో ఈ అడవుల్లో ఉన్న 25 లక్షల రకాల జీవజాలానికి ముప్పు ఏర్పడుతోంది. అడవుల్లో నివసించే స్థానిక గిరిజనులకు గోల్డ్ మైనర్ల నుంచి ప్రమాదాలు పొంచి ఉన్నాయి. బ్రెజిల్ అటవీ ప్రాంతంలో బంగారం స్మగ్లర్లను గారింపీర్స్ అని పిలుస్తారు. వీరందరి వెనకాల మాజీ అధ్యక్షుడు బోల్సోనారో ఉన్నారనే ప్రచారం ఉంది. బోల్సోనారో తండ్రి కూడా గారింపీర్ కావడంతో అమెజాన్ అడవులు నాశనం కావడానికి బోల్సోనారో కుటుంబమే కారణమన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. కరోనా సంక్షోభ సమయంలో అయిదు నెలల కాలంలో బంగారం ధరలు 40% పెరిగిపోవడంతో గోల్డ్ స్మగ్లర్లు ఈ ప్రాంతంలో తమ పట్టు పెంచుకున్నారు. వీరికి రాజకీయ నేతల అండదండలు ఉండడంతో వీరిని కాదని చర్యలు తీసుకోవడం అంత సులభం కాదు. అధ్యక్ష ఎన్నికల్లో అమెజాన్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న అన్ని జిల్లాల్లోనూ బోల్సోనారో కంటే లూలా వెనుకబడ్డారు. అందుకే ఆయన ప్రతీ నిర్ణయం ఆచితూచి తీసుకోవాల్సి ఉంటుంది.

- ప్రపంచ మార్కెట్‌లో లభ్యమయ్యే బంగారంలో 20% అమెజాన్ అడవుల నుంచే వస్తుంది.
- ఈ గోల్డ్ మైనింగ్‌లు 2 లక్షల మందికి జీవనాధారంగా ఉన్నాయి.
- అమెజాన్‌లో బంగారం తవ్వకాల కోసం 2017 నుంచి అడవుల నరికివేత పెరిగిపోతోంది.
- అమెజాన్ అటవీ విస్తీర్ణం ఇప్పటికే 20% తగ్గిపోయింది. అంటే ఫ్రాన్స్, జర్మనీ వంటి దేశాల సైజుతో ఇది సమానం. ఇందులో మైనింగ్ కోసమే 90% చెట్లను నరికేశారు.
- పర్యావరణ పరిరక్షణ చట్టాలను మాజీ అధ్యక్షుడు బోల్సోనారో తుంగలో తొక్కడంతో 2019లో అమెజాన్ అడవుల్లో 10,500 హెక్టార్ల విస్తీర్ణం తగ్గిపోయింది.
- 2018 సంవత్సరంతో పోలిస్తే గోల్డ్ మైనింగ్ కోసం 2019లో 23% అధికంగా, 2020 నాటికి 80శాతం అధికంగా అడవుల్ని నరికివేశారు.

- ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో తుపాకుల సంఖ్య దాదాపుగా 20 లక్షలకి చేరుకుంది.
- 2018తో పోల్చి చూస్తే తుపాకుల్ని వినియోగించే ప్రజల సంఖ్య రెట్టింపైంది.
- గత ఏడాది జులైలో తుపాకులకి లైసెన్స్ ఇచ్చే సంస్థ సీఏసీ దగ్గర 6 లక్షలకు పైగా తుపాకుల లైసెన్స్ మంజూరు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.
- 2018తో పోల్చి చూస్తే ఇది ఏకంగా 500% ఎక్కువ.
- 2019లో అత్యధికంగా 49,436 మంది తూటాలకు బలయ్యారు.

మోదీ కార్యక్రమానికి యడ్డి డుమ్మా

- అధికారిక కార్యక్రమానికి మాజీ ముఖ్యమంత్రి గైర్హాజరు
- కర్ణాటక రాజకీయాల్లో చర్చ
- బీజేపీ, సీఎం బొమ్మైపై అసంతృప్తే కారణం!



సాక్షి బెంగళూరు: కర్ణాటక రాష్ట్రం హుబ్బళ్లి (హుబ్లీ) నగరంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్న అధికారిక కార్యక్రమానికి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత బీఎస్ యడియూరప్ప గైర్హాజరయ్యారు. ఆయన గైర్హాజరు ప్రస్తుతం రాజకీయవర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గురువారం హుబ్లీ రైల్వే మైదానంలో జాతీయ యువ జనోత్సవానికి ప్రధాని మోదీ హాజరయ్యారు. పలువురు బీజేపీ సీనియర్ నాయకులు పాల్గొన్నప్పటికీ బీఎస్ యడియూరప్ప మాత్రం కనిపించకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఆయన కొన్ని నెలలుగా పార్టీ వైఖరి పట్ల అసంతృప్తితో ఉన్నారని ప్రచారం సాగుతోంది. బీజేపీ తనను నిర్లక్ష్యం చేస్తోందని, ప్రజల్లో వ్యక్తిగతంగా బలమున్న తనను రాజకీయంగా ఎవరూ అంతం చేయలేరని పలు సందర్భాల్లో అనుచరుల వద్ద వ్యాఖ్యానించినట్లు తెలిసింది. తన రాజకీయ జీవితానికి ఎవరూ ఫుల్‌స్టాప్ పెట్టలేరని యడియూరప్ప ఒకసారి బహిరంగంగా వ్యాఖ్యానించారు. మరోవైపు ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై, యాడియూరప్ప మధ్య విభేదాలు ముదురుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. తనను ముఖ్యమంత్రి పదవి నుంచి అర్ధాంతరంగా తప్పించారని యడియూరప్ప రగిలిపోతున్నారు. తన అనుచరుడైన బొమ్మైని సీఎం కుర్చీలో కూర్చోబెట్టడం జీర్ణించుకోలేకపోతున్నారు.

ప్రభుత్వంలో పదవి లేకపోవడం వల్లే..

యడియూరప్ప అసంతృప్తిని గుర్తించిన బీజేపీ అధిష్టానం గత ఏడాది పార్టీ పార్లమెంటరీ బోర్డు, కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యుడిగా నియమించింది. అయితే, రాష్ట్ర బీజేపీలో ఆశించిన గౌరవం దక్కకపోవడంతో జనసంకల్ప యాత్రలో ఆయన పాల్గొనలేదు. పార్టీ పెద్దలు దిగివచ్చి బుజ్జగించాల్సి వచ్చింది. ఇటీవలే మాండ్య జిల్లాలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పర్యటనకు యడియూరప్ప డుమ్మా కొట్టారు. తాజాగా ప్రధాని మోదీ హుబ్లీ పర్యటనకు సైతం దూరంగా ఉండిపోయారు. రాష్ట్ర బీజేపీ వాదన మరోలా ఉంది. జాతీయ యువజనోత్సవానికి మాజీ సీఎంకు ఆహ్వానం అందించలేదని స్పష్టం చేసింది. ప్రభుత్వ అధికారిక కార్యక్రమం కావడంతో ఆహ్వానించలేదని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వంలో యడియూరప్పకు ప్రస్తుతం ఎలాంటి పదవి లేదని, అందుకే ఆహ్వానం పంపలేదని కర్ణాటక బీజేపీ వెల్లడించింది.

యువశక్తి.. దేశ చోదక శక్తి

నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో ప్రధాని మోదీ



హుబ్బళ్లిలో రోడ్ షోలో మోదీ అభివాదం

హుబ్బళ్లి: మన దేశాన్ని ముందుకు నడిపించే చోదక శక్తి యువశక్తేనని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. దేశ ఆర్థిక ప్రగతి యువతరానికి ఎన్నో గొప్ప అవకాశాలు కల్పిస్తోందని చెప్పారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా గురువారం కర్ణాటకలోని హుబ్బళ్లిలో రైల్వే స్పోర్ట్స్ గ్రౌండ్ నేషనల్ యూత్ ఫెస్టివల్‌ను ప్రధాని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బొమ్మల తయారీ నుంచి పర్యాటకం దాకా, రక్షణ నుంచి డిజిటల్ దాకా ఎన్నో అంశాల్లో మనదేశం ప్రపంచ యవనికపై తనదైన ముద్ర వేస్తోందని, వార్తల్లో నిలుస్తోందని వ్యాఖ్యానించారు. ఈ శతాబ్దం భారత దేశ శతాబ్దమని ప్రపంచమంతా ముక్తకంఠంతో అంగీకరిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. ఇది మన శతాబ్దం, భారతదేశ యువతకు చెందిన శతాబ్దమని పేర్కొన్నారు. చరిత్రలో ఇదొక ప్రత్యేక సందర్భమని అన్నారు. ఇప్పటి యువతరం ప్రత్యేక తరమని తెలిపారు. అంతర్జాతీయంగా భారతదేశ ప్రతిష్టను మరింత పెంచాల్సిన బాధ్యత యువతపై ఉందని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. భారత్‌ను అత్యంత ప్రభావవంతమైన దేశంగా తీర్చిదిద్దడానికి యువతరం నడుం బిగించాలని సూచించారు.

మోదీ రోడ్డు షో

ప్రధాని మోదీ గురువారం హుబ్బళ్లిలో రోడ్డు షోలో పాల్గొన్నారు. రోడ్డుకు ఇరువైపులా జనం బారులు తీరి ఆయనకు అభివాదం చేశారు. మోదీ, మోదీ.. భారత్‌మాతా కీ జై అంటూ బిగ్గరగా నినదించారు. మోదీ వాహన శ్రేణిపై పూలు చల్లుతూ తమ అభిమానం చాటుకున్నారు. మోదీ సైతం చేతులు ఊపుతూ ఉత్సాహంగా ప్రజలకు అభివాదం చేశారు.

మోదీ రోడ్డు షోలో యువకుడి కలకలం


హుబ్బళ్లిలో ప్రధాని మోదీ రోడ్డు షోలో భద్రతా లోపాలు బహిర్గతమయ్యాయి. ఓ యువకుడు తీవ్ర కలకలం సృష్టించాడు. వాహనంపై ఉన్న మోదీ మెడలో పూలమాల వేసేందుకు ప్రయత్నించాడు. భద్రతా వలయాన్ని ఛేదించుకొని మరీ వేగంగా ముందుకు దూసుకొచ్చాడు. మోదీకి అత్యంత సమీపానికి చేరుకున్నాడు. మోదీ సైతం యువకుడి నుంచి పూలదండను స్వీకరించేందుకు తన వాహనం లోంచి చేతులు చాపారు. భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమై యువకుడిని అడ్డుకున్నారు. అతడి వద్ద నుంచి దండను తీసుకొని ప్రధానమంత్రికి అందజేశారు. ఆయన ఆ దండను తన కారులో ఉంచారు. స్థానిక పోలీసులు సదరు యువకుడిని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు.

శతఘ్ని దళాల్లోకి మహిళా అధికారులు

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద సాయుధ దళం 'ఆర్మీ' పోరాట విభాగంలోనూ మహిళలను చేర్చుకోవాలని నిర్ణయించింది. ముందుగా ఆర్టిలరీ (శతఘ్ని)దళాల్లో మహిళా అధికారులను చేర్చుకునేందుకు ఉద్దేశించి ప్రతిపాదనలను కేంద్రానికి పంపించినట్లు ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే చెప్పారు. ఈ ప్రతిపాదన ఆమోదం పొందుతుందని భావిస్తున్నామన్నారు. ఇది కార్యరూపం దాలిస్తే బోఫోర్స్ హొవిట్జర్, కె–9 వజ్ర, ధనుష్ వంటి తుపాకులను ఇకపై మహిళలు కూడా ఉపయోగించగలుగుతారు. వీరు ఆర్టిలరీ పోరాట సహాయక విభాగంలో ఉంటారని అధికార వర్గాలు పేర్కొన్నాయి. పదాతి దళం తర్వాత రెండో అతి పెద్ద రెజిమెంట్ శతఘ్ని దళమే. నిర్ణాయక విభాగంగా భావించే కీలకమైన ఈ దళంలో మిస్సైళ్లు, మోర్టార్లు, రాకెట్ లాంఛర్లు, డ్రోన్లు మొదలైనవి ఉంటాయి. పదాతి దళం, శతఘ్ని, మెకనైజ్డ్ శతఘ్ని రెజిమెంట్లలో ఇప్పటి వరకు మహిళా అధికారులకు పర్మినెంట్ కమిషన్లు లేవు. సుప్రీంకోర్టు తీర్పుతో ఆర్మీ మార్పులు తెచ్చింది. మహిళలకు పర్మినెంట్ కమిషన్ ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా 2022లో ఖడక్‌వాస్లాలోని డిఫెన్స్ అకాడమీలోకి 19 మంది మహిళా కేడెట్లతో మొదటి బ్యాచ్‌కు మూడేళ్ల శిక్షణ ప్రారంభించింది. అయితే, ఇన్‌ఫాంట్రీ, ఆర్మర్డ్ రెడ్ కార్ప్స్, మెకనైజ్డ్ ఇన్‌ఫాంట్రీల్లోకి మహిళా అధికారులను చేర్చుకోవాలన్న ప్రణాళికలేవీ లేవని రక్షణ శాఖ అధికారులు స్పష్టం చేశారు.

గంగా నదిలో హైలెస్సా..

- ప్రపంచంలో అత్యంత సుదీర్ఘమైన నది నౌకా ప్రయాణం
- నేడు వారణాసిలో గంగావిలాస్ నౌకను ప్రారంభించనున్న మోదీ
- అత్యంత విలాసవంతమైన నౌకలో 50 రోజుల ప్రయాణం



ప్రపంచంలో నదుల మీదుగా సాగే అరుదైన, అత్యంత సుదీర్ఘమైన నౌకా ప్రయాణానికి పుణ్య క్షేత్రం వారణాసి వేదిక కానుంది. ఎంవీ గంగావిలాస్ అని పిలిచే ఈ నౌకా ప్రయాణం 27 నదుల మీదుగా సాగుతుంది. సాధారణంగా నౌక ప్రయాణాలంటే సముద్ర జలాల మీదుగా సాగుతాయి. కానీ ఇలా నదుల మీదుగా సాగే అరుదైన నౌకా ప్రయాణం భారత్‌లో ప్రారంభం కావడం ఇదే తొలిసారి. భారత్ ఘనమైన సంస్కృతి, చరిత్రలను తెలుసుకుంటూ, మన దేశ వారసత్వ పరంపరని అవగాహన చేసుకుంటూ, జాతీయ ఉద్యాన వనాల అందాలను తిలకిస్తూ ఈ ప్రయాణం సాగుతుంది. భారత్‌తో పాటు బంగ్లాదేశ్ చారిత్రక, సాంస్కృతిక మూలాలను తెలుసుకునే అద్భుతమైన అవకాశం ఈ ప్రయాణం ద్వారా లభిస్తుంది. భారత్‌లో పర్యాటక రంగానికి పెరుగుతున్న ఆదరణని దృష్టిలో ఉంచుకొని ఈ నౌక ప్రయాణాన్ని తీర్చి దిద్దారు. ఈ నెల 13, శుక్రవారం నాడు ఈ నౌక ప్రయాణాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో నౌకా ప్రయాణం విశేషాలేంటో తెలుసుకుందాం.

- వారణాసి నుంచి బయల్దేరే గంగా విలాస్ మొత్తం 3,200 కి.మీ. ప్రయాణించి బంగ్లాదేశ్ మీదుగా అసోంలో దిబ్రుగఢ్‌కు చేరుకుంటుంది.
- ఈ మొత్తం ప్రయాణానికి 51 రోజులు సమయం పడుతుంది. 27 నదుల్ని దాటుకుంటూ ప్రయాణం సాగుతుంది.
- మూడు అంతస్తులు ఉండే గంగా విలాస్‌లో 18 సూట్స్ ఉన్నాయి.
- గంగావిలాస్ మొదటి జర్నీ కోసం 32 మంది న్యూజిలాండ్ పర్యాటకులు ఏకంగా నౌక మొత్తాన్ని బుక్ చేసుకున్నారు.
- ఇందులో ప్రయాణానికి ఒక్కో వ్యక్తికి రోజుకి రూ.25,000 టిక్కెట్ ధరగా నిర్ణయించారు. అంటే మొత్తం ప్రయాణానికి 12 లక్షల 50 వేలు ఖర్చు అవుతుంది.
- antara luxury river cruises సైట్ ద్వారా టిక్కెట్లు బుక్ చేసుకునే సదుపాయం ఉంది.
- 62 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పు , సౌకర్యవంతంగా ప్రయాణించడానికి వీలుగా 1.4 మీటర్ల డ్రాఫ్ట్ ఉంది .
- ప్రయాణికుల కోసం అత్యంత విలాసవంతమైన ఏర్పాట్లు చేశారు. ప్రతీ రోజూ నౌకలో సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. జిమ్, స్పా వంటి సదుపాయాలతో పాటు వ్యక్తిగతంగా బట్లర్ సర్వీసు, నౌకపైకి వెళ్లి ప్రయాణాన్ని ఎంజాయ్ చేసే అవకాశం ఉంటుంది.
- ప్రపంచ వారసత్వ కట్టడాలు, జాతీయ ఉద్యాన వనాలు, నదుల ఒడ్డున ఉండే పుణ్యక్షేత్రాలు, చారిత్రక ప్రాధాన్యం కలిగిన పట్టణాలు వంటి 50 పర్యాటక ప్రాంతాలను సందర్శించవచ్చు.
- బిహార్‌లో పట్నా, జార్ఖండ్‌లో సాహిబ్‌గంజ్, పశ్చిమ బెంగాల్‌లో కోలకతా, బంగ్లాదేశ్‌లో ఢాకా, అసోంలో గౌహతి పట్టణాలను గంగా విలాస్ కవర్ చేస్తుంది.
- బీహార్ స్కూల్ ఆఫ్ యోగ, విక్రమశిల యూనివర్సిటీలను విజ్ఞానం పంచే ప్రాంతాలు, సుందర్ బన్స్, బెంగాల్ డెల్టా ప్రాంతాలు, కజిరంగ నేషనల్ పార్క్ వంటి జాతీయ ఉద్యానవనాలను సందర్శించవచ్చు.
- మొదటి రోజు వారణాసిలో గంగా హారతిని సందర్శించిన అనంతరం ఈ నౌక బయల్దేరుతుంది. ఎనిమిదో రోజు పట్నాకి, 20వ రోజు కోల్‌కతాకి 35వ రోజున బంగ్లాదేశ్‌లో ఢాకాకి చేరుకుంటుంది. ఇక 50వ రోజు అంటే మార్చి 1న తిరిగి అసోంలోని దిబ్రుగఢ్‌కి చేరుకుంటుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

సంక్షోభంలో ప్రపంచం

న్యూఢిల్లీ: ప్రపంచం మొత్తం సంక్షోభ స్థితిలో చిక్కుకుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఈ అనిశ్చిత పరిస్థితి ఇంకా ఎంతకాలం ఉంటుందో చెప్పడం చాలా కష్టమని అన్నారు. ఈ నేపథ్యంలో మనం తయారు చేయని వ్యవస్థలు, పరిస్థితులపై ఆధారపడడం సరైంది కాదని గ్లోబల్ సౌత్‌కు సూచించారు. 21వ శతాబ్దంలో ప్రపంచ అభివృద్ధికి దక్షిణాది దేశాలే చోదక శక్తులని తేల్చిచెప్పారు. గురువారం 'వాయిస్ ఆఫ్ గ్లోబల్ సౌత్' వర్చువల్ సదస్సు ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఆహారం, ఇంధనం, ఎరువుల ధరల పెరుగుదల, ఆర్థిక వ్యవస్థపై కోవిడ్–19 ప్రభావం, వాతావరణ మార్పుల కారణంగా సంభవిస్తున్న ప్రకృతి విపత్తులపై ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త సంవత్సరం మనందరికి కొంగొత్త ఆశలు, నూతన శక్తిని తీసుకొస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఆసియా, ఆఫ్రికా, దక్షిణ అమెరికా దేశాలను గ్లోబల్ సౌత్‌గా వ్యవహరిస్తారు.

అరవణ ప్రసాద విక్రయాలు ఆపండి

తిరువనంతపురం: శబరిమలలో అరవణ ప్రసాదం విక్రయాలను నిలిపివేయాలని ట్రావెన్ కోర్ దేవాస్వోమ్ బోర్డు (టీడీబీ)ను కేరళ హైకోర్టు తాజాగా ఆదేశించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వు జారీ చేసింది. ఈ ప్రసాదం తయారీకి ఉపయోగించిన యాలకుల్లో పరిమితికి మించి పురుగు మందుల అవశేషాలు ఉన్నట్లు నిర్ధారణ కావడమే ఇందుకు కారణం. యాలకులు లేకుండా తయారు చేసిన లేదా నిర్దేశిత ప్రమాణాల మేరకు నాణ్యమైన యాలకులు ఉపయోగించిన తయారు చేసిన ప్రసాదాన్ని భక్తులకు విక్రయించవచ్చని న్యాయస్థానం సూచించింది. కొల్లాంకు చెందిన అయ్యప్ప స్పైసెస్ అనే కంపెనీ నుంచి దేవాస్వోమ్ బోర్డు కొనుగోలు చేసిన యాలకుల్లో 14 రకాల పురుగు మందుల ఆనవాళ్లు అనుమతించిన పరిమితి(ఎంఆర్‌ఎల్) కంటే అధికంగా ఉన్నట్లు రసాయన విశ్లేషణలో తేలింది. అయ్యప్ప స్పైసెస్ సంస్థ విజ్ఞప్తి మేరకు తిరువనంతపురం లోని ప్రభుత్వ ప్రయోగశాలతోపాటు భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ(ఎఫ్ఎస్ఎస్ఏఐ) గుర్తింపు పొందిన ప్రయోగశాలలోనూ యాలకులపై పరీక్షలు నిర్వహించారు. అవి సురక్షితం కాదని తేటతెల్లమయ్యింది. ప్రమాణాల మేరకు లేని యాలకులతో తయారు చేసిన ప్రసాదాన్ని భక్తులకు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని ఆహార భద్రత కమిషనర్‌కు ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. 2021–22లో యాలకుల కొనుగోలు కోసం టీడీబీ అయ్యప్ప స్పైసెస్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. 2022–23లోనూ కొనడానికి అంగీకరించింది. వేలం పాట గానీ, పత్రికల్లో ప్రకటన గానీ లేకుండానే ఈ ఒప్పందం కుదరడం గమనార్హం.

ఎయిర్‌పోర్ట్‌లో యురేనియం కలకలం

- పాకిస్తాన్ నుంచి వచ్చిన పార్సిల్‌లో కనుగొన్న సిబ్బంది

లండన్: లండన్‌లోని అత్యంత రద్దీగా ఉండే హీత్రో అంతర్జాతీయ విమానాశ్రయంలో యురేనియం ఉన్న పార్సిల్ కలకలం సృష్టించింది. రెండు వారాల క్రితం అంటే గత ఏడాది డిసెంబర్ 29న జరిగిన ఈ ఘటనలో ఆలస్యంగా వెలుగుచూసింది. పాకిస్తాన్‌లోని కరాచీ నగరం నుంచి ఈ పార్సిల్ బ్రిటన్‌కు చేరినట్లు మీడియాలో వార్తలొచ్చాయి. తుక్కు ఖనిజాలకు సంబంధించిన కార్గో పార్సిళ్ల మధ్యలో ఈ యురేనియం నింపిన పార్సిల్ ఒకదానిని ఎయిర్‌పోర్ట్ కార్గో సిబ్బంది స్కానింగ్ తనిఖీల సమయంలో గుర్తించారు. ఒక ఖనిజం కడ్డీల అడుగున దీనిని దాచి ఉంచినట్లు అధికారులు తెలిపారు. వెంటనే దీనిని బోర్డర్ ఆఫీసర్లకు అప్పగించగా దూరంగా నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి దేశ ఉగ్రవ్యతిరేక దళాలకు ఇచ్చేశారు. దీనిపై ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతుంది. కరాచీ నుంచి ఒమన్‌లోని మస్కట్‌కు అక్కడి నుంచి ఒమన్ ఎయిర్‌లైన్స్ ద్వారా లండన్‌కు వచ్చినట్లు తేల్చారు. ఇరాన్ జాతీయులకు అందజేసేందుకే దానిని బ్రిటన్‌కు తరలించారని బ్రిటిష్ మీడియాలో వార్తలొచ్చాయి. పాక్, ఒమన్‌లలో తనిఖీలను దాటించేసి బ్రిటన్‌కు యురేనియంను తరలించడం ఆందోళనకర విషయమని బ్రిటన్ సైన్యంలో రసాయనిక ఆయుధాల విభాగం మాజీ అధిపతి హ్యామిస్ బ్రెటన్ గార్డన్ వ్యాఖ్యానించారు. శిలల నుంచి సేకరించే రేడియోధార్మిక యురేనియంను అణు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, రియాక్టర్లలో ఇంధనంగా వినియోగిస్తారు. జలాంతర్గామి, అణ్వాయుధాల్లోనూ వాడతారు. లండన్ ఎయిర్‌పోర్ట్‌లో ప్రత్యక్షమైన పార్సిల్‌తో మాకు ఎలాంటి ప్రమేయం లేదని పాకిస్తాన్ తేల్చి చెప్పింది. మీడియాలో వచ్చే వార్తలన్నీ ఊహాత్మకమని పాకిస్తాన్ విదేశాంగ శాఖ స్పష్టంచేసింది.

- ఓబీసీ జనగణన జరపాలని సుప్రీం కోర్టు కేంద్ర ప్రభుత్వానికి నోటీస్ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నట్లు మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. దేశంలో బీసీల కుల గణన జరగాలని కొంతకాలంగా బీసీలు కోరుతున్నా , కేంద్రం పట్టించుకోవడం లేదని ఆయన ఒక ప్రకటనలో విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఓబీసీ కులగణన వెంటనే చేపట్టాలని కోరారు.

కల్తీ కేరాఫ్..
ఆ నలుగురు!

పాలమూరులో జోరుగా నకిలీ మద్యం, కల్తీ కల్లు దందా

- వారికి ఓ అధికారి అండ.. అధికార పార్టీ నేతల బినామీలదే కీలకపాత్ర!
- కల్లులో మత్తు కోసం ఆల్ప్రాజోలం, సీహెచ్, డైజోఫాం మిక్సింగ్
- రెండు కల్లు కాంపౌండ్‌ల నిర్వాహకుల మధ్య పోటీ
- బ్రాండెడ్ మద్యం కల్తీకి ప్రత్యేకంగా ఓ గ్యాంగ్
- నేతల ఒత్తిళ్లతో చేతులెత్తేసిన ఎక్సైజ్ శాఖ



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఓ ఇద్దరు కల్లు డిపోల నిర్వాహకులు..ఓ మద్యం వ్యాపారి..ఓ నకిలీ లిక్కర్ తయారీదారు.. ఉమ్మడి పాలమూరులో కల్తీ కల్లు, నకిలీ మద్యం దందాకు కేరాఫ్ వీళ్లేననే ఆరోపణలు విన్పిస్తున్నాయి. వీరికి ఓ అధికారి అండగా నిలుస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. అక్రమాలను అరికట్టాల్సిన ఓ ఎక్సైజ్ అధికారి కనుసన్నల్లో సిబ్బంది నిర్బంధ వసూళ్లకు పాల్పడుతుండగా, కల్లు డిపోల నిర్వాహకులు, మద్యం వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కల్లులో మత్తు కోసం కలిపే ఆల్ప్రాజోలం, సీహెచ్, డైజోఫాం.. లిక్కర్‌లో ఘాటు పెంచే స్పిరిట్ సరఫరా జోరుగా సాగుతోంది. మరోవైపు పేరున్న మద్యం బ్రాండ్లలో మూతలు తీసి నీరుపోసేందుకు ఓ ముఠా ఇటీవల సరిహద్దులు దాటి వచ్చి ఐదు జిల్లాల్లో కార్యకలాపాలు విస్తరించింది. అయినా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ నిద్ర 'మత్తు' వీడకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికార పార్టీ నేతల బినామీలే కల్తీ కల్లు, నకిలీ మద్యం దందా నిర్వహిస్తున్న నేపథ్యంలో ఎక్సైజ్‌శాఖ చేతులెత్తేసిందనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా పరిధిలో మద్యం, కల్లు కల్తీ రాకెట్ సూత్రధారులు, పాత్రధారులపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

మునుగోడులో కల్తీ లిక్కర్ వెనుక గద్వాల కింగ్!

నల్లగొండ జిల్లా మునుగోడు ఉప ఎన్నికల సమయంలో కల్తీ లిక్కర్ ఏరులై పారింది. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో దీన్ని గుర్తించిన అధికారులు కూపీ లాగారు. అనుమతి లేకుండా డిస్టిలరీ ఏర్పాటు చేసి నకిలీ మద్యం ఉమ్మడి నల్లగొండతో పాటు రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాకు తరలించినట్లు సమాచారం. ఇందులో బాలరాజుగౌడ్ కీలకంగా వ్యవహరించగా పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే గద్వాల జిల్లా పాతపాలెంకి చెందిన లిక్కర్ కింగ్ వెంకన్నగౌడ్ హస్తం కూడా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. కాగా ఇతను కర్ణాటక లిక్కర్‌ను తెలంగాణ, ఏపీకి అక్రమంగా తరలిస్తూ పలుమార్లు పోలీసులకు చిక్కగా ఇరు రాష్ట్రాల్లో కేసులు నమోదయ్యాయి. తన స్వగ్రామమైన పాతపాలెంలో నకిలీ మద్యం తయారు చేస్తూ కూడా పట్టుబడ్డాడు. గతేడాది నవంబర్‌లో రూ.10 లక్షల విలువ చేసే 750 కిలోల సీహెచ్‌ను హైదరాబాద్‌లో కొనుగోలు చేసి కర్నూలుకు తరలిస్తున్న క్రమంలో భూత్పూర్ సమీపంలో పట్టుకున్నారు. ఇటీవల ఆయనపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తారనే ప్రచారం జరిగినప్పటికీ బైండోవర్‌తో సరిపెట్టడం చర్చనీయాంశంగా మారింది.

ఇద్దరి కీలక పాత్ర

ఉమ్మడి పాలమూరులోని మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగుళాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాలకు ఆల్ప్రాజోలం, సీహెచ్, డైజోఫాం సరఫరా చేయడంలో మహబూబ్‌నగర్‌కు చెందిన ఇద్దరు కీలకంగా వ్యవహరిస్తున్నారు. సరిహద్దు రాష్ట్రమైన కర్ణాటకతో పాటు ఢిల్లీ, హైదరాబాద్ నుంచి ఈ నిషేధిత పదార్థాలను గుట్టుచప్పుడు కాకుండా జిల్లాకు దిగుమతి చేసుకుంటున్నారు. ఎవరికి వారు జిల్లాలు, మండలాలు, ప్రాంతాల వారీగా పంచుకుని ఏజెంట్లను పెట్టుకుని కోడ్ భాష ఆధారంగా సరుకును ఆయా డిపోలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది.

నువ్వా? నేనా?


మహబూబ్‌నగర్ పట్టణ శివారులో ఆ ఇద్దరికి సంబంధించిన కల్లు కాంపౌండ్‌లు దగ్గర దగ్గరగా ఉన్నాయి. అటు నిషేధిత మత్తు పదార్థాల రవాణాతో పాటు సదరు కాంపౌండ్‌లలో కల్లు విక్రయాల్లో కూడా ఇద్దరి మధ్య పోటీ నెలకొంది. ఇందులో ఒకరికి పట్టణ ప్రధాన కూడలిలో టైర్ల షాపు ఉంది. ఇతను తన పోటీదారుడిని, అతడి కాంపౌండ్‌లోకి కల్లు తాగేందుకు వెళ్లేవారిని బౌన్సర్లతో నిత్యం బెదిరింపులకు గురిచేస్తున్నట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ ముఖ్యనేత అండదండలు తనకే ఉన్నాయని సదరు వ్యక్తి దబాయిస్తుండగా, ప్రస్తుతం ఇద్దరి మధ్య తీవ్రస్థాయిలో వార్ నడుస్తున్నట్లు తెలిసింది. అయితే ఈ పంచాయితీ సదరు ముఖ్యనేత వద్దకు చేరడంతో, తాను సమస్య పరిష్కరిస్తానని, గొడవలు పడొద్దని మందలించినట్లు సమాచారం.

బ్రాండెడ్ మద్యం బాటిళ్లలో నీళ్లు!

ఇక ఉమ్మడి జిల్లాలో చీప్ లిక్కర్ అమ్మకాలు ఎక్కువగా సాగుతుండడంతో వాటిలో స్పిరిట్ కలుపుతూ కల్తీ చేస్తున్నారు. అంతేకాదు వైన్స్‌లతోపాటు బార్లలో బ్రాండెడ్ కంపెనీలకు సంబంధించిన లిక్కర్ బాటిళ్లలో 40 శాతం మేర మద్యం తీసి నీరు కలుపుతున్నట్లు తెలుస్తోంది. దీని వెనుక ఓ మద్యం వ్యాపారి హస్తం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. సదరు వ్యాపారి ఆధ్వర్యంలోనే వికారాబాద్ నుంచి వచ్చిన ఎవరూ కనిపెట్టని విధంగా లిక్కర్ మూతలు తీసి, పెట్టే గ్యాంగ్ పాలమూరులో కార్యకలాపాలను విస్తరించినట్లు సమాచారం.

విలీన గ్రామాల కౌన్సిలర్లు రాజీనామా చేయాలి!

- డెడ్‌లైన్ విధించిన రైతు ఐక్య కార్యాచరణ కమిటీ
- సంక్రాంతి రోజు రోడ్ల మీద ముగ్గులు వేసి నిరసన
- ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరిక
- రాజీనామాకు ముందుకొచ్చిన ఇద్దరు బీజేపీ కౌన్సిలర్లు
- ముదురుతున్న కామారెడ్డి మాస్టర్ ప్లాన్ వివాదం



కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని లింగాపూర్‌లో సమావేశమైన రైతు ఐక్యకార్యాచరణ కమిటీ ప్రతినిధులు

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి మాస్టర్ ప్లాన్ వివాదం రోజురోజుకూ ముదురుతోంది. నెల రోజులుగా ఆందోళనలు చేస్తున్న రైతు ఐక్య కార్యాచరణ కమిటీ.. విలీన గ్రామాల కౌన్సిలర్ల రాజీనామాకు డెడ్‌లైన్ విధించింది. మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ గ్రామంలో గురువారం సమావేశమైన రైతులు ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా విలీన గ్రామాలకు చెందిన తొమ్మిది మంది కౌన్సిలర్లు తమ పదవులకు రాజీనామా చేయాలని కోరుతూ ఐక్య కార్యాచరణ కమిటీ తీర్మానించింది. ఈ నెల 20 లోపు రాజీనామా చేయాలని డెడ్‌లైన్ విధించింది. అలాగే సంక్రాంతి పండుగ రోజున రైతులంతా కుటుంబ సమేతంగా కామారెడ్డి పట్టణంలోని ప్రధాన రోడ్లపై ముగ్గులు వేసి నిరసన తెలపాలని నిర్ణయించారు. ఈనెల 17న పాతరాజంపేట గ్రామంలో సమావేశమై భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని ప్రకటించారు. మున్సిపల్ మాస్టర్‌ప్లాన్ ద్వారా ఇండస్ట్రియల్, గ్రీన్ జోన్లతో పాటు వంద ఫీట్ల రోడ్ల పేరుతో భూములను కొల్లగొట్టే ప్రయత్నాలను నిరసిస్తూ రైతులంతా నెల రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగిస్తున్నారు. కాగా, మాస్టర్‌ప్లాన్ పై అభ్యంతరాలకు ఈ నెల 11న గడువు ముగిసింది. మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేయడానికి మున్సిపాలిటీలో తీర్మానం చేయాలని కోరుతూ 49 మంది కౌన్సిలర్ల ఇళ్లకు వెళ్లి రైతులు వినతిపత్రాలు అందజేశారు. అయితే మున్సిపల్ తీర్మానంపై కౌన్సిల్ ఎలాంటి నిర్ణయం ప్రకటించకపోవడంతో రైతు ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు, విలీన గ్రామాల కౌన్సిలర్ల రాజీనామాల ద్వారా కౌన్సిల్‌పై ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించారు. కాగా విలీన గ్రామాలకు చెందిన బీజేపీ కౌన్సిలర్లు కాసర్ల శ్రీనివాస్, సుతారి రవిలు రాజీనామా చేయడానికి సిద్ధమని ప్రకటించారు. ఈ సమావేశంలో జెడ్పీ మాజీ చైర్మన్ కాటిపల్లి వెంకట రమణారెడ్డి, రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు. సంక్రాంతి పండుగ తరువాత ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని వారు చెప్పారు.

'డిపెండబిలిటీ'నే అసలు సమస్య

- సుప్రీంకోర్టుకు స్పష్టం చేసిన ఏపీ న్యాయవాది
- కర్ణాటక ప్రాజెక్టుల వల్ల ఏపీకి తీరనిలోటు: తెలంగాణ తరఫు న్యాయవాది
- కృష్ణా ట్రిబ్యునల్ అవార్డుపై సుప్రీంకోర్టులో వాదనలు

సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణా జలాల డిపెండబిలిటీ (కొంతకాలం వ్యవధిలో వార్షిక నీటి అభివృద్ధిపై ఆధారపడే ఉపరితల జలాలు)నే అసలు సమస్య అని ఏపీ తరఫు సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్త సుప్రీంకోర్టుకు స్పష్టం చేశారు. అదే విధంగా ఎలాంటి అనుమతులు లేకుండా కర్ణాటక నిర్మిస్తున్న నీటి పారుదల ప్రాజెక్టుల వల్ల ఏపీకి తీరని లోటని తెలంగాణ తరఫు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కృష్ణాజలాల వాటాల పంపకంపై ఏపీ, కర్ణాటక దాఖలు చేసిన పిటిషన్లను జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ రామసుబ్రహ్మణ్యన్‌తో కూడిన ధర్మాసనం గురువారం విచారించింది. తెలంగాణ తరఫు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ వాదనలు వినిపిస్తూ కృష్ణా జలాల పంపకంపై సుప్రీంకోర్టులో స్టే ఉందని గుర్తు చేశారు. అయినప్పటికీ ఎలాంటి అనుమతులు లేకుండా 65% కన్నా తక్కువ ఆధారపడిన జలాలను మాత్రమే తీసుకుంటున్నామని కర్ణాటక చేసిన వాదనను కృష్ణా ట్రిబ్యునల్ తిరస్కరించిందన్నారు.

అనుమతుల్లేకుండా కర్ణాటక ప్రాజెక్టుల నిర్మాణం..

ఎలాంటి అనుమతులు లేకుండా రూ.వేలకోట్లతో ప్రాజెక్టులను నిర్మించి పరిష్కరించాలని కోర్టులను కోరడం మంచిపద్ధతి కాదన్నారు. కర్ణాటక దాఖలు చేసిన ఇంటర్ లొకేటరీ అప్లికేషన్‌పై విచారణ చేయాల్సిన అవసరం లేదన్నారు. కృష్ణా నదీ జలాల పంపకానికి సంబంధించి ప్రధాన పిటిషన్‌పై వాదనలు వినిపించేందుకు తెలంగాణ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. ఈ అంశంపై ఇప్పటికే వివాదాలు ఉన్నాయా అని ధర్మాసనం ప్రశ్నించింది. వివాదాల నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్ కోర్టును ఆశ్రయించిందని తెలంగాణ న్యాయవాది తెలిపారు. ట్రిబ్యునల్‌కు వెళ్లాలని కోర్టు సూచించగా, అనుమతులు లేని ప్రాజెక్టులకు అన్ని అనుమతులు తప్పనిసరి అని ట్రిబ్యునల్ స్పష్టం చేసిందని వివరించారు. అయినప్పటికీ కర్ణాటక ఎలాంటి అనుమతులు లేకుండా 130 టీఎంసీల అదనపు జలాలతో 5 లక్షల హెక్టార్లకు పైగా సాగునీరు అందిస్తామని చెబుతోందన్నారు. ఈ అదనపు నీటిని ఎలా తీసుకొస్తామని చెప్పాల్సిన బాధ్యత కర్ణాటకదే అని తెలిపారు.

కర్ణాటక, మహారాష్ట్రలు అలా చేస్తే ఏపీ, తెలంగాణలకు చుక్క నీరు రాదు

కేటాయించిన జలాలతో పోల్చితే ఎక్కువ నీటిని కనుక కర్ణాటక, మహారాష్ట్రలు వినియోగించుకుంటే ఏపీ, తెలంగాణలకు చుక్క నీరు లేకుండా కృష్ణా జలాలు ఎండిపోతాయన్నారు. ఏపీ తరుపు సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్త జోక్యం చేసుకుంటూ డిపెండబిలిటీ జలాలే అతిపెద్ద సమస్య అని కోర్టుకు తెలిపారు. డిపెండబిలిటీ జలాల విషయంలో మూడు రకాల లెక్కలతో ట్రిబ్యునల్ తీర్పు ఇవ్వడం వల్లే నష్టం జరుగుతోందన్నారు. అన్ని సబ్జెక్టుల్లో కన్నా గణితం చాలా క్లిష్టమైందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. 75% డిపెండబిలిటీ జలాల ఆధారంగా 70 వ దశకంలో ఏపీకి 667 టీఎంసీలు, 80వ దశకంలో 893 టీఎంసీలు మాత్రమే దక్కాయన్నారు. కర్ణాటక, మహారాష్ట్ర వాదనల ప్రకారం 65% డిపెండబిలిటీ జలాల ఆధారంగా అయితే తెలుగు రాష్ట్రాలకు ఇంకా అన్యాయం జరుగుతుందన్నారు. కృష్ణా నదిలో నిరంతర ప్రవాహం ఉంటుందా అని ధర్మాసనం ప్రశ్నించగా... వర్షాల ఆధారంగానే ఉంటుందని ఏపీ, తెలంగాణ న్యాయవాదులు వివరించారు. అనంతరం తదుపరి విచారణపై ధర్మాసనం స్పష్టత ఇవ్వలేదు. 'ధర్మాసనంలోని న్యాయమూర్తులు వేరు వేరు ధర్మాసనాలు చూడాల్సి ఉంటుంది. తదుపరి విచారణపై స్పష్టత ఇవ్వలేం' అని ధర్మాసనం పేర్కొంది. ఈ ధర్మాసనమే విచారించాలని ప్రధాన న్యాయమూర్తిని కోరుతామని అన్ని పక్షాల న్యాయవాదులు కోరగా, అందుకు ధర్మాసనం స్వేచ్ఛనిచ్చింది.

హిడ్మ చనిపోలేదు

ఆ వార్తలు అవాస్తవం

- పోలీసుల గగనతల దాడులు హేయం...
- దేశ భద్రత కోసం సరిహద్దుల్లో ఉండాల్సిన సైన్యాన్ని ఆదివాసీలను వేధించేందుకు ఉపయోగిస్తున్నారు
- మావోయిస్టు పార్టీ నేత ఆజాద్



సాక్షి, హైదరాబాద్, చర్ల: మావోయిస్టు కీలక నేత, బెటాలియన్ కమాండర్ హిడ్మ మృతిచెందలేదని మావోయిస్టులు స్పష్టత ఇచ్చారు. ఈ మేరకు గురువారం మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం–అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ (బీకే–ఏఎస్ఆర్) కమిటీ కార్యదర్శి ఆజాద్ ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు. బుధవారం జరిగిన సర్జికల్ స్ట్రైక్‌లో మావోయిస్టు నేత హిడ్మ మృతిచెందినట్టు ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల పోలీసులు దేశం అంతా ప్రచారం చేశారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. గగనతలం నుంచి చేసిన దాడులు వాస్తవమేనని, వారు అనుకున్న లక్ష్యం నెరవేరలేదని స్పష్టం చేశారు. సరిహద్దుల్లో సీఆర్‌పీఎఫ్, కోబ్రా, గ్రేహౌండ్స్ మోహరించిన ఆదివాసీలపై దాడులకు దిగుతున్నారని ఆరోపించారు. ఆ దాడులకు ప్రజా గెరిల్లా సైన్యం గట్టి సమాధానం ఇచ్చిందని వెల్లడించారు. దేశ భద్రత కోసం సరిహద్దుల్లో ఉండాల్సిన సైన్యం ఛత్తీస్‌గఢ్ అడవుల్లో ప్రతి నాలుగు ఊర్లకు ఒక క్యాంపు చొప్పున పెట్టి ఆదివాసీలను భయభ్రాంతులకు గురిచేస్తోందని ఆరోపించారు. నిత్యం ఇనుప బూట్ల పదఘట్టనలో ఆదివాసీలు నలిగిపోతున్నారని ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలోనే అత్యంత విలువైన రకరకాల ఖనిజాలు, ఇతర అటవీ సంపద ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో ఉందని వాటిని కొల్లగొట్టేందుకు బహుళ జాతి కంపెనీలు పన్నాగం పన్నాయని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఇక్కడ సంపద ఆదివాసీలకే దక్కాలని మావోయిస్టు పార్టీ కోరుతోందని, ఆ దిశగా ఆదివాసీలను చైతన్యపర్చడం పాలకులకు మింగుడుపడడం లేదని జగన్ తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాన్ని పోలీస్ క్యాంపుగా మార్చి పచ్చటి అడవిలో నెత్తుటేరులు పారించేందుకు చివరకు వైమానిక దాడులకు పూనుకుంటున్నారని వెల్లడించారు. మావోయిస్టుపార్టీని ప్రజల నుంచి వేరుచేసేందుకు చేస్తున్న కుట్రను ఖండించాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంలోని మోదీ , అమిత్‌షాలు సామ్రాజ్యవాద ఏజెంట్లుగా పనిచేస్తున్నారని ఆరోపించారు. దేశ ప్రజలపై వైమానిక దాడులు చేయడం హేయమైన చర్యగా అందరూ ఖండిస్తూ, గ్రీన్‌హంట్ ఆపరేషన్‌కు వ్యతిరేకంగా పోరాడాలని కోరిన ఆజాద్.. దండకారణ్యం నుంచి సైన్యాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని పాలకులను డిమాండ్ చేశారు.

'రాష్ట్రప్రభుత్వమే బీసీ జనగణన చేపట్టాలి'



పంజగుట్ట: బిహార్ రాష్ట్ర ప్రభుత్వం మాదిరిగా తెలంగాణ సీఎం కేసీఆర్ కేంద్రంతో సంబంధం లేకుండానే బీసీ జనగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. అధికారంలోకి రాగానే జనగణన చేస్తామని కేంద్రంలోని బీజేపీ, అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపామని రాష్ట్ర ప్రభుత్వం మిన్నకుండిపోయామని, ఈ రెండు ప్రభుత్వాలు కూడా బీసీలను మోసం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. సంక్రాంతి తర్వాత రాష్ట్రంలో బీసీ జనగణన చేయకపోతే సత్తా చాటుతామని, అమరావతి నుంచి హైదరాబాద్ వరకు బస్సుయాత్ర నిర్వహించి బీసీలను చైతన్యపరుస్తామని తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ రాష్ట్రంలోని బీసీ జనగణనను తామే చేసుకుంటామని జాతీయపార్టీ అయిన బీఆర్ఎస్ ఉత్తర్వులు తీసుకువచ్చి దేశానికి ఆదర్శ పార్టీగా నిలవాలని సూచించారు. ఇప్పటికే బీసీల లెక్కలు లేనందున యూపీ స్థానికసంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లను న్యాయస్థానం కొట్టేసిందని, అదే తరహాలో మధ్యప్రదేశ్‌లో కూడా చేశారని, తెలంగాణలో 34 నుంచి 18 శాతానికి కుదించారని విచారం వ్యక్తం చేశారు. 7.3 శాతం ఉన్న అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, 60 శాతం ఉన్న బీసీలకు 20 శాతం కూడా కల్పించకపోవడం దారుణమన్నారు.

సొంతూరుకు చలోచలో...

సాక్షి నెట్‌వర్క్: సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్తున్న వారితో రహదారులు కిటకిటలాడుతున్నాయి. శుక్రవారం నుంచి పండుగ సెలవులు ప్రారంభమవుతుండగా గురువారం సాయంత్రం నుంచే ఊళ్లకు వెళ్తున్న వారితో రద్దీ ఏర్పడింది. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు కిక్కిరిసి వెళ్తున్నారు. హైదరాబాద్ నుంచి ఏపీకి వాహనాలు పెద్ద సంఖ్యలో వెళ్తున్నాయి. హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారిపై వాహనాలు పరుగులు తీస్తున్నాయి. పంతంగి టోల్‌గేట్ వద్ద కార్లు బారులు తీరాయి. ప్రమాదాలు చోటుచేసుకోకుండా, ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రధాన కూడళ్లలో పోలీసులు నిరంతరం పరిశీలిస్తూ వాహనదారులకు సూచనలు చేస్తున్నారు.



హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేట్ వద్ద ఆంధ్రా వైపు బారులుతీరిన వాహనాలు

క్లుప్తంగా...

కేసీఆర్ సీఎం అయ్యాక ప్రజాస్వామ్యం ఖూనీ

ఈటల రాజేందర్



జహీరాబాద్: కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. గురువారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాల్లో మంత్రులు, ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రతిపక్ష పార్టీలు ఎలాంటి కార్యక్రమాలకు పిలుపు ఇవ్వకున్నా వేలాది మందిని ముందస్తుగా అరెస్టు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. నీ పథకాలు, నీ పరిపాలన పద్ధతులు బాగుంటే ప్రజల్లో నీకెందుకు విశ్వాసం లేకుండా పోయిందని కేసీఆర్‌ను ఆయన ప్రశ్నించారు. ప్రజలకు ముఖ్యమంత్రి పట్ల ఎందుకు నమ్మకం లేకుండా పోయిందనే విషయాన్ని ఆయనే ఆలోచించుకోవాలన్నారు. బీఆర్ఎస్ కమ్యూనిస్టులతో పొత్తు పెట్టుకున్నా వచ్చే ఎన్నికల్లో బీజేపీని నిలువరించే పరిస్థితి ఉండబోదని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీజేపీ బలంగా ఉందని, చేరికలు తమ పార్టీ వ్యూహంలో ఒక భాగమన్నారు. ఎన్నికల వాతావరణం ఏర్పడగానే బీఆర్ఎస్‌ను తమ పార్టీ బొంద పెట్టడం ఖాయమని ఈటల పేర్కొన్నారు.

రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు..



సాక్షి, హైదరాబాద్: స్వరాష్ట్రాన్ని సాధించుకున్న తర్వాత కూడా నీళ్లు, నిధులు, నియామకాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ఆమె గురువారం తన ట్విట్టర్ వేదికగా బీఆర్ఎస్ పార్టీ విధానాలు, ముఖ్యమంత్రి పైన ధ్వజమెత్తారు. ప్రాణాలు సైతం లెక్క చేయకుండా ప్రజలంతా పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుంటే, దొర తన స్వార్థ రాజకీయాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టి నిలువునా ముంచారని పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడి ఎనిమిదేళ్లు గడుస్తున్నా విభజన హామీల ఊసెత్తడం లేదన్నారు. ప్రజల పోరాటాన్ని ఆసరాగా చేసుకొని ముఖ్యమంత్రి పీఠం ఎక్కి అందిన కాడికి దోచుకొని, తెలంగాణను అడుగడుగునా కొల్లగొట్టారని విమర్శించారు. ఇన్నాళ్లు బీజేపీకి వంతపాడి తెలంగాణ సంపదను కళ్ల ముందే దోచుకున్నారని, ప్రస్తుతం అదే బీజేపీని తిడుతూ దేశాన్ని కూడా దోచుకునే కుట్ర చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ స్వార్థ రాజకీయాలకు తెలంగాణ ప్రజలు బలవుతున్నారని తెలిపారు. బీజేపీ ముక్త్ భారత్, బీఆర్ఎస్ ముక్త్ తెలంగాణ కావాలని తన ట్విట్టర్ వేదికగా ఆమె పేర్కొన్నారు.

అకృత్యాలు, అభద్రత.. ఇదేనా సంక్షేమ పాలన?

బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతామూర్తి



సాక్షి, హైదరాబాద్: పేద గర్భిణులకు ప్రసవం చేయడానికి నిరాకరణ, గురుకులాల్లో విద్యార్థులకు పురుగుల భోజనం, ఆడపిల్లలకు అభద్రత.. ఇదేనా సంక్షేమ పాలన అని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతామూర్తి రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మహిళలు, అమ్మాయిలపై రోజురోజుకూ అకృత్యాలు పెరిగిపోతున్నాయని ధ్వజమెత్తారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఇప్పటివరకు కంటివెలుగు కింద ఎంతమందికి వైద్య సేవలు అందించారో వివరాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇటీవల నాగర్‌కర్నూల్ జిల్లాలో ఒక గర్భిణికి ప్రసవం చేసేందుకు ఆసుపత్రులు నిరాకరించడంతో తల్లీ, బిడ్డ మృతి చెందిన ఘటనను హైకోర్టు సుమోటోగా తీసుకోవడం హర్షణీయమన్నారు. వార్తాపత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా హైకోర్టు తనంతట తాను విచారణ చేపట్టడాన్ని మరింత పెంచాలని బీజేపీ తరఫున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. డ్రగ్స్, మనుషుల అక్రమ రవాణా, మహిళలపై అత్యాచారాలు, మద్యం అమ్మకాల్లో తెలంగాణ ముందువరుసలో నిలుస్తోందని ఆమె ఎద్దేవా చేశారు.

ముంపు బాధితులకు ఇచ్చిన హామీ ఏమైంది

ఇందిరా శోభన్



సాక్షి, హైదరాబాద్: ముందు గోదావరి ముంపు బాధితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన తర్వాత కొత్త హామీలు ఇవ్వాలని సీఎం కేసీఆర్‌కు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కోర్ కమిటీ సభ్యురాలు ఇందిరా శోభన్ సూచించారు. ఖజానాలో పైసలకు లోటు లేదని, మస్తు పైసలు ఉన్నాయని చెప్పిన సీఎం.. ఇచ్చిన వాగ్దానాలు ఎందుకు అమలు చేయడంలేదో చెప్పాలని గురువారం ఒక ప్రకటనలో నిలదీశారు. గత ఏడాది సీఎం భద్రాచలం వెళ్లి బాధితులకు రూ.10 వేలు ఆర్థిక సహాయం, ఉచిత రేషన్, డబుల్ బెడ్రూం ఇండ్లు వెంటనే కట్టించే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీ నెరవేరకపోవడంతో ఆదివాసులు దాదాపు 150 రోజుల నుంచి పిల్లలు, వృద్ధులు, గర్భిణులు కలసి దీక్ష చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇచ్చిన హామీలకే దిక్కులేదని మళ్లీ ముఖ్యమంత్రి కొత్తగా హామీలు ఇవ్వడం విచిత్రంగా ఉందని ఇందిరా శోభన్ ఎద్దేవా చేశారు.

పని మీదే.. పరిష్కారాలు నావి!

రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు ఠాక్రే దిశానిర్దేశం

అంతర్గత విభేదాలు పక్కన పెట్టి ఒక్కతాటిపైకి రావాలి

- వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా ప్రతి నేత, కార్యకర్త పనిచేయాలి
- హాథ్‌సే హాథ్ జోడో యాత్రలను విజయవంతం చేయాలి
- సీనియర్లతో పాటు అన్ని కమిటీలతో భేటీ
- రెండురోజుల పర్యటన ముగించుకొని ఢిల్లీ పయనం



సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది చివర్లో జరిగే అసెంబ్లీ ఎన్నికలే టార్గెట్‌గా ప్రతి కార్యకర్త, నాయకుడు పనిచేయాలని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల కొత్త ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే చెప్పారు. ఆ ఎన్నికల్లో విజయం సాధించడం కాంగ్రెస్‌కు అత్యంత అవసరమనే విషయాన్ని పార్టీ నేతలు గుర్తెరగాలని హితవు పలికారు. ఇన్‌చార్జిగా నియమితులైన తరువాత తొలిసారిగా బుధవారం హైదరాబాద్‌కు వచ్చిన ఠాక్రే రెండురోజుల పాటు పార్టీలోని వివిధ స్థాయి నాయకులతో సమావేశమయ్యారు. సీనియర్ కాంగ్రెస్ నేతలతో పాటు పీఏసీ, పీఈసీ, డీసీసీ, పీసీసీ కార్యవర్గాలు, కాంగ్రెస్ అనుబంధ సంఘాలు, అధికార ప్రతినిధులు, ముఖ్య నాయకులతో వేర్వేరుగా చర్చించారు. జనవరి 26 నుంచి దేశవ్యాప్తంగా ప్రారంభం కానున్న 'హాథ్‌సే హాథ్ జోడో'కార్యక్రమంపైనే ప్రధానంగా దిశా నిర్దేశం చేసిన ఠాక్రే.. పనిలో పనిగా రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడానికి పార్టీ పరంగా చేపట్టాల్సిన చర్యల గురించి వివరించారు. ఎన్నికలు ఎంతో దూరంలో లేవనే విషయాన్ని నొక్కి చెపుతూ అంతర్గత విభేదాలను పక్కనబెట్టి సీనియర్లు, అనుభవజ్ఞులు అంతా ఒక్కతాటిపైకి వచ్చి పనిచేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. నియోజకవర్గాల్లో గెలుపు లక్ష్యంగా ఏం చేయాలనే దానిపై దృష్టి పెడితే.. చిన్న చిన్న సమస్యలు పరిగణనలోకి రావని స్పష్టం చేశారు. నిత్యం ప్రజల్లో ఉండడం ద్వారా, వారికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందనే భద్రతా భావాన్ని కల్పించాలని సూచించారు. అంతర్గత సమస్యలను తనకు వదిలేసి, ప్రజల్లోకి వెళ్లి పని చేయాలని నేతలందరికీ స్పష్టం చేశారు.

సమష్టిగా పనిచేస్తే అధికారం మనదే..

రెండు పర్యాయాలు అధికారంలోకి వచ్చి మరోసారి గెలుపు లక్ష్యంగా పావులు కదుపుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పట్ల రాష్ట్ర ప్రజల్లో అసంతృప్తి నెలకొని ఉందని ఠాక్రే చెప్పారు. బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం కాంగ్రెస్ మాత్రమేననే అభిప్రాయం ప్రజల్లో ఇప్పటికీ బలంగా ఉందని అన్నారు. అయితే అంతర్గత కుమ్ములాటలు, పార్టీ ఫిరాయింపుల వల్ల కాంగ్రెస్ పార్టీని ప్రజలు విశ్వాసంలోకి తీసుకోలేని పరిస్థితి ఉందని వివరించారు. అందువల్ల బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం తామే అనే నమ్మకాన్ని ప్రజల్లో కల్పిస్తూ, జనం సమస్యలపై పోరాడితే స్వల్ప వ్యవధిలోనే వారిని కాంగ్రెస్ వైపు మళ్లించవచ్చని సూచించినట్లు తెలిసింది. బీజేపీ, టీఆర్ఎస్, ఎంఐఎం ఒకే తాను ముక్కలనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీకి సంస్థాగతంగా బలం లేదని, గత ఎన్నికల్లో వంద చోట్ల డిపాజిట్లు కూడా రాలేదని నాయకులు ఠాక్రే దృష్టికి తీసుకురాగా.. సమష్టిగా పనిచేస్తే అధికారం మనదేనని ఆయన వ్యాఖ్యానించినట్లు సమాచారం.

అంతర్గత కుమ్ములాటలపై సీరియస్!

పార్టీలో నాయకుల మధ్య నెలకొన్న అంతర్గత కుమ్ములాటలపై ఠాక్రే ఒకింత సీరియస్ అయినట్లు తెలిసింది. పార్టీకి ఉన్న అనుకూలతలను అంతర్గత విభేదాలతో దూరం చేస్తున్నారని ఆయా సమావేశాల్లో వ్యాఖ్యానించినట్లు సమాచారం. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్న సమావేశంలో.. పార్టీకి నాయకత్వం వహిస్తున్న సీనియర్లు, అనుభవజ్ఞులు ఒక్కతాటిపై నడిస్తే, జిల్లాలు, నియోజకవర్గాల్లో సమన్వయం ఉంటుందని చెప్పినట్లు పార్టీవర్గాలు వెల్లడించాయి. కలిసికట్టుగా పనిచేయాలంటూ హెచ్చరికలతో కూడిన హితబోధ చేసినట్లు తెలిసింది.

చెత్తబుట్టలో షోకాజ్ నోటీసులు: కోమటిరెడ్డి

భేటీ అనంతరం కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు. 'నాకిచ్చిన షోకాజ్ నోటీసులు ఎప్పుడో చెత్తబుట్టలో పడ్డాయి. మా ఫోటోలను మార్ఫింగ్ చేసిన విషయాన్ని ఏఐసీసీనే పట్టించుకోవడం లేదు. నా ఫొటో మార్ఫింగ్ అయిందని స్వయాన సీపీ చెప్పారు. ఇక పీసీసీ కమిటీలను నేను పట్టించుకోను. నాలుగైదు సార్లు ఓడిపోయినవాళ్లతో నేను కూర్చోవాలా?'అని వ్యాఖ్యానించారు. తాను నియోజకవర్గంలో బిజీగా ఉండడం వల్లే బుధవారం ఠాక్రేను కలవలేదని చెప్పిన ఆయన.. సీతక్క, వీరయ్య, జగ్గారెడ్డి ఎందుకు కలవలేదో వాళ్లనే అడగండి అని అన్నారు. ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో బ్రేక్‌ఫాస్ట్ సమయంలో సమావేశమైన ఠాక్రే, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గంటకు పైగా వివిధ అంశాలపై చర్చించారు. మునుగోడు ఎన్నిక సమయంలో చోటు చేసుకున్న పరిణామాలతో పాటు రాష్ట్రంలో వైఎస్ షర్మిల, చంద్రబాబు రాజకీయ అడుగులు ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. టీపీసీసీ నాయకులు షర్మిలపై విమర్శలు చేసినట్లుగా..చంద్రబాబుపై చేయడం లేదని కోమటిరెడ్డి వివరించినట్లు సమాచారం. ఇలావుండగా రెండురోజుల రాష్ట్ర పర్యటన ముగించిన ఠాక్రే గురువారం ఢిల్లీ బయలుదేరి వెళ్లారు.

అసెంబ్లీ ఎన్నికలు.. సమష్టిగా ఎదుర్కొంటాం

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే

- రాష్ట్రంలో బలమైన శక్తిగా కాంగ్రెస్.. నేతలంతా ఒక్కతాటి పైనే
- రాహుల్ సందేశాన్ని రాష్ట్రంలో ఇంటింటికీ చేరవేయాలి
- ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఠాక్రే, కోమటిరెడ్డి వెంకటరెడ్డి భేటీ



గురువారం గాంధీభవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాణిక్‌రావ్ ఠాక్రే. చిత్రంలో రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, మధుయాష్కి, బోసురాజు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి బలమైన నాయకత్వం, యంత్రాంగం ఉందని, సమష్టిగా పనిచేసి డిసెంబర్‌లో జరిగే అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొంటామని ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే అన్నారు. నాయకులందరూ ఒక్కతాటిపైనే ఉన్నారని చెప్పారు. రెండురోజుల పర్యటన కోసం రాష్ట్రానికి వచ్చిన ఆయన బుధ, గురువారాల్లో పార్టీలోని ముఖ్య నాయకులు, వివిధ విభాగాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. జిల్లాల వారీగా పార్టీ పరిస్థితిని ఆరా తీశారు. గురువారం సాయంత్రం గాంధీభవన్‌లో పీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నాయకుడు భట్టి విక్రమార్క, మాజీ ఎంపీ మధు యాష్కీ తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలతో మాట్లాడి సమాచారం తీసుకున్నామని, కలిసి కట్టుగా పనిచేయాలనే నిర్ణయానికి వచ్చామని ఠాక్రే చెప్పారు. నేతలు, కార్యకర్తలు తెలంగాణలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చేందుకు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని , తెలంగాణలో ఇది కీలక సమయమని అన్నారు. భవిష్యత్ ఎన్నికల కోసం అన్ని విధాల సన్నద్ధం కావాలని నిర్ణయించామని, ఈలోపు ఏఐసీసీ ఇచ్చిన పిలుపునకు అనుగుణంగా ప్రజల్లోకి వెళతామని చెప్పారు.

20 నుంచి మూడ్రోజులు రాష్ట్రంలోనే..

రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర దేశంలో విజయవంతంగా సాగుతోందని, కన్యాకుమారి నుంచి మొదలైన యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఠాక్రే చెప్పారు. భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా దేశ వ్యాప్తంగా ఈనెల 26 నుంచి మొదలయ్యే హాథ్‌సే హాథ్ జోడో యాత్రను తెలంగాణలో విజయవంతం చేయాలన్నారు. 2 నెలల పాటు సాగే ఈ యాత్రలో రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో ఇచ్చిన సందేశాన్ని ఇంటింటికీ చేర్చాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఇప్పటికే ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. ప్రతి జిల్లా, ప్రతి బ్లాక్‌లో సాగే ఈ యాత్రను పీసీసీ అధ్యక్షుడు జిల్లాల వారీగా ప్రారంభిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, నాయకులు పాల్గొనాలన్నారు. ఈనెల 20న మరోసారి హైదరాబాద్‌కు వచ్చి మూడురోజుల పాటు ఉంటానని, హాథ్‌సే హాథ్ జోడో యాత్రను ఖరారు చేస్తానని చెప్పారు.

కోమటిరెడ్డికి ఎలాంటి అసంతృప్తి లేదు

కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఎలాంటి అసంతృప్తి లేదని ఠాక్రే చెప్పారు. నియోజకవర్గంలో బిజీగా ఉండడం వల్ల గాంధీభవన్‌కు రాలేదని, తర్వాత జరిగే సమావేశాలకు వస్తారని అన్నారు. కోమటిరెడ్డి మంచివాడంటూ కితాబిచ్చారు. కాగా ఠాక్రేతో కోమటిరెడ్డి ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ప్రత్యేకంగా గంట సేపు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మునుగోడు ఉప ఎన్నిక ముందు నుంచీ జరిగిన పరిణామాలపై చర్చించినట్లు సమాచారం.

అనుభవజ్ఞుడైన నేత ఠాక్రే : రేవంత్‌రెడ్డి

మహారాష్ట్ర హోం మంత్రిగా సుదీర్ఘకాలం పనిచేసిన మాణిక్‌రావు ఠాక్రే పీసీసీ అధ్యక్షుడిగా, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా వివిధ హోదాల్లో కాంగ్రెస్‌కు సేవలందించారని రేవంత్‌రెడ్డి చెప్పారు. ముంబై బాంబు పేలుళ్లు, మత కల్లోలాల సమయంలో హోంమంత్రిగా సేవలందించిన ఆయన నేతృత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మంచి ఫలితాలు సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీలో అంతర్గత సమస్యలను పరిష్కరించడంతో పాటు సామరస్యపూర్వక వాతావరణాన్ని కల్పిస్తారని అన్నారు.

కేసీఆర్ కుటుంబం జైలుకెళ్లడం ఖాయం

కొల్లాపూర్ సభలో బండి సంజయ్

- ఏపీ ప్రజలను అవమానించిన కేసీఆర్‌కు బడిత పూజ చెయ్యాలి
- మాజీ సీఎస్ సోమేశ్ అక్రమాలపై కేసులు పెట్టాలి



కొల్లాపూర్ సభలో మాట్లాడుతున్న బండి సంజయ్

కొల్లాపూర్: 'ముఖ్యమంత్రి కేసీఆర్ ఎనిమిదేళ్ల ప్రధాని నరేంద్ర మోదీకి వంగి దండాలు, పొర్లు దండాలు పెట్టిండు. ఇప్పుడు తిడుతున్నడు. కేసీఆర్ కుటుంబం చేస్తున్న దందాలపై కేంద్రం దృష్టి పెట్టింది. కేసీఆర్ బిడ్డ ఢిల్లీలో దొంగసారా దందా చేసింది. పత్తాలాట, క్యాసినోలు కూడా నడుపుతున్నరు. కేసీఆర్ కుటుంబం చేయని దొంగ దందాలు లేవు. వీటి మీద విచారణ జరిగితే కల్వకుంట్ల కుటుంబం జైలుకు పోవడం ఖాయం. అందుకే ప్రధాని మోదీని, బీజేపీని తిడుతున్నరు'అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో బీజేపీ నాయకుడు ఎల్లేని సుధాకర్‌రావు 37 రోజుల పాటు చేపట్టిన ప్రగతి కోసం పాదయాత్ర ముగింపు సభకు బండి సంజయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ఆంధ్రోళ్లను అవమానించిండు, వాళ్లకు బిరియాని వండనీకే రాదన్నడు, తెలుగుతల్లిని అవమానించిండు. ఇప్పుడు బీఆర్ఎస్ పేరుతో మళ్ల ఆంధ్రకు పోతున్నడు. తెలంగాణలో మా వాళ్ల మనోభావాలను ఎవరైన దెబ్బతీస్తే వాళ్లను ఉరికించి రాళ్లతో కొడతం. ఆంధ్రోళ్లు కూడా కేసీఆర్‌కు బడిత పూజ చెయ్యాలె'అని అన్నారు. పేదోళ్ల ఉసురు పోసుకొని, జీఓ 317 ద్వారా ప్రభుత్వ ఉద్యోగులను ఆస్పత్రుల పాలుచేసి, 30 మంది ఉద్యోగుల చావులకు కారణమైన మాజీ సీఎస్ సోమేశ్‌కుమార్‌కు రాష్ట్ర హైకోర్టు చెంప చెల్లుమనేలా తీర్పునిచ్చి ఆయనను ఏపీకి పంపించిందన్నారు. సోమేశ్‌కుమార్ అనాలోచిత నిర్ణయాలు, అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించి క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో అనుభవం, నిజాయితీ, సత్తా ఉన్న ఐఏఎస్ అధికారులను పక్కనబెట్టి ఇన్నాళ్లు రబ్బర్ స్టాంపులా ఉండే వారికి సీఎస్ పదవులు కట్టబెట్టారని ఆరోపించారు. కేంద్రం ఇప్పటివరకు 1.46 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించిందని, ఈ ఏడాదిలో 8 లక్షల మందికి ఉద్యోగాలు ఇవ్వబోతోందని పేర్కొన్నారు. కేసీఆర్ మాత్రం 22 నోటిఫికేషన్లు ఇచ్చి ఉద్యోగాలు భర్తీ చేయడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2.40 లక్షల ఇళ్ల నిర్మాణాలకు కేంద్రం నిధులు ఇస్తే, వాటిని కేసీఆర్ ప్రభుత్వం దారి మళ్లించిందని విమర్శించారు. మరోసారి కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే హిందువులు అయ్యప్ప, భవాని, శివ, హనుమాన్ దీక్షలు చేపట్టకుండా చేస్తారన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలంతా బీఆర్ఎస్‌ను ఓడించేందుకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు.

అధికారం, అధిక ఎంపీ సీట్లు లక్ష్యంగా..!

- రాష్ట్రంలో ముగిసిన బీజేపీ రాష్ట్ర సంస్థాగత ఇన్‌చార్జి సునీల్ బన్సల్ పర్యటన
- పార్టీ నేతలు, కమిటీలకు వివిధ కార్యక్రమాల బాధ్యతలు అప్పగింత
- త్వరలోనే మరోసారి రాష్ట్రంలో పర్యటన



సాక్షి, హైదరాబాద్: 'బీజేపీ టాస్క్ మాస్టర్' సునీల్ బన్సల్ రాష్ట్ర పర్యటన ముగిసింది. రెండు రోజుల పాటు రాష్ట్ర నేతలతో విస్తృతంగా సమావేశాలు నిర్వహించిన ఆయన.. గురువారం ఢిల్లీకి తిరుగుప్రయాణమయ్యారు. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడంతోపాటు రాష్ట్రం నుంచి 9, 10 లోక్‌సభ సీట్లు గెలుచుకోవాలనే లక్ష్యంతో ఆయన కార్యాచరణ చేపట్టారు. బుధ, గురువారాల్లో 17 లోక్‌సభ నియోజకవర్గాల కన్వీనర్, ప్రభారీ, విస్తారక్‌లతో సమావేశాలు నిర్వహించారు. పార్లమెంట్ ప్రవాస్ యోజన, 'ప్రజా గోస- బీజేపీ భరోసా'బైక్‌ర్యాలీలు నిర్వహించిన తీరును పరిశీలించారు. మల్కాజిగిరి, మెదక్, భువనగిరి లోక్‌సభ సీట్ల కమిటీలతో సమీక్షించారు. బూత్ కమిటీల నియామకాలు చేపట్టాలని ఆదేశించారు. ఫిబ్రవరిలో రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 10వేల స్ట్రీట్ కార్నర్ (వీధి చివర) మీటింగులు నిర్వహించేందుకు ప్రణాళికలు ఖరారు చేశారు. వచ్చే నెల 5 నుంచి 20వ తేదీ మధ్య 9వేల శక్తి కేంద్రాల్లో (దాదాపు అన్ని పోలింగ్ బూత్‌లలో) సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. సంస్థాగతంగా అప్పగించిన విధులు, బాధ్యతలు, కార్యక్రమాలపై రాష్ట్ర నేతలు, కమిటీల 'యాక్షన్ టేకెన్ రిపోర్ట్'ను పరిశీలించేందుకు త్వరలోనే సునీల్ బన్సల్ మళ్లీ రాష్ట్రానికి వస్తారని ముఖ్య నేతలు చెప్తున్నారు.

నాయీ బ్రాహ్మణులకే టీటీడీపీ తొలి టికెట్

మీడియా సమావేశంలో టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్



సాక్షి, హైదరాబాద్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో టీటీడీపీ అన్ని సామాజిక వర్గాలకు టికెట్లు కేటాయించి చట్టసభల్లో వారికి ప్రాతినిధ్యం కల్పించేలా కృషి చేస్తుందని ఆ పార్టీ తెలంగాణ శాఖ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. రాష్ట్రంలోని 119 స్థానాలలో తొలి టికెట్ నాయీ బ్రాహ్మణ వర్గానికే ఇవ్వనున్నట్లు తెలిపారు. గురువారం ఇక్కడి ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో నాయీబ్రాహ్మణ వర్గానికి ఏ పార్టీ కూడా ఇప్పటివరకు టికెట్ ఇవ్వలేదని చెప్పారు. ప్రతి గ్రామంలో ఉండే 12 పనిముట్ల సామాజిక వర్గాలకు వివిధ నియోజకవర్గాల్లో ఒక్కో అసెంబ్లీ స్థానాన్ని కేటాయించనున్నట్లు తెలిపారు. నిజామాబాద్‌లో ఫిబ్రవరి 12 లేదా 13 తేదీల్లో బహిరంగసభ నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. సమావేశంలో టీటీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అట్లూరి సుబ్బారావు, ఇతర నాయకులు జ్యోత్స్న, కుందారపు కృష్ణాచారి, గుల్లపల్లి ఆనంద్ పాల్గొన్నారు.

'రైతుబంధు'కు మరో రూ.482.32 కోట్లు విడుదల

సాక్షి, హైదరాబాద్: రైతుబంధు పథకం కింద రాష్ట్రంలో మరో 1,76,604 మంది రైతుల బ్యాంకుఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం రూ.482.32 కోట్లు జమ చేసింది. ఇందులో భాగంగా 9,64,658.38 ఎకరాలకు సంబంధించిన నిధులు విడుదలయ్యాయి. రైతుబంధు పథకం కింద ఇప్పటివరకు మొత్తం 60,85,057 మంది రైతుల ఖాతాలలో రూ.5,801.06 కోట్లు జమ చేసినట్లు వ్యవసాయ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ రైతుబంధు, రైతుబీమా, కళ్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, ఆసరా పింఛన్ పథకాలను విజయవంతంగా అమలు చేస్తుండగా, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పన్నుల పేరిట దోచుకుంటోందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ పథకాలకు ప్రజల అవసరాలే ప్రాతిపదికగా ఉంటాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధికి తోడ్పాటు అందివ్వకపోగా అడ్డుపడుతుండటం కేంద్ర ప్రభుత్వ వివక్షకు నిదర్శనమని పేర్కొన్నారు.కాంగ్రెస్, బీజేపీలకు రాద్ధాంతం తప్ప, సిద్ధాంతం, విలువలు లేవని విమర్శించారు. ఆ పార్టీలది తెలంగాణలో ఒడిసిన ముచ్చట అని, ప్రజల ఆశీస్సులతో మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని నిరంజన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

నమ్మకం లేకే పొత్తుకెళ్తున్నా..

- మనకు గౌరవం తగ్గకుండా కుదిరితేనే.. లేదంటే ఒంటరిగానే
- జనం వస్తున్నారు.. కానీ ఓట్లు వేయడంలేదు..
- శ్రీకాకుళం జిల్లా యువశక్తి సభలో పవన్‌కళ్యాణ్



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం/ఎచ్చెర్ల క్యాంపస్, రణస్థలం, లావేరు, జి.సిగడాం: బలమైన శత్రువుతో పోరాడేందుకు అవసరమైనప్పుడు మనకు ఇష్టంలేకుండా ఓట్లు చీలకూడదన్న ఉద్దేశంతో కొందరితో కలిసి వెళ్లాల్సి వస్తుందని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అన్నారు. మనకు గౌరవం తగ్గకుండా పొత్తు కుదిరితే కలిసి వెళ్తామని లేదంటే ఒంటరిగా పోటీచేస్తామని తెలిపారు. అయినా, రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో పోటీచేసి గెలిచే సత్తాలేదన్నారు. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం తాళ్లవలసలో జరిగిన యువశక్తి బహిరంగ సభలో పవన్ ప్రసంగించారు. 'దశాబ్ద కాలంగా ఒంటరిగానే పోరాడాను.. ఒంటరిగా గెలిపిస్తామని గ్యారంటీ ఇవ్వగలుగుతారా? మీపై నమ్మకంలేదు.. నమ్మకం వస్తే ఒంటరిగా పోటీచేస్తా. ఒంటరిగా వెళ్లి వీరమరణం పొందడం అవసరంలేదు.. మీ తల్లిదండ్రులతో మాట్లాడి చెప్పండ'ని'.. సభకు హాజరైన పార్టీ శ్రేణులనుద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. వచ్చేది జనసేన ప్రభుత్వం లేదంటే మిశ్రమ ప్రభుత్వమని చెప్పారు. ఇక తన సభలకు జనాలు ఎక్కువగా వస్తారని, ఓట్లు మాత్రం వేయడంలేదని.. అలాగే, భారీగా సభలకు రావడంకాదని, ఎన్నికల వరకు ఇదే తీరులో వెళ్లి ఓట్లు వేయాలని కోరారు. పవన్ ఇంకా ఏమన్నారంటే..

జగన్ మూడు ముక్కల సీఎం

నా మూడు పెళ్లిళ్ల గురించి వైఎస్సార్‌సీపీ నేతలు ప్రస్తావిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌ను నేను మూడు ముక్కల ముఖ్యమంత్రి అంటాను. రాష్ట్రాన్ని ముక్కలు చేయాలని చూస్తే సహించేదిలేదు. వైఎస్సార్‌సీపీ నేతలు నన్ను నిలకడలేని రాజకీయ నాయకుడు, పార్ట్‌టైమ్ పొలిటీషియన్ అని అంటున్నారు. అసలు పూర్తిస్థాయి రాజకీయ నాయకుడు ఎక్కడున్నారు? మంత్రులు అంబటి రాంబాబు, ధర్మాన ప్రసాదరావు వంటి వారికి నన్ను విమర్శించే స్థాయి లేదు. ప్రభుత్వ భూములు తనఖా పెడుతున్నా ప్రశ్నించలేని రెవెన్యూ మంత్రి ధర్మాన. మంత్రి రోజాకు నన్ను విమర్శించే స్థాయిలేదు. నువ్వా నన్ను విమర్శించేది ఛీఛీఛీ.. అంబటి రాంబాబు సంబరాల రాంబాబు. నాతో ఫొటో తీయించునే వాళ్లకు నన్ను విమర్శించే అర్హత ఉందా.. సన్నాసులు, చవటలు.. సజ్జల రామకృష్ణారెడ్డి సకల శాఖల మంత్రిగా వ్యవహరిస్తున్నారు. అలాగే, చంద్రబాబుతో భేటీ గురించి సజ్జల ఏదో మాట్లాడుతున్నారు. ఈ మూడు ముక్కల ముఖ్యమంత్రికి అంతా డంకాపలాసు సలహాదారులే. ఏపీలో ఎక్కువమంది బూతుల మంత్రులే. ఇక నా వారాహి యాత్రను త్వరలోనే ప్రారంభిస్తా. ఎవరు అడ్డుకుంటారో చూస్తా. నవరత్నాలు వంటి ప్రభుత్వ పథకాలకు ఓట్లు వెయ్యొద్దు. నన్ను ప్యాకేజీ స్టార్, దత్తపుత్రుడు అంటే చెప్పుతీసి కొడతాను.

ఏపీ అప్‌డేట్స్

ఇది చెప్పడానికే సభ పెట్టావా?

- పూటకో పార్టీతో మూడు ముక్కల రాజకీయం నీదే
- నోరు అదుపులో పెట్టుకో.. నా దగ్గరా రెండు చెప్పులు ఉన్నాయి
- పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యల్ని ఏకిపారేసిన మాజీమంత్రి పేర్ని నాని



సాక్షి, అమరావతి: చంద్రబాబు సంకలో చేరుతున్నానని, ఈ విషయం చెప్పడానికే రణస్థలంలో సభ పెట్టావా? అంటూ జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌ను ఏపీ మాజీమంత్రి పేర్ని నాని ఎద్దేవా చేశారు. మిమ్మల్ని నమ్మలేను.. ఎన్నికల్లో మీరు నాకు ఓటు వేయరు అంటూ సభకు వచ్చిన నీ అభిమానులనే నువ్వు అవమానించడం నీకు సిగ్గుగా అనిపించడంలేదా? అని ప్రశ్నించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం రాత్రి పేర్ని మీడియాతో మాట్లాడుతూ పవన్ వ్యవహారశైలిని ఏకిపారేశారు. ఎన్నికల్లో ఇప్పటికే ఒకసారి ఒంటరిగా పోటీ చేసి వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతిలో వీరమరణం పొందాను.. మళ్లీ ఒంటరిగా పోటీచేసి కుక్క చావు చావలేననే నిజాన్ని పవన్ అంగీకరించారంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఒంటరిగా పోటీచేస్తే కుక్కచావు తప్పదనే చంద్రబాబు సంకలో దూరుతున్నానని జనసేన కార్యకర్తలకు స్పష్టత ఇచ్చారంటూ దెప్పిపొడిచారు. పేర్ని నాని ఇంకా ఏమన్నారంటే..

మన ఇంటిముందు అత్తతో కొట్లాడితే మళ్లీ మాట్లాడమా.. అదే రీతిలో చంద్రబాబు, లోకేశ్‌లతో మళ్లీ కలిస్తే తప్పా అని నువ్వే అన్నావు.. అంటే.. చంద్రబాబుతో నీది అత్తా అల్లుడి సంబంధమని నువ్వే ఒప్పుకున్నావ్. దత్తతండ్రితో దత్తపుత్రుడికి ఉన్న సంబంధం అని నీ నోటితో నువ్వే అంగీకరించావు.. అదే మాట నిన్ను సీఎం వైఎస్ జగన్ అంటే ఎందుకంత ఉలికిపాటు? ఇక నుంచైనా నోటి జాడింపు మానుకుంటే మంచిది. లేదంటే నా దగ్గరా రెండు చెప్పులున్నాయి.. నేను కూడా తీయగలను.

మూడు ముక్కల నేతవు నువ్వే

- 2014లో బీజేపీ, టీడీపీతో అంటకాగింది ఒక ముక్క.. 2019లో చంద్రబాబు, లోకేశ్‌లను బూతులు తిట్టి సీపీఐ, సీపీఎం, బీఎస్పీలతో అంటకాగింది రెండో ముక్క.. మళ్లీ ఇప్పుడు చంద్రబాబు సంకలో దూరింది మూడో ముక్క.. నిజానికి మూడు ముక్కల నేతవు నువ్వే.
- బీజేపీతో మైత్రి బంధంలో ఉన్నానని చెబుతూనే చంద్రబాబుకు కన్నుకొడుతూ కాలుతొక్కుతున్నావు.. ఇది రాజకీయ వ్యభిచారం కాదా?
- నువ్వు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయాలంటే 175 సీట్లకు పోటీ చేయాలి కదా.. నువ్వే కుక్క చావు చస్తున్నానని నీ నొటితోనే చెప్తున్నావు...చంద్రబాబు సంకనెక్కితే కానీ ఏడవలేను అంటున్నావు.. మరి ముఖ్యమంత్రి ఎవరు? నిన్ను సీఎంగా చేయడానికి చంద్రబాబు ఒప్పుకోడు కదా.. పోనీ చంద్రబాబు వద్ద మంత్రిగా చేస్తావా? లేక ఎమ్మెల్సీ, రాజ్యసభ లాంటివి చేస్తావా.. అసలు నీ ఆలోచన ఏంటి?

మరిన్ని వివరాలు, వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పెట్టుబడులపై ఫోకస్

విశాఖ వేదికగా త్వరలో రెండు కీలక సదస్సులు


సాక్షి, అమరావతి: కొత్తతరం ఉత్పత్తుల తయారీకి రాష్ట్రం వేదికగా నిలవాలని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. విశాఖ వేదికగా మార్చిలో గ్లోబల్ ఇన్వెస్టర్ సదస్సు (జీఐఎస్), జీ 20 దేశాల సదస్సులు జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లు, పెట్టుబడులను ఆకర్షించడంపై అధికార యంత్రాంగంతో గురువారం క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. మార్చి 3, 4వతేదీల్లో గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్, మార్చి 28, 29 తేదీల్లో జీ 20 దేశాల సమావేశాలు విశాఖపట్నంలో జరగనున్నాయి. వాస్తవిక పెట్టుబడులే లక్ష్యంగా గ్లోబల్ ఇన్వెస్టర్ మీట్ (జీఐఎస్) సదస్సు సాగాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలను సమగ్రంగా వివరించేలా సదస్సులో కార్యక్రమాలను రూపొందించాలన్నారు. కొత్త తరహా ఇంధనాల తయారీతో పాటు ప్రపంచవ్యాప్తంగా నవతరం ఉత్పత్తుల తయారీకి ఏపీ వేదికగా నిలవాలని, దీనికి గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు ఊతం ఇచ్చేలా ప్రణాళిక సిద్ధం చేయాలని దిశా నిర్దేశం చేశారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు సందర్భంగా పెట్టుబడులను ఆకర్షించేందుకు వివిధ దేశాల్లో రోడ్ షోలను నిర్వహిస్తున్న నేపథ్యంలో స్థానిక పారిశ్రామిక వాడలు, నిర్వహణ తీరును పరిశీలించి అంతకంటే మెరుగ్గా అమలు చేసేలా అధ్యయనం చేయాలని అధికారులకు సీఎం సూచించారు. ఆయా దేశాల్లో ఎంఎస్ఎంఈల నిర్వహణ తీరును పరిశీలించి రాష్ట్రంలో అనుసరించే అవకాశాలను పరిశీలించాలన్నారు.

సాక్షి హైదరాబాద్

శుక్రవారం । 13 । జనవరి । 2023

నేటి నుంచి సంక్రాంతి సంబరాలు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో ఈ నెల 13 నుంచి 17 వరకు సంక్రాంతి సంబరాలు జరుపుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భోగి పండగను పురస్కరించుకుని 14న పిల్లలకు భోగి పండ్లు పోసి శాస్త్రోక్తంగా కార్యక్రమానికి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సందర్శకులు శిల్పారామంలో తమ పిల్లలకు భోగి పండ్లు పోయించుకోవాలని సూచించారు. ఉదయం 11 నుంచి శిల్పారామం అందరూ అందుబాటులో ఉంటారన్నారు.



అమీర్‌పేట: విశాఖపట్టణం వెళ్లేందుకు ..

ద.మ.రై ప్రత్యేక చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: సంక్రాంతి సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ తెలిపారు. అన్‌రిజర్వ్‌డ్ కోచ్‌లలో ప్రయాణించాలనుకునేవారు తమ స్మార్ట్ ఫోన్‌లలో 'యూటీఎస్ యాప్'ను వినియోగించి ఆన్‌లైన్‌లోనూ టికెట్లను పొందవచ్చని సూచించారు. జన సాధారన్ టికెట్ బుకింగ్ సేవక్స్, ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మెషీన్‌లు కూడా అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆవరణలో కిటకిటలాడుతున్న ప్రయాణికులు

జూబ్లీ బస్టాండ్‌లో కిక్కిరిసి..

ఎంజీబీఎస్: ఓ వైపు సూట్ కేసు.. మరో వైపు చంటోడు

పండక్కి.. బండెక్కి!

సంక్రాంతి ప్రయాణికులతో కిక్కిరిసిన రైళ్లు, బస్సులు



అమలాపురం వెళ్లేందుకు ..

- వారం రోజుల్లో సుమారు 20 లక్షల మంది పల్లెబాట
- సొంత వాహనాల్లోనూ తరలిన నగరవాసులు
- భారీగా వాహనాల రద్దీ.. టోల్‌గేట్‌ల వద్ద పడిగాపులు

సాక్షి, సిటీబ్యూరో: సంక్రాంతి పర్వదినం సందర్భంగా మహానగరం పల్లెబాట పట్టింది. ప్రయాణికుల రద్దీతో గురువారం బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లు కిక్కిరిశాయి. రిజర్వేషన్లు లభించని ప్రయాణికులు సాధారణ బోగీల్లో బయలుదేరారు. దీంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే అన్ని రైళ్లలో రద్దీ పోటెత్తింది. ఆర్టీసీ, ప్రైవేట్ బస్సుల్లోనూ నగరవాసులు పెద్ద ఎత్తున బయలుదేరారు. గత వారం రోజులుగా సుమారు 20 లక్షల మందికి పైగా నగరవాసులు సొంతూళ్లకు వెళ్లినట్లు అంచనా. మరో రెండు రోజుల పాటు ప్రయాణికుల రద్దీ కొనసాగే అవకాశం ఉంది. బస్సులు, రైళ్లతో పాటు సొంత వాహనాల్లోనూ నగరవాసులు పల్లెబాట పట్టారు. దీంతో నగర శివార్లలోని అన్ని కూడళ్లలో వాహనాల రద్దీ నెలకొంది. వివిధ మార్గాల్లో టోల్‌గేట్ల వద్ద గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చినట్లు వాహనదారులు విస్మయం వ్యక్తం చేశారు. క్యాబ్‌లు, మాక్సీక్యాబ్‌లు, ట్యాక్సీలు, వ్యక్తిగత కార్లు రహదారులపై బారులు తీరాయి.

అరకొరగా ప్రత్యేక రైళ్లు..

ప్రయాణికుల డిమాండ్ మేరకు రైళ్లు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి వైజాగ్ వరకు ప్రత్యేక రైళ్లు పెద్దగా అందుబాటులో లేవు. దీంతో ఉత్తరాంధ్ర వైపు వెళ్లే ప్రయాణికులు ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులపై ఆధారపడాల్సి వచ్చింది. ఆర్టీసీ బస్సుల్లో సాధారణ చార్జీలు వసూలు చేసినప్పటికీ ప్రైవేట్ బస్సుల్లో మాత్రం ప్రయాణికుల జేబులను లూటీ చేశారు. సికింద్రాబాద్ నుంచి విజయవాడ, కాకినాడ, తిరుపతి, నర్సాపూర్ తదితర ప్రాంతాలకు వెళ్లే రైళ్లు సైతం కిక్కిరిసిపోయాయి. నాంపల్లి, కాచిగూడ స్టేషన్లలోనూ సంక్రాంతి రద్దీ కనిపించింది. హైదరాబాద్ నుంచి సుమారు 50 ప్రత్యేక రైళ్లను ఈసారి అదనంగా ఏర్పాటు చేశారు. అయినా ప్రయాణికుల డిమాండ్‌ను భర్తీ చేయలేకపోయాయి.

అదనపు బస్సులకు డిమాండ్....

హైదరాబాద్ నుంచి తెలుగు రాష్ట్రాలకు ప్రతిరోజూ రాకపోకలు సాగించే సుమారు 3,500 బస్సులతో పాటు మరో 4350కిపైగా బస్సులను అదనంగా నడిపేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. రోజువారీ రెగ్యులర్ బస్సులతో పాటు ప్రత్యేక బస్సుల్లోనూ జనం భారీగా తరలి వెళ్లారు. ఇప్పటి వరకు రెగ్యులర్ బస్సులతో పాటు మరో 2500కు పైగా ప్రత్యేక బస్సులను నడిపినట్లు అధికారులు తెలిపారు. గురువారం రాత్రి మరికొన్ని బయలుదేరాయి. టీఎస్‌ఆర్టీసీతో పాటు ఏపీఎస్ ఆర్టీసీ కూడా ప్రత్యేక బస్సులను నడిపింది. ఇవి కాకుండా 1000కి పైగా ప్రైవేట్ బస్సులు పండగ సందర్భంగా రాకపోకలు సాగించాయి.



ఎంజీబీఎస్‌లో..

సొంత బండే సో బెటర్..

ఇంటిల్లిపాదీ సొంత వాహనాల్లోనే ఎక్కువగా ఊరి బాట పట్టారు. తెలంగాణ జిల్లాలకు ఎక్కువ శాతం బైక్‌లపై వెళ్లగా ఏపీకి వెళ్లేవారు కార్లలో ఊళ్లకు బయలుదేరారు. దీంతో విజయవాడ, వరంగల్, సాగర్‌రోడ్డు, పటాన్‌చెరు, శామీర్‌పేట్ ప్రధాన రహదారులపై టోల్‌గేట్‌ల వద్ద వ్యక్తిగత వాహనాల రద్దీ ఎక్కువగా కనిపించింది.

న్యూస్‌రీల్

తగ్గని చలి తీవ్రత

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో చలి తీవ్రత తగ్గుముఖం పట్టడం లేదు. గురువారం పలు ప్రాంతాల్లో 11 నుంచి 13 డిగ్రీల మేర కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలిగాలుల తీవ్రతతో సిటీజన్లు గజగజలాడారు. అత్యల్పంగా శివరాంపల్లిలో 11.1 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మచ్చబొల్లారంలో 12.3, వెస్ట్ మారేడ్‌పల్లిలో 12.6, హయత్‌నగర్‌లో 13 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాగల 24 గంటల్లో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతల్లో స్వల్ప హెచ్చుతగ్గులుంటాయని బేగంపేట్‌లోని వాతావరణ శాఖ తెలిపింది.

కొనసాగుతున్న ఆర్టీఏ దాడులు

సాక్షి, సిటీబ్యూరో: ప్రైవేట్ వాహనాల అక్రమ రవాణాపై గత మూడు రోజులుగా ఆర్టీఏ దాడులు కొనసాగుతున్నాయి. సంక్రాంతి రద్దీని దృష్టిలో ఉంచుకొని నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికులను తరలించే వాహనాలపై రవాణా అధికారులు కొరడా ఝుళిపించారు. గురువారం వివిధ ప్రాంతాల్లో జరిపిన తనిఖీల్లో 45 ప్రైవేట్ బస్సులపైన కేసులు నమోదు చేసి సీజ్ చేసినట్లు ఆర్టీఏ అధికారులు తెలిపారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు ఆర్టీసీ అధికారులు, సిబ్బందితో కలిసి రవాణా అధికారులు ఈ దాడులు చేపట్టారు. జేబీఎస్, ఎల్‌బీనగర్, ఆరాంఘర్, తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించని వాహనాలపై కేసులు నమోదు చేశారు.

సైబర్ భద్రతకు సమష్టి కృషి

రాయదుర్గం: సైబర్ భద్రతను మరింత పటిష్టం చేసేందుకు గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ డేటా సైన్స్, సైబరాబాద్ పోలీసులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఐఎస్‌బీ ప్రతినిధులు, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల సమక్షంలో సైబరాబాద్ డీసీపీ (క్రైమ్స్) కల్మేశ్వర్ శింగేనవర్, ఐఎస్‌బీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డేటా సైన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ మనీష్ గంగ్వార్‌లు ఒప్పందంపై సంతకాలు చేశారు.

నుమాయిష్‌లో ఉర్దూ అకాడమీ స్టాల్ ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: ఉర్దూ భాష అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ మహ్మద్ ఖాజా ముజీబుద్దీన్ పేర్కొన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో కొనసాగుతున్న నుమాయిష్‌లో గురువారం ఉర్దూ అకాడమీ స్టాల్‌ను రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ మసీవుల్లా ఖాన్, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్‌లతో కలిసి ఆయన పారంభించారు. ఈ సందర్భంగా ముజీబుద్దీన్ మాట్లాడుతూ.. ఇక్కడి స్టాల్‌లో ఉర్దూ అకాడమీ ప్రవేశపెట్టిన 20 పథకాలపై ప్రచారంతో పాటు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.



పచ్చగా.. రెక్కలొచ్చెనా..



రూ.137 కోట్లతో 57 థీమ్ పార్కులు

- వీటిలో 6 పూర్తి.. మిగతావి పురోగతిలో
- సెంట్రల్ మీడియన్లలోనూ మొక్కల పెంపకం
- హరిత వాతావరణమే లక్ష్యంగా జీహెచ్ఎంసీ

సాక్షి, సిటీబ్యూరో: ముఖ్యమంత్రి కేసీఆర్ మానస పుత్రిక అయిన హరితహారంతో పాటు జీహెచ్ఎంసీలో చేపట్టిన వివిధ కార్యక్రమాలతో పచ్చదనం పరిఢవిల్లుతోంది. వీటిని కొనసాగిస్తూనే మరిన్నింటితో ప్రజలకు మంచి వాతావరణంతో పాటు కాలుష్యాన్ని తగ్గించాలని జీహెచ్ఎంసీ భావిస్తోంది. ఇందులో భాగంగా థీమ్, ట్రీ పార్కులతో పాటు ప్రధాన రహదారుల మార్గాల్లోని సెంట్రల్ మీడియన్లలోనూ పచ్చదనం కార్యక్రమాలను తలపెట్టింది. రూ.137 కోట్లు వెచ్చించి 57 థీమ్ పార్కుల ఏర్పాటు లక్ష్యంగా చేపట్టిన పనుల్లో 6 పార్కుల పనులు పూర్తయ్యాయి.

చేపట్టిన థీమ్‌పార్కులు.. పురోగతిలో ఉన్నవి ఇలా..

జోన్	థీమ్ పార్కులు	అంచనా (రూ.కోట్లు)
ఎల్‌బీనగర్	13	29.25
చార్మినార్	3	8.00
ఖైరతాబాద్	14	41.00
శేరిలింగంపల్లి	10	24.48
కూకట్‌పల్లి	6	20.25
సికింద్రాబాద్	11	14.21

- వీటిల్లో శేరిలింగంపల్లి జోన్‌లో రెండు పార్కులు పూర్తయ్యాయి
- కూకట్‌పల్లి, సికింద్రాబాద్, ఎల్‌బీనగర్, ఖైరతాబాద్ జోన్లలో ఒక్కో థీమ్‌పార్కు వంతున పూర్తయ్యాయి.
- చార్మినార్ జోనల్ మూడు పార్కులు పురోగతిలో ఉన్నాయి.

ట్రీపార్కులు..

కాంక్రీట్ జంగిల్‌గా మారిన నగరంలో ప్రజలకు ప్రకృతిని ఆస్వాదించే అవకాశం కల్పించాలనే లక్ష్యంతో ట్రీపార్కుల ఏర్పాటు చేపట్టారు. ఇప్పటి వరకు 406 ట్రీ పార్కుల్ని ఏర్పాటు చేశారు. వీటిలో ఎల్‌బీనగర్ జోన్‌లో 104, చార్మినార్ జోన్‌లో 23, ఖైరతాబాద్ జోన్‌లో 86, శేరిలింగంపల్లి జోన్‌లో 97, కూకట్‌పల్లి జోన్‌లో 56,సికింద్రాబాద్ జోన్‌లో 40 ఉన్నాయి.

సెంట్రల్ మీడియన్లలో పచ్చదనం ఇలా..

జోన్	లొకేషన్లు	కి.మీ
ఎల్‌బీనగర్	18	27.64
చార్మినార్	13	19.63
ఖైరతాబాద్	31	26.3
శేరిలింగంపల్లి	66	62.17
కూకట్‌పల్లి	38	29.35
సికింద్రాబాద్	20	11.24

సెంట్రల్ మీడియన్లలో సైతం..

వివిధ రకాల పార్కులతో పాటు రోడ్ల మధ్యన సెంట్రల్ మీడియన్లలో ఇతరత్రా ఖాళీ ప్రదేశాల్లోనూ మొక్కలు పెంచి పచ్చదనం పెంపు చర్యలు చేపట్టారు. వీటిలో పూలమొక్కలు సైతం పెంచుతున్నారు. మొక్కలతో వాహన కాలుష్యం తగ్గడంతో పాటు ఎదురుగా వచ్చే వాహనాల లైట్లు గ్లేర్ కొట్టకుండా ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు 186 సెంట్రల్ మీడియన్ల లొకేషన్లలో 176 కిలోమీటర్ల మేర పచ్చదనం పెంచి అందంగా కనిపించేలా చేసినట్లు జీహెచ్ఎంసీ పేర్కొంది.

గత సంవత్సరం ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా దశాబ్ద కాలానికి (2011–21) సంబంధించి వెల్లడించిన నివేదికలో దేశంలోని మిగతా నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లోనే పచ్చదనం విస్తీర్ణం అత్యధికంగా 48.66 చదరపు కిలోమీటర్లు పెరిగింది. నగరంలో పచ్చదనం 5.23 శాతం నుంచి దాదాపు 13 శాతానికి పెరిగింది. ట్రీసిటీగా కూడా గుర్తింపు పొందడం తెలిసిందే. ఆ నివేదిక స్ఫూర్తితో పచ్చదనం పెంపునకు బల్దియా పాటుపడుతోంది.



పటాన్‌చెరు ప్రాంతంలోని ఓ పార్కు



సెంట్రల్ మీడియన్‌లో పచ్చదనం..

కేరళ ఎక్స్‌ప్రెస్‌లో జంప్

పథకం ప్రకారం వ్యవహరించిన పింకు గ్యాంగ్

- వెలుగులోకి వచ్చిన స్నాచర్ల పరార్
- కాజీపేట నుంచి ఆటోలో వరంగల్ రైల్వేస్టేషన్‌కు
- ఢిల్లీ వరకు టికెట్లు తీసుకున్న నలుగురు నిందితులు
- అక్కడి నుంచి కేరళ ఎక్స్‌ప్రెస్ ఎక్కిన ముఠా
- దాని హాల్ట్ ఉన్న అన్ని స్టేషన్లలోనూ పోలీసుల ఆరా



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్లలోని ఐదు ఠాణాల పరిధిలో ఏడు చైన్ స్నాచింగ్స్ చేసిన బవారియా గ్యాంగ్ కేరళ ఎక్స్‌ప్రెస్‌లో రాష్ట్రం దాటేసినట్లు వెలుగులోకి వచ్చింది. కాజీపేట వరకు క్యాబ్‌లో వెళ్లిన నలుగురు నిందితులు అక్కడ నుంచి వరంగల్ వెళ్లి ఈ రైలు ఎక్కినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ముఠా కోసం ముమ్మరంగా గాలిస్తున్న టాస్క్‌ఫోర్స్, ఎస్వోటీ పోలీసులు సూత్రధారి పింకు కాదనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వీళ్ల వెనుక మరో వ్యక్తి ఉండి కథ నడిపినట్లు భావిస్తున్నారు.

కాజీపేట నుంచి ఆటోలో...

- ఉత్తరప్రదేశ్‌లోని షామ్లీ జిల్లాకు చెందిన ఈ బవారియా గ్యాంగ్‌లో పంకజ్ అలియాస్ పింకు, మంగళ్, దీపక్, సేవజ్ సభ్యులుగా ఉన్నారు. బెంగళూరు, హైదరాబాద్‌ల్లో గత శుక్ర, శనివారాల్లో పంజా విసిరిన ఈ ముఠా తొలుత కాచిగూడ రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. అక్కడ నుంచి నాంపల్లి రైల్వేస్టేషన్, ఎంజీబీఎస్‌ల్లో తిరిగి క్యాబ్‌లో కాజీపేట వరకు వెళ్లారు. కొద్దిసేపు కాజీపేట చౌరస్తాలో తచ్చాడారు. ఆపై ఓ ఆటోలో గత శనివారం మధ్యాహ్నం ఒంటి గంటల ప్రాంతంలో వరంగల్ రైల్వేస్టేషన్ వద్దకు చేరుకున్నారు.
- ఆటో దిగిన వెంటనే స్టేషన్ లోపలకు వెళ్లి ఢిల్లీకి టిక్కెట్లు ఖరీదు చేశారు. కేరళ ఎక్స్‌ప్రెస్ రావడానికి మరో అర్ధగంట సమయం ఉండటంతో మళ్లీ బయటకు వచ్చేశారు. రైలు వచ్చినట్లు అనౌన్స్‌మెంట్ విన్న తర్వాత బయట నుంచి ప్లాట్‌ఫామ్ మీదకు వెళ్లారు. అప్పటికే రైలు బయలుదేరి పోవడంతో పరిగెత్తుకుంటూ వెళ్లి ఎక్కేశారు. ఈ తతంగం మొత్తం వివిధ ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. ఈ ఫీడ్‌ను పోలీసులు సేకరించి మరింత లోతుగా విశ్లేషిస్తున్నారు.

తప్పించుకోవడానికి సమయం కోసమే...

స్నాచర్లు ఢిల్లీ వరకు టికెట్లు తీసుకున్నప్పటికీ.. అక్కడకు చేరుకున్నారా? లేదా? అనే సందేహం పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇక్కడి నుంచి బయలుదేరిన ఓ ప్రత్యేక బృందం కేరళ ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్‌లు ఉన్న ప్రతి ప్రాంతంలోనూ ఆరా తీస్తున్నారు. ఆయా రైల్వేస్టేషన్, పరిసరాల్లో ఉన్న సీసీ కెమెరాల్లోని ఫీడ్‌ను అధ్యయనం చేస్తున్నారు. బవారియా గ్యాంగ్ రామ్‌గోపాల్ పేట నుంచి వరంగల్ రైల్వే స్టేషన్‌కు చేరడానికి ఇన్ని ప్రాంతాలు చుట్టడానికి కారణం దర్యాప్తు జటిలం చేయడానికే అని పోలీసులు భావిస్తున్నారు. స్నాచర్లు ఎక్కడ నుంచి ఎక్కడకు వెళ్లారో తెలుసుకునే లోపే తాము గమ్యస్థానం చేరుకోవడానికే ఈ పంథా అనుసరించారని చెబుతున్నారు. రామ్‌గోపాల్‌పేట– వరంగల్ మధ్య సీసీ కెమెరాలను అధ్యయనం చేయడానికి పట్టే సమయంలో నలుగురు స్నాచర్లూ రాష్ట్రం దాటేశారు.

తెర వెనుక ఎవరు?


ఈ గ్యాంగ్‌కు పింకు నేతృత్వం వహించాడని ప్రాథమికంగా భావిస్తున్నా.. తెర వెనుక మరొకరు ఉన్నట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. షామ్లీ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఈ నలుగురినీ అతడే దక్షిణాదికి పంపినట్లు భావిస్తున్నారు. స్నాచర్లు ఖాన్పూర్‌కాలా, జింఝూనా ప్రాంతాలకు చెందిన వాళ్లు. వీరిలో ముగ్గురికి జైల్లో పరిచయమైందని, మరొకరిని ఆ సూత్రధారే వీరితో పంపి ఉంటాడని ఆధారాలు సేకరించారు. బెంగళూరు, హైదరాబాద్‌ల్లో గంటల వ్యవధిలోనే వరుస స్నాచింగ్స్ చేయడంతో వీరికి ఆయా ప్రాంతాలపై పట్టుందని పోలీసులు అనుమానిస్తున్నారు. దీనికోసం ఇంతకు ముందే వచ్చి రెక్కీ చేశారా? లేక గూగుల్ మ్యాప్స్ వాడారా? అన్నది తేలాల్సి ఉంది. నిందితులు చిక్కితేనే సూత్రధారి ఎవరు? వీరికి ఇలా స్నాచింగ్స్ చేయడం ఎలా సాధ్యమైంది? తదితర ప్రశ్నలకు జవాబులు దొరుకుతాయని ఓ ఉన్నతాధికారి వ్యాఖ్యానించారు.



వరంగల్ రైల్వేస్టేషన్‌లో స్నాచర్లు.. సీసీ కెమెరాకు చిక్కిన చిత్రం (ఫైల్)

మూసీ బ్రిడ్జీల పనులు త్వరలో

- డిజైన్లు పూర్తి కాకపోయినా.. ఫౌండేషన్లు, పిల్లర్లు అయ్యేలా..
- వర్షాకాలంలోగా ఎక్కువ పనులు చేసేలా కార్యాచరణ



నమూనా చిత్రం

సాక్షి, సిటీబ్యూరో: మూసీపై బ్రిడ్జీలు నిర్మించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించి రెండేళ్లవుతున్నా ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. 2020లో కురిసిన భారీ వర్షాలతో తక్కువ ఎత్తులో కాజ్‌వేలున్న ప్రాంతాల్లో వంతెనలు నిర్మించాలనుకున్నారు. మూసీ పరిసర ప్రాంతాల ముంపు సమస్యలు పునరావృతం కాకుండా ఉండేందుకు తొలుత ఐదు ప్రాంతాల్లో (చాదర్‌ఘాట్, మూసారంబాగ్, ఇబ్రహీంబాగ్, మంచిరేవుల–నార్సింగి, ప్రతాపసింగారం–గౌరెల్లి) నిర్మించాలనుకున్నారు. అనంతరం ముంపుతో పాటు రోజురోజుకూ పెరుగుతున్న నగర జనాభా, ట్రాఫిక్ ఇబ్బందుల్ని దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ సమస్యల పరిష్కారంగా కూడా ఉపయోగపడేలా 15 ప్రాంతాల్లో వీటిని నిర్మించాలనుకున్నారు. అవి సాదాసీదాగా కాకుండా నిర్మాణపరంగానూ, చూడటానికి ప్రత్యేకంగా ఉండి పర్యాటక ప్రాంతాలుగానూ అభివృద్ధి చెందేలా ప్రత్యేక డిజైన్లతో ఉండాలనుకున్నారు. అనుభవజ్ఞులతో పాటు ఔత్సాహిక ఆర్కిటెక్టులను సైతం డిజైన్ల పోటీకి ఆహ్వానించారు. ఎన్నో మంచి డిజైన్లు వచ్చినా వేటినీ ఖరారు చేయలేదు. మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు అధికారులు పారిస్‌లోని బ్రిడ్జీలను అధ్యయనం చేసి వచ్చారు. వాటిని దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్‌కు తగిన విధంగా ప్రత్యేక డిజైన్లతో నిర్మించాలని ఆయన ఆదేశించడంతో ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. డిజైన్ల రూపకల్పన జరిగి ఖరారయ్యాకే పనులు చేపడితే ఆలస్యమవుతుందని, వర్షాకాలంలో పనులు చేయలేని పరిస్థితులు ఉంటాయనే ఉద్దేశంతో త్వరలోనే పనులు ప్రారంభించాలనుకుంటున్నారు. ఫౌండేషన్లు, పిల్లర్ల వంటి పనులు పూర్తి చేస్తే డిజైన్లు ఖరారయ్యాక మిగతా పనులు చేయవచ్చని ఆలోచించారు. ఎలాంటి డిజైన్లతోనైనా చేసేందుకు వీలుగా ప్రాథమిక దశలోని పనులు పూర్తి చేయాలని భావిస్తున్నారు. వేసవిలోగా సాధ్యమైనన్ని ఎక్కువ పనులు పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఈ మేరకు త్వరలో కార్యాచరణ రూపొందించి పనులు ప్రారంభించనున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. మూసీ–ఈసీలపై 15 బ్రిడ్జీల నిర్మాణానికి అవసరమైన రూ.545 కోట్లకు ప్రభుత్వం గత సంవత్సరమే పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. మొత్తం బ్రిడ్జిల్లో జీహెచ్ఎంసీ 4, హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్ఆర్‌డీసీఎల్) 3, కుడా 1, హెచ్ఎండీఏ 7 నిర్మించాల్సిందిగా ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది.

బ్రిడ్జిలు నిర్మించనున్న ప్రాంతాలివీ: ఇబ్రహీంబాగ్, మూసారాంబాగ్, చాదర్‌ఘాట్, అత్తాపూర్, కారిడార్ నెంబర్ 99, సన్‌సిటీ– చింతల్‌మెట్, కిస్మత్‌పూర్, అఫ్జల్‌గంజ్, ఉప్పల్ లేఔట్, మంచిరేవుల – నార్సింగి, బుద్వేల్, హైదర్‌షాకోట్– రామ్‌దేవ్‌గూడ, బుద్వేల్ వద్ద రెండో బ్రిడ్జి, ప్రతాపసింగారం– గౌరెల్లి, మంచిరేవుల.

జాతీయ పార్కుల్లో ఎస్టీపీలు తప్పనిసరి..!

- టీఎస్ఐఐసీ, బల్దియాకు స్పష్టం చేసిన పీసీబీ
- హరిణి వనస్థలిలో కలుషిత ఘటన నేపథ్యంలో నిర్ణయం..
- పారిశ్రామిక వ్యర్థజలాలపై సీరియస్..

సాక్షి,సిటీబ్యూరో: జీవ వైవిధ్యానికి,పర్యావరణ పరిరక్షణ,స్థానికులకు ఆహ్లాదాన్ని అందించే జాతీయ పార్కులు కలుషిత కాటుకు గురవుతున్న వైనంపై పీసీబీ సీరియస్‌గా దృష్టి సారించింది. నగరంలోని కేబీఆర్‌పార్కు, జూపార్కు సహా మహవీర్ హరిణ వనస్థలి తదితర జాతీయ ఉద్యానవనాల్లో మురుగు నీరు చేరకుండా నిరోధించడంతోపాటు..ప్రతి చుక్క నీటిని శుద్ధి చేసేందుకు ఎస్టీపీలు నిర్మించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు జీహెచ్ఎంసీ, టీఎస్ఐఐసీలు నెలరోజుల్లోగా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూచించింది.

హరిణ వనస్థలిలో కలుషిత కాటు ఇలా...

నగర శివార్లలో విజయవాడ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న మహవీర్ హరిణ వనస్థలి జాతీయ పార్క్‌లోని సహజ సిద్ధమైన నీటికుంటలోకి ఆటోనగర్ పారిశ్రామిక వాడలోని ఆటోగ్యారేజీలు, భారీ వాహనాల సర్వీసింగ్ సెంటర్లు, ఫెర్టిలైజర్ గోడౌన్ల నుంచి వచ్చి చేరుతున్న వ్యర్థజలాలతో కాలుష్య కాసారంగా మారింది. దీంతో ఈ పార్క్‌లోని వన్య ప్రాణులకు ముంపు పొంచి ఉండడంతో పీసీబీ అప్రమత్తమైంది. నీటినమూనాలు సేకరించి పరీక్షించగా..కలుషిత ఆనవాళ్లు బయటపడ్డాయి. దీంతో విధిగా ఎస్టీపీ నిర్మించాలని..శుద్ధి చేసిన నీటిని కేవలం గార్డెనింగ్ అవసరాలకే వినియోగించాలని సంబంధిత విభాగాలకు స్పష్టం చేసింది. మిగతా వ్యర్థజలాలను పైప్‌లైన్లను ఏర్పాటు చేసి మూసీలోకి మళ్లించాలని సూచించింది.

చుట్టూ సీసీటీవీల నిఘా తప్పనిసరి..

నగరంలో జాతీయ పార్క్‌లకు ఆనుకొని ఉన్న గృహ, వాణిజ్య, పారిశ్రామిక సముదాయాల నుంచి వ్యర్థజలాలు ఉద్యానవనాల్లోకి చేరకుండా చూసేందుకు ఆయా వాడల్లో సీసీ టీవీలతో పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని పీసీబీ టీఎస్ఐఐసీ, బల్దియాను ఆదేశించింది. వ్యర్థ జలాలను బహిరంగ ప్రదేశాలు, నాలాలు, చెరువులు, జాతీయ పార్కుల్లోకి వదిలిపెడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.

ఎస్టీపీల ఏర్పాటుతో ఉపయోగాలివే..

- జాతీయ పార్క్‌ల్లోకి చేరే మురుగు, వ్యర్థజలాలను శుద్ధి చేసిన తరవాతనే లోనికి ప్రవేశించే ఏర్పాటుచేయవచ్చు.
- శుద్ధిచేసిన నీటిని మొక్కల పెంపకం, గార్డెనింగ్ అవసరాలకు వినియోగించవచ్చు.
- ఆయా పార్క్‌లలోని చెరువులు, కుంటలు కాలుష్యకాసారం కాకుండా చూడవచ్చు.
- ఆయా ఉద్యానవనాల్లోకి కేవలం వర్షపునీరు మాత్రమే చేరే ఏర్పాట్లు చేయాలి.
- ప్లాస్టిక్, ఇతర ఘన వ్యర్థాలు పార్కుల్లోకి చేరకుండా నిరోధించాలి.
- జీవ వైవిధ్యాన్ని పరిరక్షణపై అన్ని వర్గాల్లో అవగాహన కల్పించాలి.

పొగ మంచులో ప్రయాణాలొద్దు!

- పూర్తిగా తెల్లవారిన తర్వాతే జర్నీ మేలు
- ఔటర్, హైవేలపై వాహనాలను నిలపకూడదు
- అజాగ్రత్తగా డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలు తప్పవు
- పలు సూచనలు చేసిన సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు



ఔటర్, హైవేలపై జాగ్రత్త..

సాక్షి, సిటీబ్యూరో: సంక్రాంతి పండుగ, వారాంతం కలిసి రావటంతో నగరవాసులు సొంతూర్లకు పయనమయ్యారు. మరోవైపు రాష్ట్రంలో పొగమంచుతో కూడిన వాతావరణం నెలకొంది. రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు తెల్లవారుజామున ప్రయాణాలకు దూరంగా ఉండాలని కోరారు. పూర్తిగా తెల్లవారిన తర్వాత సూర్యకాంతిలో ప్రయాణించడం శ్రేయస్కరమని సూచించారు. వ్యక్తిగత వాహనాల్లో కుటుంబంతో కలిసి వెళ్లేందుకు సిద్ధమవుతున్న నగరవాసులకు ట్రాఫిక్ పోలీసులు పలు సూచనలు చేశారు. దట్టమైన పొగమంచు కారణంగా ఔటర్ రింగ్ రోడ్డు, రాష్ట్ర, జాతీయ రహదారులపై ప్రయాణించే సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయా రహదారులలో వాహనాలను నిలపకూడదు. హైవేలపై ప్రయాణిస్తున్నప్పుడు ఏమాత్రం నలత అనిపించినా, నిద్ర వచ్చినా రోడ్డు మీద వాహనాన్ని క్యారేజ్‌పై నిలివేయకుండా రోడ్డు దిగి ఒక పక్కన లేదా కేటాయించిన పార్కింగ్ స్థలంలో మాత్రమే నిలిపివేయాలని సూచించారు. పొగ మంచు కారణంగా రోడ్డు స్పష్టంగా కనిపించదు. ఆగి ఉన్న వాహనాలను ఢీకొని ప్రమాదాలు జరిగిన సందర్భాలు అనేకం ఉన్నాయని గుర్తు చేశారు. బ్రేకులు వేసేటప్పుడు వెనకాల వస్తున్న వాహనాలను అద్దాల నుంచి చూసి మాత్రమే వేయాలి తప్ప అకస్మాత్తుగా బ్రేకులు వేయకూడదని, ఇతర వాహన డ్రైవర్లు మీ వాహనాన్ని గుర్తించేందుకు వీలుగా బీమ్ హెడ్‌లైట్లను వినియోగించాలని సూచించారు.

డ్రైవింగ్ చేసేటప్పుడు ఇవి పాటించండి

- ఇతర వాహనాలకు తగినంత దూరం పాటించాలి.
- హజార్డ్ లైట్లను ఆన్ చేసి ఉంచాలి.
- సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, కారులో అధిక శబ్దం మ్యూజిక్‌తో ప్రయాణించకూడదు. వెనకాల వచ్చే వాహనాల హారన్ వినిపించదు.
- పొగమంచులో ఎదుటి వాహనాలు, పశువులు స్పష్టంగా కనిపించవు. అందుకే తరుచూ హారన్ కొడుతూ ప్రయాణించడం ఉత్తమం.
- లేన్ మారుతున్నప్పుడు లేదా మలుపుల సమయంలో కిటికీలను కిందికి దింపాలి. దీంతో వెనకాల వచ్చే ట్రాఫిక్ స్పష్టంగా వినిపిస్తుంది.
- ఐదారు గంటల పాటు కంటిన్యూగా డ్రైవింగ్ చేయకుండా మధ్యలో కాస్త విశ్రాంతి తీసుకోవాలి.

ఆటోమీటర్ రేట్ పెంచాలి

చిక్కడపల్లి: గ్రేటర్ హైదరాబాద్‌లో ఆటో ఆటో మీటర్ రేట్ పెంచాలని కోరుతూ గురువారం తెలంగాణ రాష్ట్ర ఆటో, టాక్సీ డ్రైవర్స్ యూనియన్ ప్రతినిధులు రవాణా కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ బీఎంఎస్ జాతీయ కార్యవర్గసభ్యులు అల్లూరి రవిశంకర్, యూనియన్ అధ్యక్షులు జి.మైసయ్యయాదవ్ మాట్లాడుతూ గ్రేటర్ పరిధిలో గత 30 ఏళ్లుగా పాత ఆటోలు స్క్రాప్ చేసి కొత్త ఆటోలకు పర్మిట్ ఇచ్చే విషయంలో అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఆటో స్క్రాప్‌ను రద్దు చేస్తూ జేటీసీ ఇచ్చిన నోటీసును యూనియన్ స్వాగతిస్తోందన్నారు. స్క్రాప్ ఆర్డర్ తీసుకుని స్క్రాప్ తీసుకున్న తర్వాత ప్రొసీడింగ్ సర్టిఫికేట్ తీసుకుని కొత్త ఆటో కొనుగోలు చేస్తున్నారని, అయితే ఈ విషయంలో రవాణాశాఖ పారదర్శకంగా వ్యవహరించకపోవడంతో అవకతవకలు జరుగుతున్నాయన్నారు. వాహనాలు స్క్రాప్ చేసే విషయంలో కేంద్రప్రభుత్వం ఇచ్చిన వెహికిల్ స్క్రాపేజ్ పాలసీని అమలు చేయాలని ట్రాన్స్‌ఫోర్ట్, నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు స్క్రాప్ కేంద్రాలు నిబంధనలు ఒకేలా ఉండాలన్నారు. స్క్రాప్ సెంటర్స్ టెండర్ 5 సంవత్సరాలకు ఒకసారి రవాణాశాఖ ద్వారా నిర్వహించాలని, స్క్రాప్ ప్రొసిడింగ్స్ విషయంలో పాత వాహనం పూర్తిగా స్క్రాప్ అయ్యిందా లేదా అనేది జేటీసీ అధికారికంగా ధృవీకరించాలన్నారు. గత 15 ఏళ్లుగా స్క్రాప్ అయిన వాహనాల ప్రొసీడింగ్‌లో జరిగిన అక్రమాలలపై తక్షణమే విచారణ చేపట్టాలన్నారు. కేంద్ర రవాణాశాఖ మార్గదర్శకాలు అమలయ్యేవరకు హైదరాబాద్‌లో స్క్రాప్‌ను పునరుద్ధరణ చేయరాదన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో కనీస ఆటో మీటర్ చార్జీ రూ.30 చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి.పెంటయ్య గౌడ్, ఇ.శంకర్, టి.యాదయ్య, లిఖిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

17న ఎల్వీ ప్రసాద్-ఆకృతి పురస్కారం



బంజారాహిల్స్: ప్రముఖ నిర్మాత ఎల్వీ ప్రసాద్ దివంగత ముఖ్యమంత్రి, నటుడు ఎన్టీరామారావు మార్గదర్శి అని, ఆయనలోని ప్రతిభను ముందుగా గుర్తించింది ప్రసాద్ అని, అందుకే మన దేశం చిత్రంలో వేషం ఇచ్చారని సినీ హీరో నందమూరి బాలకృష్ణ అన్నారు. ఆ తర్వాత ఆయన ప్రస్థానం మనకు తెలిసిందే అన్నారు. జూబ్లీహిల్స్ రోడ్ నెం. 45లోని తన నివాసంలో ప్రముఖ సంస్థ ఆకృతి ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన ఎల్వీ ప్రసాద్-ఆకృతి పురస్కారానికి సంబంధించిన ఆహ్వాన పత్రాన్ని ఎల్వీ ప్రసాద్ తనయుడు, ప్రసాద్ గ్రూప్ సంస్థల చైర్మన్ రమేష్ ప్రసాద్, ఆకృతి సుధాకర్‌తో కలిసి బాలకృష్ణ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎల్వీ ప్రసాద్ కుటుంబంతో తన అనుబంధం అపురూపమైందని అన్నారు. ఆకృతి సుధాకర్ మాట్లాడుతూ ఈ అత్యున్నతస్థాయి పురస్కారాన్ని బాలకృష్ణ స్వీకరించడం ఆనందంగా ఉందని, ఈ నెల 17న ప్రసాద్ ల్యాబ్స్‌లో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కేవీ రమణాచారి, బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణ మోహన్‌రావు, మురళీ మోహన్, బండారు సుబ్బారావు తదితరులు పాల్గొంటారని తెలిపారు.

కోడి పందేలు ఆడుతున్న 8 మంది అరెస్ట్

హయత్‌నగర్: గుట్టుగా కోడి పందేలు ఆడుతున్న 8 మంది పందెం రాయుళ్లను అరెస్ట్ చేసి వారి నుంచి 2 కోళ్లు, 4 కత్తులు స్వాధీనం చేసుకున్న సంఘటన గురువారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... కుంట్లూర్‌లోని క్రితి ఇంజనీరింగ్ వర్క్స్ పక్కన కోడి పందేలు ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేశారు. పందేలు ఆడుతున్న దుడ్డి నర్సింహ, కొల్లిపురి సుల్తాన్‌బాజీ, చంబేటి వీరన్న, కందెల వెంకన్న, కుంచాల అశోక్, ఉట్టిపల్లి వెంకటేశ్వర్లు, కుంచాల నర్సింహ్మ, దేపూరి వెంగళరావులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 17670 నగదు, 2 పందెం కోళ్లు, 4 కోడి కత్తులు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వీధి కుక్కల దాడి: బాలికకు తీవ్ర గాయాలు



గాయపడిన తనుశ్రీ

కుత్బుల్లాపూర్: వీధి కుక్కల దాడిలో ఓ చిన్నారి తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. కొంపల్లి, మూలకుంటబాయిలోని మహాలక్ష్మి రెసిడెన్సీ సమీపంలో నివాసముంటున్న అప్పలరాజు, శ్యామల దంపతుల కుమార్తె చిన్నారి తనుశ్రీ (04) గురువారం ఇంటి ముందు ఆడుకుంటుండగా ఆరు వీధి కుక్కలు ఒక్కసారిగా ఆమెపై దాడి చేశాయి. చిన్నారి కాళ్లు, చేతులతో పాటు ముఖంపై తీవ్ర గాయాలు కావడంతో స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.

పీజేఆర్‌కు ఘన నివాళి



పీజేఆర్ జయంతి సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మాణిక్ రావు ఠాక్రే, రేవంత్‌రెడ్డి తదితరులు

ఖైరతాబాద్: మాజీ సీఎల్పీ నాయకుడు పి.జనార్దన్ రెడ్డి జయంతి సందర్భంగా గురువారం ఖైరతాబాద్ లైబ్రరీ చౌరస్తాలో పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ పి.విజయారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో ఏఐసీసీ ఇన్‌చార్జ్ మాణిక్ రావు ఠాక్రే, బోసు రాజు, ఏఐసీసీ సెక్రటరి నదీమ్ జావిద్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కేక్ కట్‌చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అంజన్‌కుమార్ యాదవ్, హన్మంతరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పీజేఆర్‌కు నివాళులర్పించారు. అనంతరం విజయారెడ్డి పీజేఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు.

ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత



శంషాబాద్ : అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కస్టమ్స్ అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. దుబాయ్ నుంచి వచ్చిన ప్రయాణికుడి కదలికలను అనుమానించిన అధికారులు అతడి వద్ద ఉన్న వస్తువులను పరిశీలించారు. మొబైల్ కవర్లలో టేపుతో దాచి తీసుకొచ్చిన 583 గ్రాముల బంగారం బయటపడింది. దీని విలువ రూ.33.57 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

నాగోలు: నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును బైక్‌పై వచ్చిన వ్యక్తి లాక్కెళ్లిన సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌లో పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎల్‌బీనగర్ పోలీసుల కథనం మేరకు... ఎల్‌బీనగర్ బైరామల్‌గూడ చెందిన బాబమ్మ జీహెచ్ఎంసీలో స్వీపర్‌గా పనిచేస్తుంది. గురువారం సాయంత్రం ఎస్‌బీహెచ్ కాలనీలో కూరగాయలు తీసుకుని నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా బైక్ వచ్చిన ఓ యువకుడు లిటిల్ ఫ్లవర్ స్కూల్ సమీపంలో ఆమె మెడలోని రెండు తులాల బంగారు గొలుసును లాక్కుని మాయమయ్యాడు. బాబమ్మ ఫిర్యాదు మేరకు ఎల్‌బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'మరణం నా చివరి చరణం కాదన్న అలిశెట్టి'

తెలంగాణ సాహిత్య అకాడమీ ఛైర్మన్ జూలూరు గౌరీశంకర్



సాక్షి, సిటీబ్యూరో: 'మరణం నా చివరి చరణం కాదు. సమరమే నా అంతిమ చిరునామా' అన్న అలిశెట్టి కవిత్వ పంక్తులు ఇప్పటికీ, ఎప్పటికీ జన హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తాయని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ వ్యాఖ్యానించారు. సాహిత్య అకాడమీ కార్యాలయంలో 'అలిశెట్టి ప్రభాకర్ జయంతి / వర్ధంతి' సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజం మారాలని, అందరూ సుఖంగా ఉండాలని, సామాజిక తాత్వికతతో అలిశెట్టి ప్రభాకర్ రాసిన కవితలు తెలుగునాట రుద్రవీణలుగా జనం గుండెల్లో మార్మోగాయన్నారు. అక్షరాన్ని ఆయుధంగా చేసి దోపిడీ వ్యవస్థపై కవితా యుద్ధం చేసిన కలం యోధుడిగా అలిశెట్టి ప్రభాకర్ నిలిచిపోయారన్నారు. 35వ జాతీయ పుస్తక ప్రదర్శనలో అలిశెట్టి ప్రభాకర్ వేదికను ఏర్పాటు చేయడంతో లక్షలాదిమంది పుస్తక ప్రియులు ఆయన రచనల పటుత్వాన్ని చూసి చలించిపోయారని అన్నారు. తెలంగాణ తేజోమూర్తుల జీవిత చరిత్రలు, వారి రచనలను నేటి తరానికి తెలియజేసినప్పుడే మన సాహిత్య, సాంస్కృతిక సౌరభాలు వర్ధిల్లుతాయని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యులు డా.ఎస్.రఘు, కాళోజీ అవార్డు గ్రహీత కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి, సాహిత్య విమర్శకులు కేపీ అశోక్ కుమార్, అమెరికాలో ఉన్న తెలంగాణ రచయిత వేణుగోపాల్ నక్షత్రము తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల రక్షణ కోసమే స్పెషల్ డ్రైవ్స్

- షీ టీం అడిషనల్ డీసీపీ సలీమా
- రాచకొండ సీపీ పరిధిలో స్పెషల్ డ్రైవ్స్..
- 50 మంది ఈవ్‌టీజర్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు

కుషాయిగూడ: ఆడపిల్లల రక్షణ కోసమే స్పెషల్ డ్రైవ్స్ చేపడుతున్నట్లు రాచకొండ షీ టీం అడిషనల్ డీసీపీ సలీమా తెలిపారు. సీపీ ఆదేశాల మేరకు గురువారం కుషాయిగూడ, మల్కాజిగిరి, ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఈవ్‌టీజర్ల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన పోలీసులు 50 మంది ఆకతాయిలను అదుపులోకి తీసుకున్నారు. వారికి కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ ఆమె కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రాథమిక స్థాయిలోనే ఇలాంటి ఘటనలకు చెక్ పెట్టాలనే ఉద్దేశంతో స్పెషల్ డ్రైవ్‌లకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. వీరిలో మైనర్లే ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. మొదటి హెచ్చరికగా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని భవిష్యత్‌లో పునరావృత్తమైతే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ముఖ్యంగా రద్దీ ప్రాంతాల్లో యువకులు గుమిగూడి మహిళలు, ఆడపిల్లలకు అసౌకర్యం కలిగించవద్దని సూచించారు. ఇకపై తరచూ డ్రైవ్స్ కొనసాగుతూనే ఉంటాయన్నారు. కార్యక్రమంలో కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈడీ, ఎంపీఈడీ చివరి విడత కౌన్సెలింగ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు చివరి విడత కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను గురువారం ప్రకటించారు. ప్రవేశ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులు ఈ నెల 16, 17, 18 తేదీల్లో రిజిస్ట్రేషన్లు, 19, 20న వెబ్ ఆప్షన్స్, 22న సీటు సాధించిన అభ్యర్థుల జాబితా విడుదల, 25న ఆయా కాలేజీల్లో రిపోర్టింగ్ చేయాలని టీఎస్-సీపీజీఈటీ-2022 కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి తెలిపారు.

18న పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షల ఫలితాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షల ఫలితాలను ఈ నెల 18న విడుదల చేయనున్నట్లు పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.పాండురంగారెడ్డి గురువారం తెలిపారు. వీసీ ప్రొ.రవీందర్ చేతుల మీద విడుదల కానున్న పీహెచ్‌డీ ఫలితాలను ఉస్మానియా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామన్నారు.

రుణం పేరిట లూటీ

- రూ.కోటి రుణం ఇప్పిస్తానని టోకరా
- టీడీఎస్, జీఎస్టీ చెల్లించాలని రూ.17 లక్షలు స్వాహా
- రాచకొండ సైబర్ క్రైమ్స్‌లో ఫిర్యాదు
- అంతరాష్ట్ర నిందితుడి అరెస్టు



నిందితుడు రమేష్

సాక్షి, సిటీబ్యూరో: తక్కువ వడ్డీ రేటుకు రుణం ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి సామాన్యులను మోసం చేస్తున్న కేటుగాడిని రాచకొండ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఎం శంకర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తమిళనాడుకు చెందిన రమేష్ ఎలుమల్లై, మరొక నిందితుడితో కలిసి (ప్రస్తుతం పరారీలో ఉన్నాడు) సులువుగా డబ్బు సంపాదించాలనే నిర్ణయించుకున్నారు. ప్రైవేట్ బ్యాంకుల నుంచి తక్కువ వడ్డీ రేటుకు రుణాలు ఇప్పిస్తానని అమాయకులకు మాయమాటలు చెప్పేవారు. ఈ క్రమంలో ఎల్బీనగర్ పోలీసు స్టేషన్ పరిధికి చెందిన ఓ బాధితుడికి ఒకరోజు వాట్సాప్ కాల్ వచ్చింది. వర్మారాజ్‌గా పరిచయం చేసుకున్న నిందితుడు.. 1 శాతం వడ్డీ రేటుకు రూ.9 కోట్లు రుణం ఇప్పిస్తానని నమ్మించాడు. ఆధార్, పాన్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలను తీసుకున్నాడు. టీడీఎస్, జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని నమ్మించి గతేడాది నవంబర్ లో రూ.17 లక్షలు వసూలు చేశాడు. అయినా రుణం రాకపోవటంతో మోసపోయామని గ్రహించి రాచకొండ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. సాంకేతిక ఆధారాల ద్వారా చెన్నైకు వెళ్లి నిందితుడు రమేష్‌ను అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు రమేష్‌పై గతంలో ఎల్బీనగర్, కేపీహెచ్‌బీ ఠాణాలతో పాటు సైబరాబాద్ సైబర్ క్రైమ్ పీఎస్‌లోనూ ఈ తరహా కేసులు ఉన్నాయి.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



సాక్షి,సిటీబ్యూరో: అబిడ్స్ డివిజన్ తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నూతన కేలండరను అబిడ్స్ డివిజన్ అదనపు కమిషనర్, సునీత, సంయుక్త కమిషనర్ శ్రీనివాస్ చేతుల మీదుగా గురువారం జేసీ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ జనరల్ సెక్రెటరీ ఎస్.కె జలాలుద్దీన్ అసోసియేట్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ మాట్లాడుతూ వాణిజ్య పనుల శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను సంఘం దృష్టికి తీసుకొని రావాలన్నారు. తాము రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతా కుమారి, వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ నీతు కుమారి ప్రసాద్ దృష్టి తీసుకుని వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అబిడ్స్ డివిజన్ అధ్యక్షులు విక్టర్ పాల్ మాట్లాడుతూ అబిడ్స్ డివిజన్ కు సంబంధించిన ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి తమ వంతు కృషిచేస్తామని డివిజన్ అదనపు కమిషనర్ శ్రీమతి సునీత చేతుల మీదుగా నూతన వార్షిక కేలండర్ ఆవిష్కరించడం సంతోషకరమని సెక్రెటరీ జి దామోదర్ తెలిపారు.

15న ఆర్మీ డే..

రసూల్‌పురా: దేశ మొదటి ఆర్మీ కమాండర్ ఇన్ చీఫ్, ఫీల్డ్ మార్షల్ కేఎం. కరియప్ప జనవరి 15 1949లో బ్రిటీష్ వారి నుంచి మన సైన్యాన్ని స్వాధీనం చేసుకున్నారని ఆయన గౌరవార్థం ఏటా ఆర్మీ డే నిర్వహిస్తున్నట్లు తెలంగాణ, ఆంధ్ర సబ్ ఏరియా కమాండర్, బ్రిగేడియర్ సోమశంకర్ తెలిపారు. గురువారం సబ్ ఏరియా కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ మొట్టమొదటి సారి దేశ రాజధానిలో కాకుండా బెంగళూరులో 75వ ఆర్మీడే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తు న్నామన్నారు. జనరల్ మనోజ్‌పాండే బెంగళూరులో అమరవీరులకు నివాళులర్పించిన అనంతరం ఆర్మీ పరేడ్‌ను కొనసాగిస్తారన్నారు. యువతకు స్ఫూర్తినిచ్చే విధంగా మిలిటరీ బ్యాండ్, మోటార్ సైకిల్ ప్రదర్శన, పారా మోటార్లు, కంబాట్ ఫ్రీ ఫాల్ సహసోపేత ప్రదర్శన ఉంటుందన్నారు. ఆర్మీ సిబ్బంది, కంటిజెంట్ల పరాక్రమం, మెరిటోరియస్ సర్వీసుకు గుర్తింపుగా గ్యాలంట్రీ అవార్డులు, శౌర్య పురస్కారాలు అందజేస్తారని ఆయన వివరించారు.

టాసా ఆధ్వర్యంలో..

ఆర్మీ డేను పురస్కరించుకుని సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో రెండు రోజుల పాటు ఆర్మీ ఆయుధ సంపత్తి, యుద్ధ ట్యాంకులు, బోఫోర్స్ గన్స్, రాడార్లు తదితరాలను ప్రజల సందర్శనార్థం అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. 15న నెక్లెస్ రోడ్‌లో రన్ విత్ సోల్జర్స్ రన్ ఫర్ సోల్జర్స్ మారథాన్ నిర్వహిస్తామన్నారు. వివిధ సేవా కార్యక్రమాల్లో భాగంగా 7500 మొక్కలు నాటామని. స్వచ్ఛంద సంస్థలు, వివిధ ఆసుపత్రలకు 7500 యూనిట్ల రక్తాన్ని అందజేసినట్లు తెలిపారు. పాఠశాలలను దత్తత తీసుకుని విద్యార్థులకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు., భూగర్భ జలాలను పెంపొందించేందుకు చెరువుల నిర్మాణం, అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. నగర ప్రజలు ఆర్మీ డే సందర్భంగా నిర్వహించే ప్రదర్శనల్లో, మారథాన్‌లో పాల్గొనాలని కోరారు.

క్లుప్తంగా

వీబీ రాజేంద్రప్రసాద్‌కు నివాళి



వీబీ రాజేంద్రప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాజా సూర్యనారాయణ

ఫిలింనగర్: ప్రముఖ సినీ నిర్మాత, ఫిలింనగర్ దైవసన్నిధానం మాజీ చైర్మన్ దివంగత వీబీ రాజేంద్రప్రసాద్ వర్ధంతిని గురువారం ఫిలింనగర్‌లో నిర్వహించారు. దైవసన్నిధానం కార్యదర్శి, సినీ రచయిత పరుచూరి గోపాలకృష్ణ, మాజీ కార్పొరేటర్, ఫిలింనగర్ సొసైటీ కార్యదర్శి కాజా సూర్యనారాయణ తదితరులు రాజేంద్రప్రసాద్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఫిలింనగర్ అభివృద్ధికి ఆయన చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు.

ఆరు కంటి వెలుగు శిబిరాల ఏర్పాటు



శిబిరం ఏర్పాటు చేసే హాల్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కవితారెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులు

వెంకటేశ్వరకాలనీ: ఈ నెల 18వ తేదీ నుంచి చేపట్టే రెండో విడత కంటి వెలుగు కార్యక్రమానికి సర్కిల్ పరిధిలో ఆరు శిబిరాలు ఏర్పాటు చేశామని జీహెచ్ఎంసీ సర్కిల్–18 డీఎంసీ రజినీకాంత్‌రెడ్డి తెలిపారు. బంజారాహిల్స్ రోడ్ నం. 11లోని గౌరీ శంకర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసే శిబిరంలో ఏర్పాట్లను వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డితో కలిసి పరిశీలించారు. డివిజన్‌లో రెండు చోట్ల ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని, ఇందుకోసం ప్ర త్యేక బృందాలు ఏర్పాటయ్యాయన్నారు. 18 ఏళ్లు పైబడ్డ వారందరికీ కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

డ్రైనేజీ సమస్య లేకుండా చూడండి

హిమాయత్‌నగర్: దత్తా నగర్‌లో నాలా పరివాహక ప్రాంతంలో నివసించే వారికి అక్కడ నిర్మించే ప్రహరీ నిర్మాణ నేపథ్యంలో డ్రైనేజీకి ఏవిధమైన సమస్య లేకుండా చూడాలని అధికారులను కార్పొరేటర్ గడ్డం మహాలక్ష్మీరామన్‌గౌడ్ కోరారు. కొద్దిరోజులుగా దత్తానగర్ నాలా ప్రాంతంలో ప్రహరీ నిర్మిస్తున్నారు. దీంతో అక్కడ డ్రైనేజీ పైప్‌లైన్‌ను మూసివేయడంతో స్థానికులు అభ్యంతరాలు తెలుపుతూ కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులను ఆమె ఘటనా స్థలానికి పిలిచి డ్రైనేజీకి సమస్యలు లేకుండా..ప్రహరీ నిర్మించాలని సూచించారు.

మన గోదమ్మ పెళ్లి కూతురాయెనే!

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నం. 14లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 14న గోదాదేవి అమ్మవారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అర్చకులు ఏర్పాట్లు చేస్తున్నారు. వేడుకల్లో భాగంగా గోదాదేవిని గురువారం పెళ్లి కూతురిని చేశారు. సంప్రదాయ బద్ధంగా జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారికి సారె, చీర సమర్పించిన ఘట్టం కనుల పండువగా జరిగింది. మేళ, తాళాలు ఊరేగింపు మధ్య అర్చకులు ముందు వెళ్తుండగా మహిళలు సారె తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఈ వేడుకలను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: ఆల్విన్ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సుందర్‌నగర్, మోడల్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ కిశోర్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా శాంతిబాగ్, శివబాగ్, కేకే జోన్ హోటల్, శేషమహల్, ప్లేగ్రౌండ్, దివ్యశక్తి లైన్, డీకే రోడ్డు, రోశయ్య లైన్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మర్యాదపూర్వక కలయిక



కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మాణిక్‌రావు ఠాక్రేను టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ వినోద్ రెడ్డి గురువారం గాంధీ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ విధి విధానాలపై వినోద్‌రెడ్డి.. ఠాక్రేతో కొద్దిసేపు చర్చించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు తన వంతు కృషి చేస్తానని ఆయనతో వినోద్ రెడ్డి అన్నారు. – హిమాయత్ నగర్

ముచ్చటైన ముగ్గులు

● వాడవాడలా సంక్రాంతి పండుగ శోభ ● రంగవల్లుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బంజారాహిల్స్: సంక్రాంతి పండుగ సందర్భంగా వీధులన్నీ ముచ్చటైన ముగ్గులతో కనువిందు చేస్తున్నాయి. ఒక వైపు మహిళా సమాఖ్యలు... మరోవైపు పాఠశాలల్లో విద్యార్థులు, తల్లులు, ఉపాధ్యాయులు చక్కని ముగ్గులు వేసి సంక్రాంతి శోభను కళ్ల ముందు నిలుపుతున్నారు. గురువారం వాడవాడలా ముత్యాల ముగ్గులు నిర్వహించారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని కొత్త చెరువు వద్ద డివిజన్ మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గులను ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తిలకించారు. అందమైన ముగ్గులు వేసి ఆకట్టుకున్న మహిళలకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు.



పోటీలను తిలకిస్తున్న ఎమ్మెల్యే దానం

సోమాజిగూడలో...



ముగ్గులు వేస్తున్న మహిళలు

సోమాజిగూడ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ సంగీతా యాదవ్ ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల్లో బస్తీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రగతి భవన్ ఎదురు వీధిలో ఏర్పాటు చేసిన ఈ పోటీలను ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ సంగీత తిలకించి చక్కని ముగ్గులు వేసిన మహిళలను అభినంది బహుమతులు అందజేశారు.

ఎస్సీటీనగర్‌లో..



గ్లోబల్ గ్రామర్ స్కూల్‌లో..

బంజారాహిల్స్‌రోడ్ నం. 12లోని ఎస్సీటీ నగర్ గ్లోబల్ గ్రామర్ స్కూల్‌లో రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఉత్తమ ముగ్గులు వేసిన విద్యార్థులకు కరస్పాండెంట్ సునీల్ కుమార్ బహుమతులు అందించారు.

ఖుష్బూ విద్యానికేతన్‌లో...

బంజారాహిల్స్ రోడ్ నం. 14లోని ఖుష్బూ విద్యానికేతన్ హైస్కూల్‌లో సంక్రాంతి సంబురాలు అంబరాన్ని అంటాయి. విద్యార్థులు సంప్రదాయ ముగ్గులు రంగు రంగుల్లో తీర్చిదిద్దారు. అందమైన ముగ్గులు వేసిన విద్యార్థులకు స్కూల్ ప్రిన్సిపాల్ రాజ్‌దేవి బహుమతులు అందజేశారు.



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యానికేతన్ విద్యార్థులు

బర్డ్స్ అండ్ బ్లూమ్స్‌లో...



వేడుకల్లో పాల్గొన్న బర్డ్స్ అండ్ బ్లూమ్స్ స్కూల్ చిన్నారులు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డలోని బర్డ్స్ అండ్ బ్లూమ్స్ స్కూల్‌లో సంక్రాంతి సందర్భంగా విద్యార్థులకు ముగ్గులు తదితర పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు స్కూల్ డైరెక్టర్ శశిభూషన్, ప్రిన్సిపాల్ శాంతిప్రియ బహుమతుల అందజేశారు.

భారతీయ విద్యాభవన్ స్కూల్‌లో...



జూబ్లీహిల్స్ భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ ఇద్యాశ్రమంలో సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు, వారి తల్లులు స్కూల్ ఆవరణను రంగు రంగుల ముగ్గులతో ముంచెత్తారు. మూడు రోజుల ముందే పండుగ వచ్చిందా అనే రీతిలో ముగ్గులు వేసి అందరినీ ఆకట్టుకున్నారు. 150 మంది తల్లులు, 100 మందికి పైగా విద్యార్థినులు పాల్గొన్నారు.

జాస్మిన్ హైస్కూల్‌లో...



సంక్రాంతి వేడుకల్లో జాస్మిన్ హైస్కూల్ విద్యార్థులు

శ్రీనగర్‌కాలనీ: రాజీవ్‌నగర్‌కాలనీలోని జాస్మిన్ హైస్కూల్‌లో గురువారం సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. హరిదాసు కీర్తనలు, రంగు రంగుల ముగ్గులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆటపాటలతో స్కూల్ ప్రాంగణంలో సందడి నెలకొంది. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు చైర్మన్ పి. జగన్నాథం, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి బహుమతులు అందజేశారు.

సందడిగా పోటీలు..

హిమాయత్‌నగర్: సంక్రాంతి సందర్భంగా డివిజన్‌లో గురువారం ముగ్గుల పోటీలు సందడిగా సాగాయి. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు ఈ పోటీలను ప్రారంభించారు. అనంతరం విజేతలకు వీరిద్దరూ కలసి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నర్సింగ్‌ముదిరాజ్, నాయకులు కేశబోయిన శ్రీధర్, పందిళ్ల ప్రసాద్, సాయి, సందీప్, కవిత, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.



ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న చింతల, గౌతమ్‌రావు

జేహెచ్‌పీఎస్‌లో ...



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. స్కూల్ చైర్మన్ ఎ. మురళీ ముకుంద్, ప్రిన్సిపాల్ ఎం.వరలక్ష్మి చిన్నారులకు భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు. సంక్రాంతి నేపథ్యంలో ఆట,పాటలతో చిన్నారులు సందడి చేశారు.

యువజనోత్సవాలు ప్రారంభం

పంజగుట్ట: నెహ్రూ యువకేంద్రం, నవ్యశ్రీ సామాజిక సేవా సమితి ఆధ్వర్యంలో వారం పాటు నిర్వహించనున్న యువజనోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా చింతల్‌బస్తీలోని ఖైరతాబాద్ డిగ్రీ కాలేజీ విద్యార్థులకు, చింతల్‌బస్తీ చింతలగూడ హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, డిగ్రీ కాలేజీ మహిళా విద్యార్థులకు రంగోలి పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ రాజేందర్ కుమార్, జగన్, టీఆర్ఎస్ నాయకులు మహేంద్ర బాబు, నవ్యశ్రీ సామాజిక సేవా సమితి సభ్యులు కె.నాగేశ్వర్‌రావు, సి.వెంకటేష్, గాలి అనిల్ కుమార్, పి.సంతోష్, సిరిగిరి మాధవ్ పాల్గొన్నారు.

ఎస్‌వీఎంలో సంక్రాంతి వంటకాలు



విభిన్న రకాల వంటకాలను చూపిస్తున్న నిర్వాహకులు

బంజారాహిల్స్: ఇటు సంక్రాంతి పిండి వంటలు... అటు నాటు కోడి, సీ ఫుడ్ రుచులకు బంజారాహిల్స్ రోడ్ నం. 1లోని ఎస్‌వీఎం గ్రాండ్ హోటల్ వేదికైంది. సంక్రాంతి సీజన్ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన ఈ హోటల్‌లో గురువారం నుంచి సంక్రాంతి థీమ్‌తో ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేశామని హోటల్ ఎండీ ఎం.వరప్రసాద్, ఈడీ సత్యనారాయణ, నరేష్ తెలిపారు. ఫుడ్ ఫెస్టివల్ సందర్భంగా నగర వాసులకు పండుగ స్పెషల్ వంటకాలతో పాటు అరేబియాన్, సీ ఫుడ్, బార్బిక్యూ రుచులను కూడా అందిస్తున్నామని ఎగ్జిక్యూటివ్ చెఫ్ జగన్ గౌడ్ తెలిపారు. ఈ ఫుడ్ ఫెస్టివల్ ఈ నెల 16వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా అశోక్



పంజగుట్ట: తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా డి.అశోక్‌ను నియమించారు. ఈ మేరకు రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చేతులమీదుగా అశోక్ నియామకపత్రం అందుకున్నాడు.

పేదల కోసం పరితపించిన పీజేఆర్



కేక్ కట్ చేస్తున్న వీహెచ్, విష్ణువర్ధన్ రెడ్డి



వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి

రహమత్‌నగర్ : సీఎల్‌పీ మాజీ నాయకుడు, దివంగత పి.జనార్దన్‌రెడ్డి పేద ప్రజల శ్రేయస్సు కోసం తన జీవితాంతం పరితపించారని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వి.హనుమంతరావు గుర్తు చేశారు. పీజేఆర్ 75 జయంతి వేడుకల సందర్భంగా గురువారం ఎస్పీఆర్ హిల్స్ పీజేఆర్ ఆలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. భారీ కేక్ కట్ చేసి పీజేఆర్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వీహెచ్ మాట్లాడుతూ, కార్మిక నాయకుడిగా రాజకీయ జీవితం ప్రారంభించిన పీజేఆర్ కృషి పట్టుదలతో అంచెంచెలుగా ఎదిగి మంత్రిగా, సీఎల్‌పీ నాయకుడిగా ఎన్నో సేవలు చేశారన్నారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి పీజేఆర్ ఆయలంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భవానీ శంకర్, వినోద్‌కుమార్‌గౌడ్, లియాకత్ అలీ, కృష్ణమోహన్, ఖదీర్, గ్యార నాగరాజు. దూడల రవి, సుశీల్, కేశవులు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు కాంగ్రెస్ నాయకులు డివిజన్‌లోని పీజేఆర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

హేమావతినగర్‌లో..

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డలోని హేమావతినగర్‌లో గురువారం పీజేఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకలను మాజీ ఎమ్మెల్యే పి. విష్ణువర్ధన్‌రెడ్డి హాజరై పీజేఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నేతలు రవిగౌడ్, గోపాల్‌రెడ్డి, మోసిన్, గోపి, మధు, మొగేష్, శివ పాల్గొన్నారు.

అన్నదానం

వెంగళరావునగర్ : పీజేఆర్ 75వ జయంతి సందర్భంగా యూసుఫ్‌గూడ డివిజన్ వెంకటగిరి చౌరస్తా, గణేష్ మంటపాల వద్ద గురువారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సురేందర్ యాదవ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ముఖ్యఅతిథిగా సీనియర్ నాయకుడు వి. హనుమంతరావు హాజరై పీజేఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు ఎ.బాలయ్య యాదవ్, సురేందర్ యాదవ్, అఫ్జల్‌ఖాన్, మహేందర్, రాములు పాల్గొన్నారు.

త్యాగబ్రహ్మ ఆరాధనోత్సవాలు ప్రారంభం



పంచరత్న కీర్తనల సమష్టి గానం చేస్తున్న కళాకారులు

పంజగుట్ట: వేద వేదాంత సంగీత సాహిత్య సభ 'విజ్ఞాన సమితి' ఆధ్వర్యంలో 176వ త్యాగబ్రహ్మ ఆరాధనోత్సవాలు, సమితి 46వ వార్షికోత్సవం గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారు జామునే త్యాగరాజ స్వామి పూజతో ప్రారంభించి, కలశస్థాపన, ఉపనిషత్ పారాయణం మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆరుగురు ఘనాపాటి వేదపండితులకు సన్మానం, వేదపఠనం చేశారు. కంచి కామకోటి ఆస్థాన విద్వాన్ కొమండూరి శేషాద్రికి సంగీత విజ్ఞాన విశారద బిరుదు ప్రదానం చేశారు. ఒకేసారి జంటనగరాల నుంచి వచ్చిన సుమారు 300 మందికి పైగా సంగీత కళాకారులచే త్యాగరాజ స్వామి పంచరత్న కీర్తనల సమష్టి గానం చేశారు. కార్యక్రమం ఈ నెల 18వ తేదీ వరకు కొనసాగుతుందని విజ్ఞాన సమితి అధ్యక్షుడు సూరి వెంకటేశ్వర్లు, కార్యదర్శి వీవీ సుజ్ఞాన్ తెలిపారు.

కుక్క బారినుంచి తప్పించుకోబోయి
డెలివరీ బాయ్‌కి తీవ్రగాయాలు

బంజారాహిల్స్: పార్శిల్ ఇవ్వడానికి వెళ్లిన డెలివరీ బాయ్ పెంపుడు కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బంజారాహిల్స్ రోడ్ నం. 6లోని లుంబిని ర్యాక్ క్యాజిల్ అపార్ట్‌మెంట్‌లో నివసించే శోభనా నాగాని ఫుడ్ డెలివరీ ఆర్డర్ చేశారు. ఈ నెల 11న ఉదయం 9 గంటల ప్రాంతంలో మహ్మద్ రిజ్వాన్(23) స్విగ్గి డెలివరీ బాయ్ పార్శిల్ ఇవ్వడానికి వెళ్లి తలుపు కొట్టాడు. తలుపు తీసి ఉండటంతో ఒక్కసారిగా ఇంట్లోనుంచి జర్మన్ షెపర్డ్ కుక్క బయటికి దూసుకొచ్చి అతడిని కరవబోయింది. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన రిజ్వాన్ కుక్క బారి నుంచి తప్పించుకునే క్రమంలో కారిడార్ రెయిలింగ్ నుంచి జారి కిందపడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం నిమ్స్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. యజమానురాలు కుక్కను కట్టకుండా నిర్లక్ష్యం వదిలివేయడంతోనే తమ సోదరుడు తీవ్ర గాయాలపాలయ్యాడని, ఆమెపై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడి సోదరుడు ఖాజా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో శోభనపై ఐపీసీ సెక్షన్ 336, 289 కింద కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఠాక్రేను కలిసిన రోహిన్‌రెడ్డి

బంజారాహిల్స్: తెలంగాణ పీసీసీ ఇన్‌ఛార్జ్ మానిక్‌రావు ఠాక్రేను గురువారం ఖైరతాబాద్ కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుడు సి.రోహిన్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ కోసం కష్టపడాలని, డీసీసీలకు పూర్తి అధికారాలు ఇస్తున్నామని ఠాక్రే ఈ సందర్భంగా చెప్పారన్నారు.



యువతకు స్వామి వివేకానంద ఆదర్శం



వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్



వివేకానందుడి చిత్రపటం వద్ద నివాళుర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల

బంజారాహిల్స్: జాతీయ యువజన ఉత్సవాలను గురువారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఫిలింనగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివేకానంద చిత్రపటానికి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పూల మాలలు వేసి నివాళులఅర్పించారు. నేటి యువతకు స్వామి వివేకానందుడు ఆదర్శమన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో...

ఖైరతాబాద్ నియోజక వర్గం బీజేపీ ఆధ్వర్యంలో వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. సాగర్ సొసైటీలోని బీజేపీ కార్యాలయం వద్ద వివేకానందుడి చిత్రపటానికి ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పూల మాల వేసి నివాళులర్పించారు. స్వామి వివేకానందుడు చెప్పినట్లు యువశక్తిని సద్వినియోగం చేసుకుంటే దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఆయన స్ఫూర్తితో యువత భవితకు బాటలు వేసుకోవాలని చెప్పారు.

శ్రీనగర్‌కాలనీ: స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో భాగంగా గురువారం లయన్ క్లెం శ్రీనివాస రెడ్డి కల్యాణ్‌నగర్ వెంచర్–3లో స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

'విరించి'లో అవగాహన కార్యక్రమం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నం. 1/12 చౌరస్తాలో ఉన్న విరించి ఆస్పత్రిలో జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్యాంసుందర్ మాట్లాడుతూ, యువతకు పలు శారీరక, మానసిక ఆరోగ్య సంబంధిత అంశాలపై అవగాహన కలిగించడమే కాకుండా అవి తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సీఈఓ డాక్టర్ ఎ.సాయి రవి శంకర్, ఈడీ వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

యువజన సమ్మేళనం

ఖైరతాబాద్: జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా గురువారం ఖైరతాబాద్ లైబ్రరీ చౌరస్తాలో నియోజకవర్గ బీజేపీ నాయకుడు పల్లపు గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో యువజన సమ్మేళనం నిర్వహించారు. స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వామి వివేకానంద చూపిన మార్గంలో ప్రధాని నరేంద్రమోదీ పాలన సాగిస్తున్నారని గోవర్ధన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రోగులకు అన్నదానం

ఖైరతాబాద్: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా గురువారం లక్డీకాపూల్‌లోని ఐఏఎంసీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, సోషల్ రెస్పాన్స్‌బులిటీ కమిటీ, లయన్స్ క్లబ్ సహకారంతో బసవతారకం కేన్సర్ ఆసుపత్రి ఆవరణలో 500 మంది రోగులకు అన్నదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, వివేకానంద స్ఫూర్తితో నేటి యువత విద్యతో పాటు వివిధ సేవా కార్యక్రమాలల్లో పాల్గొని, దేశసేవలో భాగం కావాలన్నారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం 13-1-2023

ఫ్యాషన్



సంక్రాంతి అంటేనే ప్రకృతి పండగ
పతంగుల సంబరం
ఈ వేడుకకు మరింత వన్నె తెచ్చేవి
సంప్రదాయ దుస్తులే కాదు
వాటిని మరింత మెరుపులీనేలా చేసే
ఆభరణాలు కూడా!

పండగ ఆభరణాలు






సుగర్ బాల్ జ్యువెలరీ

సంక్రాంతికి సుగర్ బాల్స్‌తో చేసిన ఆభరణాలను ధరించడం కొన్ని చోట్ల ఆచారంగా ఉంది. పెళ్లయిన ఏడాదికి నవ వధువుకు చేసే ఈ అలంకరణ మరాఠాలోనూ ఇతర సంప్రదాయాల్లో కనిపిస్తుంది. గసగసాలు లేదా నువ్వులను పంచదార పాకంలో కలుపుతారు. వీటిని సన్నని మంటమీద మిశ్రమం బాగా చిక్కబడేవరకు కలుపుతూ ఉంటారు. ఈ మిశ్రమంతో పూసల్లాంటి చిన్న చిన్న బాల్స్‌ని తయారుచేస్తారు. ఈ చక్కెర బాల్స్‌ని అందమైన వివిధ రకాల ఆభరణాలుగా రూపుకడతారు. ఇవి వధువు భవిష్యత్తు జీవితాన్ని ఆనందకరంగా మార్చుతాయని వారి నమ్మకం. అలాగే ఐదేళ్ల లోపు పిల్లలకు కూడా వీటి అలంకరణ చూడముచ్చటగా ఉంటుంది.

పువ్వుల క్రాంతి

ఆభరణం అంటే బంగారమే కానక్కర్లేదు. భారతదేశ వివాహ వేడుకల్లో మెహిందీ సమయాల్లో ధరించే ప్రత్యేకమైన పుష్ప హారాలు సంక్రాంతినీ సందడిచేస్తున్నాయి. అమ్మాయిల అందాన్ని పువ్వులతో రెట్టింపు చేస్తున్నాయి. వీటిలో పొడవు హారాలు, చోకర్స్, జూకాలు, గాజులు పువ్వుల అల్లికతో అందంగా అమర్చుకోవచ్చు. ధరించే దుస్తులతోనూ వీటిని మ్యాచ్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ పువ్వుల ఆభరణాలు అందుబాటులోకి వచ్చాయి.



జనవరి రాగానే చాలా మంది ఎదురుచూసే పండగ సంక్రాంతి. ఢిల్లీ వాసులు సక్రాత్ అని, గుజరాతీయులు ఉత్తరాయణం అని, తమిళనాడులో పొంగల్ అని, తెలుగు రాష్ట్రాలలో మకర సంక్రాంతి అనీ అంటారు. పేరు భిన్నంగా ఉండవచ్చు, కానీ వేడుకలో ఉత్సాహం ప్రతి చోటా అధికంగానే ఉంటుంది. అందుకు తగినట్టుగానే మగువలు అలంకరణలోనూ వైవిధ్యం చూపుతుంటారు.

గోటా పట్టీ

ధరించే దుస్తుల రంగులతో ఫ్యాబ్రిక్, గోటా పట్టీ జ్యువెలరీ కూడా పోటీపడుతుంటాయి. దీంతో ఇవి పండగ కళను మరింత పెంచుతాయి.







ఎంత ఈజీ అయితే మాత్రం...
ఎప్పుడూ సేమ్యా పాయసమేనా?
ఈసారి... శనగపప్పు పాయసం చేద్దాం.
నూనెలో మునిగి తేలే బూరెలకు సెలవిద్దాం.
ఈసారి... బొబ్బట్లు చేసుకుని ఆరగిద్దాం.
మినప గారెల బదులు సగ్గుబియ్యం టేస్ట్ చేద్దాం.
క్షీరాన్నం సూర్యుడికి నివేదించి కప్పుల్లో పోసుకుందాం.
వెన్న మురుకులు... నువ్వుండలు డబ్బాల్లో వేద్దాం.

వంటిల్లు

సంక్రాంతి విందు

బొబ్బట్లు



కావలసినవి: గోధుమ పిండి – అర కేజీ; శనగపప్పు – పావు కేజీ; బెల్లం తురుము – పావుకేజీ; ఏలకుల పొడి – ఒక టీ స్పూను; నెయ్యి – టేబుల్ స్పూన్.

తయారీ: ● గోధుమపిండిని చపాతీలకు కలుపుకున్నట్లు కలిపి నానబెట్టాలి. ● శనగపప్పును ఉడికించి నీరు మొత్తం పోయేటట్లు వడపోసి గ్రైండ్ చేసుకోవాలి. ఇందులో బెల్లం తురుము, ఏలకుల పొడి వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని (పూర్ణం) బాణలిలో వేసి ఒక మోస్తరుగా వేడి చేస్తే... బొబ్బట్లు రెండు – మూడు రోజుల వరకు తాజాగా ఉంటాయి. ఒక రోజుకైతే బెల్లం– శనగపప్పు మిశ్రమాన్ని వేడిచేయనవసరం లేదు. ● గోధుమ పిండిని నిమ్మకాయంత తీసుకుని ప్రెస్సర్‌లో పూరీలా వత్తాలి. ఇందులో చిన్న గోళీ అంత పూర్ణం పెట్టి అన్ని అంచులూ కలుపుతూ మడత వేయాలి. ఈ రౌండ్‌ని మరలా ప్రెస్సర్‌లో జాగ్రత్తగా పూరీల్లా వత్తాలి (వత్తేటప్పుడు పూర్ణం బయటకు రాకూడదు). వీటిని పెనం మీద వేసి తిరగేస్తూ రెండు వైపులా దోరగా కాల్చాలి. కాల్చేటప్పుడు ఒక టీ స్పూను నెయ్యి వేయాలి. నేతితో కాల్చిన బొబ్బట్లు ఘుమఘుమ లాడుతూ నోరూరిస్తాయి.

శనగపప్పు పాయసం



కావలసినవి: పచ్చి శనగపప్పు – 200 గ్రా; కొబ్బరి పాలు లేదా గేదెపాలు– 100 మి. లీ; బెల్లం తురుము – 150 గ్రా; నెయ్యి – 4 టేబుల్ స్పూన్‌లు; జీడిపప్పు – 20; కిస్‌మిస్ – టేబుల్ స్పూన్; ఏలకుల పొడి – అర టీ స్పూన్.

తయారీ: ● శనగపప్పును కడిగి పది నిమిషాలు నానబెట్టిన తర్వాత రెండింతలు నీటిని పోసి ప్రెషర్ కుక్కర్‌లో నాలుగైదు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి. ● పాలను మరిగించి పక్కన ఉంచాలి. ● కుక్కర్ వేడి తగ్గిన తర్వాత శనగపప్పును ఒక మోస్తరుగా మెదపాలి (మరీ మెత్తగా చేయరాదు). ● వెడల్పాటి బాణలి పెట్టి అందులో మెదిపిన శనగపప్పు వేసి పాలు పోసి కలుపుతూ మరిగించాలి. మిశ్రమంలో బుడగలు వచ్చేటప్పుడు బెల్లం తురుము, ఏలకుల పొడి వేసి సన్న మంట మీద (పెద్ద మంట చేస్తే పాయసం అడుగు పడుతుంది) కలుపుతూ ఉడికించాలి. ● మరొక స్టవ్ మీద పెనం పెట్టి నెయ్యి వేడి చేసి జీడిపప్పు, కిస్‌మిస్ వేయించాలి. వీటిని ఉడుకుతున్న పాయసంలో వేసి కలిపి దించేయాలి. **గమనిక:** వీగన్ డైట్‌ను అనుసరించేవాళ్లు యానిమల్ మిల్క్‌కి చదువుగా కొబ్బరిపాలతో, నెయ్యికి బదులుగా వంట కొబ్బరి నూనెతో చేసుకోవచ్చు.

నువ్వుల ఉండలు



కావలసినవి: నువ్వులు – పావు కేజీ; బెల్లం పొడి – 200 గ్రా; ఏలకుల పొడి – ఒక టీ స్పూను; నెయ్యి – కొద్దిగా.

తయారీ: ● నువ్వులను వేయించి పొడి చేయాలి. కొన్నింటిని పొడి చేయకుండా అలాగే ఉంచాలి. ఇందులో బెల్లం పొడి, ఏలకుల పొడి వేసి రెండూ సమంగా కలిసే వరకు రోట్లో దంచాలి. చేతికి నెయ్యి రాసుకుని కావలసిన సైజులో ఉండలు చేయాలి. ఇవి రెండు–మూడు రోజుల వరకు నిల్వ ఉంటాయి. బెల్లం పాకం పట్టి నువ్వులు కలిపి ఉండలు చేసుకుంటే నెల వరకు తాజాగా ఉంటాయి. **గమనిక:** తెల్ల నువ్వులు కాని నల్ల నువ్వులు కాని వాడవచ్చు. నల్ల నువ్వులైతే వేయించిన తర్వాత కాస్త నలిపి పొట్టు వదిలించాలి.



సగ్గు బియ్యం వడలు



కావలసినవి: సగ్గుబియ్యం – వందగ్రాములు ; బంగాళాదుంప – 4 మీడియం సైజువి; వేరు శనగపప్పు – ఒక టేబుల్ స్పూన్; జీలకర్ర – టీ స్పూన్; పచ్చిమిర్చి– 2 (సన్నగా తరగాలి); అల్లం తరుగు – టీ స్పూన్; నిమ్మరసం – 2 టీ స్పూన్‌లు; కొత్తిమీర తరుగు – 2 టేబుల్ స్పూన్‌లు; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచికి తగినంత; నూనె – పావు కేజీ.

తయారీ: ● సగ్గుబియ్యాన్ని కడిగి రెండు గంటల సేపు నానబెట్టాలి (లావు సగ్గుబియ్యం అయితే ఐదు గంటల సేపు నానాలి). సగ్గుబియ్యం గోరుతో గుచ్చి చూస్తే లోపల గట్టిదనం లేకుండా మెత్తగా ఉండాలి. ● ఈ లోపు బంగాళాదుంపలను కడిగి ఉడికించాలి. ● ఒక బాణలిలో వేరుశనగపప్పును వేయించాలి. చల్లారిన తర్వాత మిక్సీలో కొంచెం పలుకుగా గ్రైండ్ చేసుకోవాలి. ● బంగాళాదుంపలు చల్లారిన తర్వాత చిదిమి వెడల్పు పాత్రలో వేసుకోవాలి. అందులో ఉప్పు, పచ్చిమిర్చి తరుగు, అల్లం తరుగు, జీలకర్ర, కొత్తిమీర తరుగు, నిమ్మరసం, వేరుశనగ పప్పు పొడి వేయాలి. సగ్గుబియ్యాన్ని వడపోసి నీరు పోయిన తర్వాత చేత్తో మెదిపి బంగాళాదుంప మిశ్రమంలో వేసి కలపాలి. సగ్గుబియ్యం వడల పిండి రెడీ. ● బాణలిలో నూనె వేడి చేసి పిండిని పెద్ద ఉల్లిపాయంత తీసుకుని అరచేతిలో వేసి వత్తి నూనెలో వేయాలి. రెండువైపులా ఎర్రగా కాలిన తరవాత టొమాటో కెచప్ లేదా పుదీన పచ్చడితో తింటే చాలా రుచిగా ఉంటాయి.

గమనిక: పిండిని చేతిలో వేసి వత్తినప్పుడు జారిపోతున్నా, నూనెలో వేసిన తర్వాత విడిపోతున్నా వదులుగా ఉందని అర్థం. అలాంటప్పుడు తగినంత ఉప్మారవ్వ కలిపి మిశ్రమాన్ని వడ చేయడానికి తగినట్లుగా గట్టిగా చేసుకోవాలి.

క్షీరాన్నం



కావలసినవి: కొత్త బియ్యం – పావు కేజీ; వెన్న తీయని పాలు – లీటరు; చక్కెర లేదా బెల్లం పొడి – 150 గ్రాములు; ఏలకుల పొడి – టీ స్పూన్; కుంకుమ పువ్వు – పది రేకలు; బాదం – టేబుల్ స్పూన్ (సన్నగా తరగాలి); జీడిపప్పు – టేబుల్ స్పూన్; పిస్తా – టేబుల్ స్పూన్ (ఉప్పు వేయని పిస్తా తీసుకోవాలి); కిస్‌మిస్ – టేబుల్ స్పూన్; నెయ్యి – 3 టేబుల్ స్పూన్‌లు.

తయారీ: ● బియ్యం కడిగి అర గంటసేపు నానబెట్టాలి. ● పాలను మందంగా, వెడల్పుగా ఉన్న పాత్రలో పోసి మరిగించాలి. ఓ కప్పులో ఒక టేబుల్ స్పూన్ పాలను తీసుకుని కుంకుమ పువ్వు వేసి నానబెట్టాలి. ● పాలు మరుగుతుండగా బియ్యాన్ని నీటిలో నుంచి తీసి పాలలో వేసి కలపి ఉడకనివ్వాలి. బియ్యం ఒక మోస్తరుగా ఉడికిన తర్వాత చక్కెర వేసి కలిపి మంట తగ్గించి మూత పెట్టాలి. మధ్యలో కలుపుతూ ఉడికించాలి. ● ఈ లోపు ఒక చిన్న బాణలిలో నెయ్యి వేడి చేసి కిస్‌మిస్, బాదం, జీడిపప్పు, పిస్తా వేసి దోరగా వేయించాలి. వీటిని పాలలో ఉడుకుతున్న అన్నంలో వేసి కలపాలి. చివరగా ఏలకుల పొడి, కుంకుమ పువ్వు కలిపిన పాలు కూడా వేసి బాగా కలపాలి. అన్నం ఉడికిన తర్వాత దించేయాలి. **గమనిక:** రుచికి తగినట్లు తీపి మోతాదు పెంచుకోవచ్చు.

వెన్న మురుకులు



కావలసినవి: బియ్యప్పిండి – అర కేజీ; శనగపిండి – పావు కేజీ; వెన్న – పావు కేజీ; ఉప్పు – 2 టీ స్పూన్‌లు లేదా రుచికి తగినంత; జీలకర్ర పొడి – టీ స్పూన్; ఇంగువ – అర స్పూన్; వేడి నీరు – అర లీటరు; నూనె – అర కేజీ.

తయారీ: ● బియ్యప్పిండి, శనగపిండిని కలిపి జల్లించాలి. ఇందులో వెన్న వేసి సమంగా కలిసే వరకు వేళ్లతో మర్దన చేస్తూ కలపాలి. ఇప్పుడు ఉప్పు, జీలకర్ర పొడి, ఇంగువ వేసి మరోసారి కలపాలి. ఇందులో వేడినీటిని పోసి ముద్దగా కలుపుకోవాలి. మురుకుల గొట్టంలో వేసి ఒకసారి వత్తుకుని చూసుకోవాలి. తీగ సరిగ్గా పడకుండా మధ్యలో విరిగిపోతుంటే పిండి మీద కొద్దిగా నీటిని చిలకరించి కలుపుకోవాలి. ● బాణలిలో నూనె వేడి చేసి పిండిని మురుకుల గొట్టంలో వేసుకుని నూనెలోకి వత్తుకోవాలి. దోరగా కాలిన తరవాత చిల్లుల గరిటెతో తీసుకోవాలి. పిండినంతటినీ ఇలాగే చేసుకోవాలి. ఈ మురుకులు రెండు వారాల వరకు తాజాగా ఉంటాయి.

కిచెన్‌టిప్స్

వంటలో ఉప్పు ఎక్కువైతే...

● ఒక బంగాళదుంప ని నాలుగు ముక్కలు చేసి ఆ ముక్కలని ఈ వంటకంలో వేయండి. లో ఫ్లేమ్ మీద కాసేపు ఉంచండి. అయితే, బంగాళదుంప ఉప్పుతో పాటూ నీటిని కూడా పీల్చుకుంటుంది. ఈ వంటకం గ్రేవీ అయితే దానికి తగ్గట్టుగా నీటిని కలుపుకోవాలి. ఆ తరువాత ఈ బంగాళదుంప ముక్కల్ని తీసేయవచ్చు. ● కొద్దిగా కొబ్బరి పాలు పోసినా కూడా ఎక్కువైన ఉప్పు సరిపోతుంది. ● ఉప్పు ఎంత ఎక్కువైంది అన్న దాన్ని బట్టి కొంచెం నీరు లేదా నిమ్మరసం యాడ్ చేయవచ్చు. ● కొద్దిగా పెరుగు, లేదా ఫ్రెష్ క్రీం కూడా కలపవచ్చు. ● కొద్దిగా పిండి వేస్తే ఎక్కువైన ఉప్పుని ఈ పిండి పీల్చుకుని గ్రేవీలో పైకి తేలుతుంది. అప్పుడు దాన్ని తీసేయవచ్చు. ● ఉప్పు కొద్దిగానే ఎక్కువైతే, అర స్పూను నుంచి స్పూను వరకు పంచదార వేసినా సరిపోతుంది. అయితే, ఉప్పు చాలా కొద్దిగానే ఎక్కువ పడితే మాత్రమే ఈ టిప్ పని చేస్తుంది


ముగ్గు ముచ్చట

చిరునామా:
ముగ్గు–ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1,
బంజారాహిల్స్,
హైదరాబాద్–34. ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com
(మీ ఊరి పేరుతోపాటు కాలనీ,
వీధి పేరు కూడా రాయండి)


25 చుక్కలు,
11 వరుసలు
11 వచ్చే వరకు, సరి చుక్క


గడగోజు స్రవంతి
ఈడులూరు,
నల్గొండ జిల్లా


మహంకాళి సంధ్య
అంబేద్కర్ కాలనీ, మాటేడు
మహబూబాబాద్ జిల్లా




24 చుక్కలు,
8 వచ్చే వరకు,
సరి చుక్క


ఈదర విజయ
మాధురి రెడ్డి
మాచర్ల


ఎం. వనజ
అనకాపల్లి, విశాఖపట్నం


15 చుక్కలు,
8 వచ్చే వరకు
మధ్య చుక్క

ఏం బ్రౌజ్ చేస్తున్నారు?!

సైబర్ టాక్

మాంచి బిర్యానీ రెస్టారెంట్ కోసం లేదంటే, ఏదో ఒక ఐటమ్ కొనుగోలు చేయడానికి ఇంటర్నెట్‌లో చేసే ఒక సాధారణ బ్రౌజ్ వినియోగదారులను సోషల్ ఇంజనీరింగ్ స్కామ్‌ల ప్రపంచంలోకి నెట్టేస్తుంది. పెరిగిన ఇంటర్నెట్ వినియోగం దీనికి ప్రధాన కారణంగా మారింది. ఇలాంటప్పుడు ఏం చేయాలి?! డిజిటల్ యుగంలో అడుగులు వేస్తున్న ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

సురక్షితం కాని నెట్‌వర్క్‌లు, అప్లికేషన్లు, మితి మీరిన వ్యక్తిగత, షేరింగ్ పరికరాలు, దైనందిన జీవితంలో మనం తరచుగా యాక్సెస్ చేసే వర్చువల్ మీటింగ్‌లలో పరస్పర చర్యల ఫలితంగా కొత్త సమస్యలు వచ్చిపడుతున్నాయి. కోవిడ్ తర్వాత ఇవి మరింత హాని కలిగిస్తున్నాయి.

బ్రౌజ్ చేస్తున్నప్పుడు...

యూజర్‌కు తెలియకపోయినా ఇతర సీక్రెట్ చొరబాట్లు తరచుగా జరుగుతాయి. దాదాపు అన్ని బ్రౌజర్లు .. (ఎ) క్రాష్ రిపోర్టర్‌లు (బి) అనలిటిక్స్ (సి) ప్రొఫైలింగ్ (డి) గుర్తింపు (ఇ) యాడ్స్ (ఎఫ్) లొకేషన్ ... ఈ రూపంలో మన డేటాను సేకరిస్తాయి. మన బ్రౌజింగ్ కుకీల ద్వారా ట్రాక్ చేయబడుతుంది. యూజర్ సౌలభ్యం సాకుతో వెబ్‌సైట్‌లలో డేటా షేర్ చేయబడుతుంది.

సీక్రెట్ స్థాయి ఆధారంగా సురక్షితమైన బ్రౌజింగ్ అలవాట్లను సాధన చేయడం మన ప్రత్యేకతగా ఉండాలి. అంటే, అమెజాన్, ఈబే, నెట్‌ఫ్లిక్స్ వంటి వెబ్‌సైట్‌లు మీ ప్రాధాన్యతల గురించి డేటాను సేకరిస్తాయి. ఇందులో వేటిని ఇష్టపడతారో వాటికి సంబంధించిన సూచనలను అందిస్తాయి. (బి)గూగుల్, ఫేస్‌బుక్ యాప్‌లు అంతటా యూజర్ డేటాను అందించడానికి బ్రౌజింగ్‌ను ట్రాక్, షేర్ చేస్తుంది. విషయ ధ్రువీకరణకు.. https://myactivity.google.com & https://www.facebook.com/off_facebook_activity చూడచ్చు.

గూగుల్‌లో శోధన..

- మీరు మీ సెర్చ్ పారామీటర్లను కోట్స్‌లో ఉంచినప్పుడు, ఇది మొత్తం పదబంధాన్ని శోధించమని గూగుల్‌కు సూచిస్తుంది. మీ శోధన ఉదాహరణకు.. 'డిజిటల్ వెల్‌బీయింగ్' అయి ఉండాలి.
- పదాలను మినహాయించడానికి హైఫన్‌ని ఉపయోగించండి. ఉదాహరణకు మీరు మారుతీ టెంపుల్ కోసం వెతికితే అది డిఫాల్ట్‌గా మారుతీ కార్‌ని చూపుతుంది. దీన్ని నివారించడానికి మీ శోధన వాక్య నిర్మాణం మారుతి–టెంపుల్ అయి ఉండాలి.
- శోధించడానికి కోలన్‌ని ఉపయోగించండి. మీరు www.endnowfoundation.org కి లాగిన్ చేసి సైబర్ భద్రతపై కథనం కోసం వెతుకుతున్నట్లయితే site:endnowfoundaton.org అయి ఉండాలి.

సురక్షిత బ్రౌజర్లు

కుకీల వంటి థర్డ్ పార్టీ సాధనాలను ఆపడానికి సురక్షితమైన బ్రౌజర్‌లు సహాయపడతాయి. వారు మీ ప్రైవేట్/వ్యక్తిగత సమాచారం, ఇతర ట్రాకింగ్ డేటా మొత్తాన్ని సేకరిస్తారు. బ్రేవ్, డక్ డక్ గో, టోర్, మొజిల్లా , క్రోమ్ కొన్ని సురక్షితమైన బ్రౌజర్‌లు. ఈ సురక్షిత బ్రౌజర్‌లు (ఎ) సురక్షితం కాని సైట్‌లు, డౌన్‌లోడ్‌ల గురించి మిమ్మల్ని హెచ్చరిస్తాయి (బి) ఏ అనుమతులను మంజూరు చేయాలో ఎంచుకోవడానికి మిమ్మల్ని అనుమతిస్తుంది. (సి) కుకీలను నిలిపివేయడానికి మిమ్మల్ని అనుమతిస్తుంది. (డి) డిఫాల్ట్‌గా పాపప్‌లను నిలిపివేయడం. (ఇ) డిఫాల్ట్‌గా దారి మళ్లింపులను నిలిపివేయడం (ఎఫ్) స్క్రిప్ట్‌లను ఆఫ్ చేయడానికి మిమ్మల్ని అనుమతిస్తుంది (జి) మీ బ్రౌజింగ్ హిస్టరీకి యాక్సెస్‌ను మీకు అందిస్తుంది.





- నిర్దిష్ట పేజీ కోసం సెర్చ్ చేయడానికి బదులుగా, మీరు నిర్దిష్ట పేజీకి లింక్ చేసే పేజీ కోసం సెర్చ్ చేస్తుంటారు. ఉదాహరణకు మీరు శోధించే వాక్య నిర్మాణం link:endnowfoundation.org అయి ఉండాలి
- ఇతర సైట్‌ల మాదిరిగా ఉండే సైట్‌లను కనుక్కోవాలంటే.. సంబంధిత సైట్‌ల కోసం శోధించడానికి ఒక మంచి మార్గం ఉంది. మీ సెర్చ్ సింటాక్స్‌గా ఉండాలి, related:endnowfoundation.org
- మ్యాథ్స్ కోసం గూగుల్ సెర్చ్‌ను ఉపయోగిస్తే మీ సెర్చ్ వాక్య నిర్మాణం 8x5+9+8 ... మొదలైనవి ఉండాలి.
- ఒక నిర్దిష్ట ఫైల్‌ను కనుక్కోవడానికి ఉదాహరణకు మీరు సైబర్ సేఫ్టీ ఫైల్ కోసం ప్రయత్నిస్తుంటే సెర్చ్ సింటాక్స్ cybersafetyfiletype:pptx అయి ఉండాలి
- డబ్బు, యూనిట్ మార్పిడులు రెండు కరెన్సీల మధ్య మార్పిడి రేటును చూడటానికి తనిఖీ చేస్తోంది. మీ శోధన సింటాక్స్ యుఎస్‌డి నుండి ఐఎన్ఆర్ వరకు ఉండాలి

బ్రౌజింగ్ చిట్కాలు..

- చిన్న లింక్‌లపై క్లిక్ చేయవద్దు లేదా గూగుల్ ఫారమ్‌లను పూరించవద్దు (ఇమెయిల్, వాట్సాప్ ద్వారా) తెలిసిన సోర్స్ ద్వారా కూడా పంపబడినప్పటికీ, అది ఫిషింగ్ లింక్ కాదా అని మీరు తనిఖీ చేశారని నిర్ధారించుకోండి https://www.isitphishing.org
- సున్నితమైన, వ్యక్తిగత సమాచారాన్ని ఇమెయిల్ ద్వారా ఎప్పటికీ పంపకండి. ఎవరెవరు ఎప్పుడైనా కోరినప్పటికీ.
- ఎవరైనా ఇ మెయిల్‌లో డబ్బును బదిలీ చేయమని అడిగినప్పుడు, అది మీ యజమాని నుండి వచ్చినప్పటికీ, ప్రామాణికత కోసం ఇమెయిల్ యొక్క హెడర్‌ను ఎల్లప్పుడూ తనిఖీ చేయండి. https://mxtoolbox.com/EmailHeaders.aspx
- కస్టమర్ కేర్ నంబర్‌ల కోసం గూగుల్‌లో ఎప్పుడూ శోధించకండి, సంబంధిత పోర్టల్‌లలో పేర్కొన్న నంబర్‌లకు కాల్ చేయండి
- ఎప్పుడూ క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేయవద్దు. ఓటీపీ, యపిన్, బ్యాంక్ కార్డ్, సివివి నంబర్‌లను ఇవ్వవద్దు. అంటే మీరు మీ ఖాతా నుండి డబ్బును ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారని, స్వీకరించడం లేదని అర్థం.
- అన్ని ఇ-మెయిల్‌లు, సోషల్ మీడియా ఖాతాల కోసం రెండుకారకాల ప్రమాణీకరణను సెటప్ చేయండి.
- మీ బ్రౌజర్‌ను అప్‌డేట్ చేసుకోండి మరియు httpr://తో ప్రారంభమయ్యే సురక్షిత వెబ్‌సైట్‌లను మాత్రమే యాక్సెస్ చేయండి.
- ఆన్‌లైన్‌లో షాపింగ్ చేయడానికి మీరు సీక్రెట్ మోడ్‌ని ఉపయోగించవచ్చు. తద్వారా మీ యాక్టివిటీ ఏదీ బ్రౌజింగ్ యాక్టివిటీలో కనిపించదు.
- మీ బ్రౌజర్‌లను కంపార్ట్‌మెంటలైజ్ చేయండి. అంటే, ఒక బ్రౌజర్‌ని పూర్తిగా వెబ్ బ్రౌజింగ్ కోసం, మరొక బ్రౌజర్‌ని బ్యాంకింగ్ కోసం, మరొకటి సామాజిక ఖాతాల కోసం ఉపయోగించండి. దీంతో కుకీలు ఆఫ్ చేయబడ్డాయని, బ్రౌజర్ మీ బ్రౌజింగ్ చరిత్రను నిల్వ చేయడం లేదని నిర్ధారించుకోవడానికి సీక్రెట్ సెట్టింగ్‌లను మార్చండి.
- మీ సొంత పరికరం అయినప్పటికీ, మీరు వాటిని ఉపయోగించనప్పుడు సోషల్ మీడియా, ఇమెయిల్ ఖాతాల నుండి లాగ్ అవుట్ చేయాలని ఎల్లప్పుడూ గుర్తుంచుకోండి.
- సురక్షితమైన బ్రౌజింగ్ అనుభవం కోసం యాంటీవైరస్, యాంటీ మాల్వేర్ సాఫ్ట్‌వేర్‌లను ఉపయోగించండి.
- వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్‌లను ఉపయోగించడం వల్ల హ్యాకర్లు, సోషల్ ఇంజనీరింగ్ స్కామర్‌ల నుండి మీ డేటాను సురక్షితంగా ఉంచడంలో సహాయపడుతుంది.



ఇన్‌పుట్స్:
అనీల్ రాచమల్ల,
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్

హెయిర్ కేర్

కురులకు జవ జీవాలు

ఎండాకాలం, వర్షాకాలం, శీతాకాలం... కాలం ఏదైనా సరే. జుట్టుకి సవాళ్లు తప్పవు. కేశ కష్టనష్టాలు కాలాన్ని బట్టి మారుతుంటాయి. కానీ ఆరోగ్యకరమైన కురుల కోసం ప్రధానంగా తీసుకోవాల్సిన కొన్ని జాగ్రత్తలు.

- జుట్టు ఒత్తుగా, దృఢంగా పెరగాలంటే మాడు ఆరోగ్యంగా ఉండాలి. అందుకోసం మాడుకు స్క్రబ్ చేయాలి. మాడుకు స్క్రబ్ చేయడం వల్ల సెబాసియస్ గ్రంథులు ఉత్తేజితమై జుట్టు ఆరోగ్యంగా పెరుగుతుంది. జుట్టు బాగా పెరగాలంటే మాడుతోపాటు కేశమంతటికీ పోషకాలు అందాల్సిందే. కాబట్టి గుండ్రటి పళ్లున్న దువ్వెనతో జుట్టును బాగా దువ్వాలి. చిక్కులు విడిపోవడంతోపాటు సెబాసియస్ గ్రంథుల నుంచి విడుదలైన సహజమైన నూనెలు మాడు నుంచి వెంట్రుక చివరి వరకు అందుతాయి.



- మార్కెట్‌లో దొరికే హెయిర్‌కేర్ ఉత్పత్తులను గుడ్డిగా వాడడం వల్ల ప్రయోజనం ఉండకపోవచ్చు. అందులో తెలియచేసిన పోషకాలను గమనించి నిర్ణయం తీసుకోవాలి.
- హెయిర్ డ్రైయర్ వాడేటప్పుడు వేడి తక్కువగా ఉండడమే మంచిది. వేడి ఎక్కువైతే వెంట్రుకలో సహజంగీగా ఉండే నూనెలు ఆవిరయిపోయి జుట్టు పొడిగా నిర్జీవంగా మారుతుంది.
- రోజూ తలస్నానం చేయడం మంచిది కాదు. దీని వల్ల కేశాలు నిర్జీవంగా మారుతాయి. మాడు కూడా పొడిబారి దురదపెడుతుంది. తలస్నానం చేసినప్పుడు తలకు టవల్‌కు బదులుగా కాటన్ టీ షర్టును చుట్టుకోవడం సౌకర్యంగా ఉంటుంది. టవల్ జుట్టును లాగుతుంటుంది. టీ షర్టుతో ఈ ఇబ్బంది ఉండదు.

పోషకాహార లోపం కారణంగా జుట్టు రాలిపోతుంటే నిపుణుల సూచన మేరకు ఐరన్, జింక్ వంటి మందులు తీసుకోవచ్చు. అలాగే ఆహారం విషయంలో కూడా శ్రద్ధ తీసుకోవాలి. పోషకాలతో కూడిన సమతుల ఆహారం అవసరం.

సృజన

త్రీ... టూ... వన్... జంప్



నిహారిక

ఆసక్తి ఉన్న రంగంలోకి ప్రవేశిస్తే వెయ్యి ఏనుగుల బలం తోడొస్తుంది. తనకు ఇష్టమైన బంగీజంప్ ప్లాట్‌ఫామ్ పైకి వచ్చిన నిహారిక గెలుపుజెండా ఎగరేసింది. వ్యాపార రంగంలోకి రావాలనుకునేవారికి స్ఫూర్తిగా నిలుస్తోంది, '3... 2..1 జంప్' పుస్తకంతో రచయిత్రిగా తొలి అడుగు వేసింది...

నిహారికకు స్కూల్ రోజుల నుంచి బంగీ జంప్ అంటే ఆసక్తి. తండ్రి రిషికేష్‌లో బంగీ జంప్ ప్లాట్‌ఫామ్ 'జంప్ హైట్స్' ప్రారంభించాడు. బంగీ జంప్ మీద ఉన్న ఆసక్తితో తండ్రి మొదలు పెట్టిన వ్యాపారంలోకి ప్రవేశించి, దశాబ్దకాల అనుభవాన్ని సొంతం చేసుకుంది నిహారిక.

తాను 'జంప్ హైట్స్'లోకి ప్రవేశించినప్పుడు ఆ వ్యాపారం అప్పుడే బుడిబుడి అడుగులు వేస్తోంది. అయితే నిహారిక వినూత్న ఆలోచనలతో 'జంప్ హైట్స్' దూసుకుపోయింది. దేశంలోనే అతి పెద్ద బంగీజంప్ ప్లాట్‌ఫామ్‌గా గుర్తింపు పొందింది.

విదేశాల్లో ఉన్న బంగీ జంప్ ప్లాట్‌ఫామ్‌తో పోల్చితే, మన దేశంలోని వాటికి పరిమితులు ఉన్నాయి. ముఖ్యంగా స్త్రీలు దూరంగా ఉండేవారు. అలాంటి వారికి బంగీజంప్‌పై ఆసక్తి కలిగేలా చేయడంలో నిహారిక విజయం సాధించింది.



నిహారిక



నిహారిక రాసిన '3...2..1...జంప్' పుస్తకం

వ్యాపారరంగంలో రాణించాలనుకుంటున్న యువతరానికి సలహాలు, సూచనలు ఇస్తుంది.

'ఏ వ్యాపారం అంటే ఆసక్తి ఉంది? ఆ వ్యాపారాన్ని నేను సమర్థవంతంగా చేయగలనా? ఎలాంటి ప్రతికూల పరిస్థితులు ఎదురుకానున్నాయి? వాటిని అధిగమించే శక్తి నాలో ఉందా?... ఇలా మనకు మనమే కొన్ని ప్రశ్నలు వేసుకుంటే విజయం సాధించడానికి అవసరమైన దారి కనిపిస్తుంది' అంటుంది నిహారిక.

నిహారిక తాజాగా '3...2..1... జంప్' పేరుతో తొలిసారిగా పుస్తకం రాసింది. భగవద్గీత శ్లోకాలను ఆధునిక కాలానికి అన్వయిస్తూ రాసిన ట్రావెల్ ఫిక్షన్ ఇది.

అర్జున అనే ఒక మహిళ భయస్థురాలు. చిన్న చిన్న విషయాలకు భయపడుతుంటుంది. అలాంటి మహిళలో ధైర్యాన్ని పెంచుతాడు బంగీ జంప్ మాస్టర్ క్రిష్ణ.

వ్యక్తిత్వ వికాస కోణంలో భవిష్యత్‌లో మరిన్ని రచనలు చేయాలనుకుంటున్న నిహారికకు అభినందనలు తెలియజేద్దాం.

పండుగ విందు – పసందు

అల్లుళ్లా మజాకా?... 'మజా'..కే!

పండగంటే మరేమో కాదు... ముంగిట్లో తోరణాలూ - అంగిట్లో పూర్ణాలూ!! మొదటిది కంటికి విందు... రెండోది నోటికి! కంటివిందులూ, కడుపు విందుల్తో పాటు హాయిగా చదువుతూ మనసుకూ విందు చేయడం కోసం తెల్లటి పేపరాకు మీద అక్షరాలా వడ్డిస్తున్నదే ఈ హ్యూమర్ డిన్నర్.



పండగొచ్చింది. అల్లుళ్లు వచ్చారు. మునపటిలాగే... ఇప్పుడు కూడా. అయితే ఈరోజుల్లో అందరి మనోభావాల్లాగే... కొందరు కొత్తల్లుళ్ల మనోభావనలూ కొత్తసినిమాలకు అనుగుణంగా ఎలా ప్రభావితమయ్యాయో ఒకసారి చూద్దామా?

- ''మా అత్తగారింటి కొత్త కుక్కర్ విజిల్ సౌండు రిషభ్‌శెట్టి అరుపులా పరమ కీచుగా ఉంటే ఎంత బాగుణ్ణు!'' 'కాంతారా' చూసొచ్చిన కాంతంగారి అల్లుడి కోరిక ఇది. ఈమధ్య ఆమె చెవుల వినికిడి కాస్త తగ్గడంతో బగారా రైస్ అడుగు కాస్తా బొకారో స్టీల్ కావడంతో... పలావురైస్ అడుగున మాడు చెక్క ల్యూసి పరార వ్వాలనుకున్న ఓ అల్లుడి ఆక్రందన ఇది.



- ''నలిగేదే ల్యా' / 'మెదిగేదే ల్యా''... అన్నది మా అత్తగారి పంతమా? అలా శపథం పట్టి ఇలా ఈ అరిసెలు చేశారా... అన్నది ఓ కొత్త అల్లుడి మనసులో మొలిచిన సందేహమ్మొలక.
- ''క్రీ లేదా పుష్పా?'' పెద్దల్లుడి హోదాలో పెద్దరికం పులుముకుని పనులన్నీ పూర్తిగా ముగించేశాడు. చిట్టచివర్న చివరి బంతిలో భోజనానికి కూర్చున్నాడు. అలా కూర్చుని... వడ్డింపుల్లో కూర కోసం ఎదురుచూస్తున్నప్పుడు... పైగా పుష్కరకాలం దాటిన ఓ పాత అల్లుడి అసహనం.
- ''ఇప్పటికే నూనె చాలా పీల్చుకున్నావు. వదిలేయాలి. మొదట జల్లి గంటె మీద కొంత... ఆ తర్వాత టిష్యూపేపర్ మీద మరికాస్త! లేదంటే... తినేవాడు లావైపోతాడు'' నూనెలో బాగా వేగిన, మాగిన, నానిన గారెను చూశాక... డైట్ కాన్షస్ శ్రీమంతుడైన మరో అల్లుడి 'మనో–డైలాగ్'.
- ''పూర్ణం బూరెలు, బొబ్బట్లు... కంచంలో ఉండగా ఏది ఫస్టని కన్ఫ్యూజవ్వకూడదు రా. ఒకటి గుండ్రంగా ఉంటదీ, మరోటి ఫ్లాట్‌గా ఉంటది. మిగతాదంతా 'సేమ్ టు సేమ్!''... ఐటమ్స్ రెండూ వడ్డించినప్పుడు... ఏది ముందనే సందేహపు అల్లుడి మనసుమాట.
- ''నువ్వు వండి వడ్డించి నంతకాలం వీటిని నమిలేవాడింకా పుట్టలేదు అత్తా!'' దేన్నైనా పంటికింద పటపటలాడించగలననుకునే ఓ 'దంతబలి'గారు... తన అత్త చేసిన అరిసెల్ని, మురుకుల్నీ నమిలేప్పుడు.... సారీ నమల్లేనప్పటి ఓ అల్లుడి ఆక్రోశం.
- ''నువ్వు 'యమ్మీ'... 'యమ్మీ' అంటావుంటే తినబుద్ధవుతా ఉందిరా సామీ... ఈ సకినాలు తినబుద్ధవుతా ఉందిరా సాఆఆఆమీఈఈ'' అప్పటికే కారం మంట నషాళానికి అంటింది. దాంతో తిండిలో పోటీక్కాదు సరికదా... తోడల్లుడికి కనీసం తోడు రాలేకపోయినప్పటి ఓ అల్లుడి కడుపుమంట అండ్ నోటిమంట.





- ''అహ నాటు నాటు నాటు కోడి కోడి కోడి కోడి... నాటు కోడి...'' బ్రాయిలర్ చికెనంటే అంతగా ఇష్టపడని ఓ అల్లుడుగారికి... కంచంలో నాటు కోడి పులుసు కనిపించగానే 'బంగారు కంచం'లో నిండు నాటుకోడి ముడుచుకున్న గ్లోబులా కనిపించగానే మనసు పెట్టిన ఆనందపు కొక్కొరకో కూతలాంటి పాట ఇది.
- ''దాంకో దాంకో తురుమూ.... మడతేసి దాస్తది పూరీ.... కటటట్టటా కటటట్టటా... కొబ్బరి అవుతది తురుమూ... నీళ్లల్ల కరుగుద్ది చక్కెర... కరిగినంకైతది పాకం... పాకంల పడతది తురుమూ... తురుముకు అంటుద్ది పాకం... దాక్కో దాక్కో పాకం... పూరీలో దాక్కో తురుమూ... అడ్డంగ అంటుతది పూరీ... అంటాక అవుతది కజ్జికాయ్'' గరిజె అనబడు కజ్జికాయ కొరుకుతూ వెర్రి'పుష్ప' మంటి ఓ అల్లుడు పాడుకున్న పాట.
- ''సున్నుండే కదాని సప్పరిస్తే... నాలుకకంటుకు పోద్ది''... సున్నుండ తిన్న వెంటనే మరో ఐటమ్ తిందామనుకున్నప్పటికీ... తక్షణం నోరు రెడీ అవ్వలేదని ఆవేదన పడ్డ ఓ చిరంజీవి జామాత గారి మనోవేదన.
- ''తిండంటే.... ఎక్కడ మెక్కాలో తెలియడం కాదురా... ఎప్పుడు ఈనో తాగాలో కూడా ఎరిగి ఉండటం... ఇక అతగాడి హెల్త్ దెబ్బతింటుందే మోననే లోటు తీరిపోయిందిరా''... 'అత్తారింటికి దారెతుక్కుంటూ వచ్చిన' ఓ అల్లుడిని చూస్తూ ఓ మాంగారు కళ్లతుడుచుకుంటూ విడిచిన ఓ హాయి నిట్టూర్పు.

– యాసీన్

■ గేమింగ్

దుష్టశక్తిని శక్తిహీనం చేయండి



త్వరలో విడుదల కాబోతున్న టాక్టికల్ రోల్ ప్లేయింగ్ గేమ్ ఫైర్ ఎంబ్లమ్ ఎంగేజ్. 'ఫైర్' సిరీస్‌లో భాగంగా వస్తున్న గేమ్ ఇది. ఎన్నో సంవత్సరాల తరువాత ఒక దుష్టశక్తి తిరిగి వస్తే? భయపడితే ప్రయోజనం లేదు, భయపెడితేనే ఫలితం దక్కుతుంది. ఈ ఆటలో ఉంగరాలే ప్రధాన ఆయుధాలు. వివిధ రకాల దాడులకు ఉపకరించే మహిమాన్విత ఉంగరాలు ఇవి. ఈ గేమ్‌కు సంబంధించిన మార్పు ఏమిటంటే ప్లేయర్స్ తమ బలగాలను డైరెక్ట్‌గా కంట్రోల్ చేయవచ్చు. 2019లో వచ్చిన 'ఫైర్ ఎంబ్లమ్: త్రీ హౌజెస్' పెద్ద సక్సెస్ అయింది. దీంతో తాజా ఆటపై అంచనాలు పెరిగాయి. విజువల్ నావెల్ స్టోరీ టెల్లింగ్‌తో ప్లేయర్స్‌ను పలకరించనున్న 'ఫైర్ ఎంబ్లమ్ ఎంగేజ్' ఆ అంచనాలను అందుకోవాలని ఆశిద్దాం.

మోడ్: సింగిల్–ప్లేయర్ వీడియో గేమ్ **జానర్స్:** టాక్టికల్ రోల్ ప్లేయింగ్ గేమ్
ప్లాట్‌ఫామ్: నిన్‌టెండో స్విచ్

■ టెక్... టాక్

ఇన్‌స్టాలో ఇలా...



ఇన్‌స్టాగ్రామ్ ఎకౌంట్ నుంచి డిలీట్ చేసిన కంటెంట్‌ను రీస్టోర్ చేసుకోవడానికి...

* ఇన్‌స్టా ఓపెన్ చేసిన తరువాత ప్రొఫైల్‌పై ట్యాప్ చేయాలి.
* టాప్‌రైట్‌లోని 'మోర్ ఆప్షన్స్' ట్యాప్ చేయాలి.
* యాక్టివిటీ కంట్రోల్స్–ట్యాప్
* రీసెంట్ డిలీటెడ్–ట్యాప్
* టాప్‌లోని టైప్ ఆఫ్ కంటెంట్ (రీస్టోర్–ప్రొఫైల్ పోస్ట్స్,రీల్స్, వీడియోస్, స్టోరీస్) సెలెక్ట్ చేసుకోవాలి
* రీస్టోర్ చేయాలనుకున్నదానిపై ట్యాప్ చేయాలి.
* టాప్ రైట్‌లోని మోర్ ఆప్షన్–ట్యాప్
* రీస్టోర్ టు ప్రొఫైల్ లేదా రీస్టోర్ టు రీస్టోర్ కంటెంట్ ట్యాప్ చేయాలి.

వాట్సాప్‌లో కెప్ట్ మెసేజ్ ఫీచర్



ఇన్‌స్టంట్ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్ 'కెప్ట్ మెసేజ్' అనే కొత్త ఫీచర్‌ని పరీక్షిస్తోంది. దీనితో డిజపీయరింగ్ మెసేజ్‌లను సేవ్ చేయవచ్చు. చాట్‌లకు సంబంధించి మరింత కంట్రోల్‌కు యూజర్‌లకు ఉపకరించే ఫీచర్ ఇది. 2021లో స్నాప్‌చాట్... మొదలైన వాటి స్ఫూర్తితో వాట్సాప్ 'డిజప్పియరింగ్ మెసేజ్' ఫీచర్‌ను ప్రవేశ పెట్టింది. ఎవరికైనా మెసేజ్ పంపినప్పుడు నిర్ణీతమైన కాలవ్యవధి తరువాత మెసేజ్ దానికదే డిలీట్ అయిపోతుంది. మళ్లీ దాన్ని చూడడం కుదరదు. అయితే 'కెప్ట్ మెసేజ్' టూల్ డిజప్పియరింగ్ చాట్‌లో కూడా మెసేజ్‌లను ప్రిజర్వ్ చేస్తుంది.

■ సక్సెస్ స్టోరీ

క్లిక్‌కింగ్

పదమూడు సంవత్సరాల వయసులోనే కెమెరాతో స్నేహం మొదలుపెట్టిన ప్రణయ్‌కి, ఇప్పుడు ఆ కెమెరానే ప్రాణం. అరణ్యానికి సంబంధించిన అద్భుతదృశ్యాలను అమితంగా ఇష్టపడే ప్రణయ్ వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్నాడు. ఇంకా ఎన్నో అద్భుతాలు సాధించడానికి ఉత్సాహంగా ఉన్నాడు.....



ప్రణయ్ పటేల్

పదమూడు సంవత్సరాల వయసులో కెమెరాతో అనుబంధం పెంచుకున్నాడు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన ప్రణయ్ పటేల్. అది ఆ వయసుకు మాత్రమే పరిమితమైన ఉత్సాహమై ఉంటే వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా ప్రణయ్ అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకునేవాడు కాదు.

దేశవిదేశాల్లో అరణ్యానికి సంబంధించిన ఎన్నో అద్భుతమైన దృశ్యాలను ఫొటోలలో బంధించాడు. ఈ చిత్రాలు జాతీయ,అంతర్జాతీయ క్యాలెండర్‌లను అలంకరించాయి. అడవిలో ఫొటోగ్రఫీ అనేది అంతా వీజీ కాదు.

'మేము రెడీ. ఇక మీరు ఫొటో తీసుకోవచ్చు' అన్నట్లుగా ఉండదు అక్కడ. ఏ క్షణంలో ఏ అద్భుతం ఆవిష్కారం అవుతుందో తెలియదు. ఒళ్లంతా కెమెరా కన్నులై ఉండాలి. అడవి నాడి తెలిసిన ప్రణయ్‌కి ఈ విషయం తెలియనిదేమీ కాదు. అందుకే అడవిలోని అద్భుతదృశ్యాలను సమర్థవంతంగా పట్టుకోగలిగాడు.

'లొకేషన్‌లోకి ప్రవేశించిన వెంటనే బ్యాక్‌ప్యాక్ ఓపెన్ చేసి కెమెరా సెట్ చేసుకోవాలి. బోర్ కొట్టవచ్చు. అలసటగా అనిపించవచ్చు. అయితే మన లక్ష్యం...అద్భుత దృశ్యం అనే విషయాన్ని మరవకూడదు. ఓపికతో కూడిన నిరీక్షణ నన్ను ఎప్పుడూ నిరాశ పరచలేదు' అంటాడు ప్రణయ్.

> దేశవిదేశాల్లో అరణ్యానికి సంబంధించిన ఎన్నో అద్భుతమైన దృశ్యాలను ఫొటోలలో బంధించాడు ప్రణయ్. ఈ చిత్రాలు జాతీయ, అంతర్జాతీయ క్యాలెండర్‌లను అలంకరించాయి.

ప్రణయ్ ఫొటోలతో రూపుదిద్దుకున్న 'ది వండర్‌ఫుల్ వైల్డ్‌లైఫ్ ఆఫ్ గుజరాత్' 'ది బేర్స్ ఆఫ్ కమ్‌చట్క–రష్యా' 'ది వైల్డ్ ఎర్త్ ఆఫ్ ఆఫ్రికా'... మొదలైన క్యాలెండర్‌లకు ఎంతో పేరు వచ్చింది. గుజరాత్ టూరిజం కార్పొరేషన్ అధికారిక ఫొటోగ్రాఫర్‌గా చిన్న వయసులోనే నియమించబడ్డాడు.

'ఫొటోగ్రాఫర్‌కు దృశ్యజ్ఞానమే కాదు శబ్దజ్ఞానం కూడా ఉండాలి' అంటున్న ప్రణయ్ శబ్దాల ద్వారా కూడా దృశ్యాలను ఊహించగలడు. వాటిని అందంగా ఛాయాచిత్రాలలోకి తీసుకురాగలడు.

తన వెబ్‌సైట్ ద్వారా ఎంతో మంది ఔత్సాహిక ఫొటోగ్రాఫర్‌లకు స్ఫూర్తిని, ఉత్సాహాన్ని ఇస్తున్న ప్రణయ్ అమెరికాతో సహా ఎన్నో దేశాల్లో జరిగిన ఫొటోఎగ్జిబిషన్‌లలో పాల్గొన్నాడు.

'వర్తమానం నుంచే కాదు గతం నుంచి కూడా ఎన్నో అద్భుత విషయాలను నేర్చుకోవచ్చు' అంటున్న ప్రణయ్ అలనాటి బ్లాక్ అండ్ వైట్ ఫొటోలలోని అద్భుతాలను ఆసక్తిగా విశ్లేషిస్తుంటాడు.

'ప్రతి ఫొటో ఒక కొత్త విషయాన్ని మనకు పరిచయం చేస్తుంది' అంటాడు ప్రణయ్.

స్కూల్‌బ్యాగ్ మోసుకెళ్లాల్సిన వయసులో కెమెరా బ్యాగు మోసుకెళుతున్న ప్రణయ్‌కి వెక్కిరింపులు ఎదురయ్యాయి. 'ఇక నీకు చదువు ఏం వస్తుంది!' అని ముఖం మీదే అన్నవాళ్లు కూడా ఉన్నారు.

అయితే ఆ మాటలు విని తాను ఎప్పుడూ బాధపడలేదు. వెనక్కి తగ్గలేదు. కెమెరాతో స్నేహం వీడలేదు. దేశవిదేశాలలో ప్రణయ్ చేసిన ఫొటోగ్రఫీ టూర్‌లు వంద దాటాయి.

'ప్రతి టూర్‌కు సంబంధించిన అనుభవాలను ఒక పుస్తకంగా రాసుకోవచ్చు' అని మురిసిపోతుంటాడు ప్రణయ్.

'కెమెరా పట్టుకోగానే అద్భుతాలు చోటుచేసుకోవు. పర్‌ఫెక్ట్ షాట్ కోసం రోజులే కాదు సంవత్సరం పాటు ఎదురుచూసిన సందర్భాలు కూడా ఉన్నాయి' అంటాడు ప్రణయ్. ఫొటోగ్రఫీ గురించి ఓనమాలు తెలియని వారే కాదు, ఆ విద్యలో కొమ్ములు తిరిగిన ఫొటోగ్రాఫర్‌లు కూడా ప్రణయ్‌ని ప్రశంసలతో ముంచెత్తున్నారు.

25 సంవత్సరాల ప్రణయ్ పటేల్ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆశిద్దాం.

■ పెద్ద పండగ

పండగపూట పల్లెటూర్

● మీది పల్లెటూరు అయితే ఫరవాలేదు, నగరవాసులు అయితే మాత్రం ఈ మూడు రోజుల పండగలో ఒకరోజు పల్లె' టూర్'కు కేటాయించండి. ఎందుకంటే ఇది రైతుల పండగ. పంటల పండగ. పచ్చదనాల పండగ. పొలాల దగ్గరికి వెళ్లి ఆ గాలిని ఆస్వాదించండి. రైతులతో మాట్లాడితే ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు.

● పండగపూట కాస్త కొత్తగా కనిపించాలని ఎవరికి మాత్రం ఉండదు? దీని కోసం పండగరోజు పంచె,కండువా ధరించండి. ఎంత బాగున్నారో కదా!

●గాలిపటాలు ఎగిరేసే ముందు పక్షుల గురించి ఒక్కసారి ఆలోచించండి.



■ ఇంగ్లీష్ ఇడియమ్స్

కింగ్ ఆఫ్ ది హిల్



ఒక వ్యక్తి సమర్థతకు సంబంధించి ఏకాభిప్రాయంతో చెప్పే మాట....కింగ్ ఆఫ్ ది హిల్. ఫలాన ఆటలో ఫలానా వ్యక్తి ఛాంపియన్, ఫలానా రంగంలో ఫలానా వ్యక్తికి తిరుగులేని సామర్థ్యం ఉంది....ఇలాంటి సందర్భాల్లో ఉపయోగిస్తారు. ఇంగ్లాండ్‌లోని పిల్లల ఆటల్లో నుంచి పుట్టిన మాట ఇది. ఆటలో భాగంగా పిల్లవాడు ఒక ఎత్తయిన చోట కూర్చొని, తనను తాను రాజుగా ప్రకటించుకొని 'ఐయామ్ ది కింగ్ ఆఫ్ కాజిల్ అండ్ యూ ఆర్ డర్టీ' అని పాట అందుకుంటాడు. ఇతడిని కిందికి దించడానికి మిగతా పిల్లలు ప్రయత్నిస్తుంటారు.

■ గ్యాడ్జెట్ బజార్

డిజో స్మార్ట్ వాచ్

డిజో వాచ్ డి ప్రో, వాచ్ డి అల్ట్రా స్మార్ట్‌వాచ్‌లను మన దేశంలో విడుదల చేసింది. వీటికి సంబంధించిన కొన్ని వివరాలు..



డి ప్రో

స్క్రీన్: 1.85 అంగుళాలు **రిఫ్రెష్ రేట్:** 60 హెచ్‌జడ్ **పవర్:** డిజో డీఐ చిప్
మోడ్స్: 110 స్పోర్ట్స్ మోడ్స్
కలర్ ఆప్షన్స్: క్లాసిక్ బ్లాక్, సిల్వర్ గ్రే, లైటెనింగ్ బ్లూ **ధర:** ₹ 2,699

డి అల్ట్రా

స్క్రీన్: 1.78 అంగుళాలు **బ్యాటరీ:** 270 ఎంఏహెచ్ **రిజల్యూషన్:** 368×448 పిక్సెల్స్ **బ్యాటరీ:** 270 ఎంఏహెచ్ **మోడ్స్:** 100 ప్లస్ స్పోర్ట్స్ మోడ్స్ (ఇండోర్–ఔట్‌డోర్) **కలర్స్:** క్లాసిక్ బ్లాక్, సిల్వర్ గ్రే, ఓషన్ బ్లూ.

లెనోవా ట్యాబ్ పీ11 ప్రో జెన్2



రిజల్యూషన్: 1536×2560 పిక్సెల్స్ **బ్యాటరీ:** 8000 ఎంఏహెచ్
ఓఎస్/సాఫ్ట్‌వేర్: ఆండ్రాయిడ్ 12
● ఫింగర్‌ప్రింట్ సెన్సర్
మెమోరీ: 128 జీబి 4జీబి ర్యామ్ 128జీబి 6జీబి ర్యామ్ 256జీబి 8జీబి ర్యామ్

సినిమా

ప్రేమికుల దినోత్సవానికి టైటానిక్

సినిమా లవర్స్‌కి.. అందులోనూ ప్రేమకథా చిత్రాల ప్రేమికులకు ఈ ప్రేమికుల దినోత్సవానికి సిల్వర్ స్క్రీన్‌పై 'టైటానిక్' ప్రత్యక్షం కానుంది. టైటానిక్ ఓడలో పరిచయం అయి, ప్రేమికులుగా దగ్గరయ్యే జాక్, రోజ్‌లు చివరికి ఓడ ప్రమాదంలో దూరమయ్యే ఈ విషాదభరిత ప్రేమకథ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించింది. ప్రేమికులుగా లియోనార్డో డికాప్రియో, కేట్ విన్స్‌లెట్‌ల కెమిస్ట్రీని అంత సులువుగా ఎవరూ మరచిపోలేరు. జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన ఈ ఎవర్‌గ్రీన్ లవ్‌స్టోరీ విడుదలై 25 ఏళ్లయింది. ఈ సిల్వర్ జూబ్లీ సందర్భంగా ఈ చిత్రాన్ని హై క్వాలిటీతో మళ్లీ సిల్వర్ స్క్రీన్‌పైకి తీసుకు రావాలనుకుంటున్నారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా ప్రకటించి పోస్టర్‌ని, ట్రైలర్‌ని విడుదల చేసింది చిత్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన ట్వంటీయత్ సెంచరీ ఫాక్స్. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా వచ్చే నెల 10న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. 4కే ప్రింట్‌తో త్రీడీ వెర్షన్‌లో ఈ లవ్‌స్టోరీ కొత్త హంగులతో రావడానికి సిద్ధమవుతోంది. ఇక 1997 నవంబర్‌లో విడుదలైన 'టైటానిక్' సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. ప్రపంచ వ్యాప్తంగా రూ. 13 వేల కోట్లకు పైగా కలెక్ట్ చేసి, రికార్డు సృష్టించింది. 2010లో జేమ్స్ కామెరూన్ అద్భుత సృష్టి 'అవతార్' విడుదలయ్యే వరకూ అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రం రికార్డ్ 'టైటానిక్'దే. కామెరూన్ తన సినిమా రికార్డ్‌ని తానే బద్దలు కొట్టడం విశేషం. ఇక ఆస్కార్ అవార్డ్స్‌లో 14 నామినేషన్లు దక్కించుకుని, 11 అవార్డులను సొంతం చేసుకున్న ఘనత కూడా 'టైటానిక్'కి ఉంది. ప్రేక్షకుల ఆదరణతో పాటు ఇలా పలు రికార్డులు సొంతం చేసుకున్న ఈ చిత్రం త్రీడీ వెర్షన్‌ని 2012లో విడుదల చేశారు. ఇప్పుడు మరింత క్వాలిటీతో 'టైటానిక్' రానుంది.



● కేట్ విన్స్‌లెట్, లియోనార్డో

ఇన్నాళ్లకు మళ్లీ కన్నీళ్లు వచ్చాయి

- 'దిల్' రాజు



● జయసుధ, వంశీ పైడిపల్లి, 'దిల్' రాజు, శ్రీకాంత్

''వారిసు' చిత్రంపై తమిళ ప్రేక్షకులు చూపిన స్పందనకి వంశీ పైడిపల్లి, తమన్ ఏడ్చారు. 'బొమ్మరిల్లు' సినిమా చూస్తున్నప్పుడు వచ్చిన ఒక ఫోన్ కాల్‌తో నేను కూడా ఏడ్చాను.. మళ్లీ ఇన్నాళ్లకు 'వారిసు' చూస్తున్నపుడు కన్నీళ్లు వచ్చాయి. మా నమ్మకం నిజం కావడంతో వచ్చిన ఆనందభాష్పాలు అవి'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. దళపతి విజయ్, రష్మికా మందన్న జంటగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో తెరకెక్కిన ద్విభాషా చిత్రం 'వారిసు' (తమిళ్), 'వారసుడు' (తెలుగు). 'దిల్' రాజు, శిరీష్, పరమ్ వి. పొట్లూరి, పెరల్ వి. పొట్లూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న తమిళ్‌లో విడుదలైంది. తెలుగులో 14న 'వారసుడు' విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో 'దిల్' రాజు మాట్లడుతూ– ''చెన్నైలో 'వారిసు' ఆడుతున్న థియేటర్‌కి వెళ్లాను.. క్లైమాక్స్ పూర్తయ్యాక వంశీని అభిమానంతో హత్తుకున్నాను. ప్రేక్షకులు నిలబడి క్లాప్స్ కొట్టడంతో మేం పడ్డ కష్టాలు మర్చిపోయాం'' అన్నారు. వంశీ పైడిపల్లి మాట్లాడుతూ– ''ఒక మంచి కథని చెబితే ప్రేక్షకులు ఎంత గొప్పగా ఆదరిస్తారో 'వారిసు' మరోసారి నిరూపించింది. సినిమా అయిపోయిన తర్వాత ప్రేక్షకులు చప్పట్లు కొట్టారు. అల్లు అరవింద్‌గారు ఫోన్ చేసి 'వెయ్యి కోట్లు పెట్టినా రాని అనుభూతి ఇది' అని అభినందించారు'' అన్నారు. ''తమిళంలోలా తెలుగులోనూ ఈ సినిమా ఘనవిజయం సాధిస్తుంది'' అన్నారు నటి జయసుధ.

అదరగొట్టావ్ అబ్బాయ్ అన్నారు

- దేవిశ్రీ ప్రసాద్



"వాల్తేరు వీరయ్య'లో 'పూనకాలు లోడింగ్..' పాటలో బూరలాంటి వాయిద్యం ఉపయోగించి ఆ ట్యూన్‌ని కంపోజ్ చేశాను. అది చిరంజీవి గారికి నచ్చడంతో 'అదర గొట్టావ్ అబ్బాయ్' అన్నారు. నేను కంపోజ్ చేసిన ట్యూన్ ఒక ఎత్తు అయితే ఆయన డ్యాన్స్‌తో పాటని మరో స్థాయికి తీసుకెళ్లారు" అని సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ అన్నారు. చిరంజీవి, శ్రుతీహాసన్ జంటగా హీరో రవితేజ కీలక పాత్రలో బాబీ కొల్లి (కేఎస్ రవీంద్ర) దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వాల్తేరు వీరయ్య'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజవుతోంది. ఈ సందర్భంగా దేవిశ్రీ ప్రసాద్ చెప్పిన విశేషాలు.

● చిరంజీవిగారి 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణగారి 'వీరసింహారెడ్డి' చిత్రాలు నిర్మించింది మా మైత్రీ మూవీస్ నిర్మాతలే (నవీన్ యెర్నేని, వై. రవిశంకర్). రెండు సినిమాలూ మావే కావడం, సంక్రాంతికి విడుదలవడం చాలా గర్వంగా ఉంది. సంగీతం విషయంలో ఎలాంటి ఒత్తిడి లేదు. ఏ సినిమాకైనా కథ ప్రకారమే మ్యూజిక్ చేస్తాం.. రెండు సినిమాలూ అద్భుతంగా ఆడాలి.

● బాబీతో నాకు చాలా అనుబంధం ఉంది. 'వాల్తేరు వీరయ్య'లో అన్ని పాటలూ హిట్ కావడానికి కారణం బాబీ కథ, ఆయన నాపై పెట్టుకున్న నమ్మకం. అన్నిటికీ మించి చిరంజీవిగారు మా ఇద్దరిపై పెట్టుకున్న నమ్మకం. చిరంజీవిగారితో సినిమా చేయాలనే బాబీ కల ఈ చిత్రంతో నెరవేరడం ఆనందంగా ఉంది. ఈ సినిమా చూసి చిరంజీవిగారితో 'నవ్విస్తూ ఏడిపించారు.. ఏడిపిస్తూ నవ్వించారు' అని అన్నాను. ఆయన 'ఎంత బాగా చెప్పావ్ మై బాయ్' అన్నారు.

● ఈ సినిమాలో రవితేజ, చిరంజీవిగారి సీన్స్‌కి క్లాప్స్ మామూలుగా ఉండవు. కంట తడితో, నవ్వుతూ క్లాప్స్ కొట్టే సీన్స్ చాలా ఉంటాయి. బాస్‌ని (చిరంజీవి) మనం ఎలా అయితే చూస్తూ పెరిగామో.. ఆ ఎలిమెంట్స్‌తో పాటు కొన్ని కొత్త ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి. కామెడీ, డ్యాన్స్, ఫైట్స్.. అన్నీ కుమ్మేశారు. బాస్‌ని చాలా రోజుల తర్వాత పక్కా మాస్ ఎంటర్‌టైనర్‌లో చూస్తున్నాం.. ఎక్కడా తగ్గకూడ దని ప్రతి పాట విషయంలో జాగ్రత్తలు తీసుకున్నా.

● ప్రతి సినిమా సవాల్‌గానే ఉంటుంది. కానీ, ఒత్తిడిగా భావించకుండా సరదాగా చేస్తాను. నేను బాస్‌ని చూస్తూ పెరిగాను.. ఆయన్ని చూడగానే ఒక ఎనర్జీ వచ్చేస్తుంది. ఇందులో 'నువ్వు శ్రీదేవి..' పాటకి ఆయన స్క్రీన్‌పై ఎలా చేస్తారో ముందే ఊహించి, కంపోజ్ చేసి బాబీకి చూపించా.. అలాగే 'పూనకాలు లోడింగ్..' పాటలో చిరంజీవి, రవితేజగార్లు కనిపిస్తే ఎంత సందడిగా ఉంటుందో ఆ ఎనర్జీ అంతా పాటలో ఇచ్చేశాం.



● రవిశంకర్, గోపీచంద్, బాలకృష్ణ, తమన్, నవీన్

ఆ సన్నివేశాలు కంటతడి పెట్టిస్తున్నాయి

- బాలకృష్ణ

''సంక్రాంతికి విందు భోజనంలాంటి సినిమా 'వీరసింహారెడ్డి'. ప్రేక్షకులు, ఫ్యాన్స్.. ఇలా అందరి నుండి అద్భుతమైన ఆదరణ వస్తోంది'' అన్నారు బాలకృష్ణ. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో బాలకృష్ణ, శ్రుతీహాసన్ జంటగా నటించిన చిత్రం 'వీరసింహారెడ్డి'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన వీర మాస్ బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్‌లో బాలకృష్ణ మాట్లాడుతూ– ''అఖండ'లాంటి హిట్ తర్వాత అలాంటి మరో సినిమాని ప్రేక్షకులు ఆశిస్తారు. అందుకు తగ్గట్టే నా అభిమాని అయిన గోపీచంద్ 'వీరసింహారెడ్డి'ని అద్భుతంగా తీశాడు. ఈ చిత్రంలో నాకు–వరలక్ష్మికి మధ్య వచ్చే అన్నా చెల్లెలి సన్నివేశాలు మహిళలనే కాదు మగవాళ్లనూ కంటతడి పెట్టిస్తున్నాయి'' అన్నారు. ''నా కెరీర్‌లో ఇది బ్లాక్ బస్టర్' అన్నారు గోపీచంద్. ''మా సినిమా తొలి రోజే 50 కోట్ల గ్రాస్ దాటుతోంది. ఇది పెద్ద రికార్డ్. బాలకృష్ణగారి మైలురాయి చిత్రానికి మేం నిర్మాతలు కావడం హ్యాపీ'' అన్నారు నిర్మాతలు.

క్రైమ్.. థ్రిల్

ఓ యువకుడిని క్రిమినల్ కేసులో పోలీసులు అరెస్ట్ చేస్తారు. అతన్ని విడిపించడానికి ఓ క్రిమినల్ లాయర్ కేసును టేకప్ చేస్తుంది. గురువారం హీరో రామ్‌చరణ్ విడుదల చేసిన 'అహింస' ట్రైలర్‌లో కనిపించిన సన్నివేశాలు ఇవి. మరోవైపు అదే ట్రైలర్‌లో ఆ యువకుడు, ఓ యువతి ప్రేమలో ఉన్న సీన్లు కనబడతాయి. దివంగత ప్రముఖ నిర్మాత డి. రామానాయుడు మనవడు, నిర్మాత సురేష్‌బాబు తనయుడు అభిరామ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'అహింస'. గీతిక హీరోయిన్‌గా లాయర్ పాత్రలో సదా నటించిన ఈ చిత్రానికి తేజ దర్శకుడు. ఈ క్రైమ్ థ్రిల్లర్ మూవీకి పి. కిరణ్ నిర్మాత. త్వరలో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: ఆర్పీ పట్నాయక్, కెమెరా: సమీర్ రెడ్డి.



● అభిరామ్

రియల్ లైఫ్ పాత్రలు గుర్తొస్తాయి

- దేవీ ప్రసాద్



● ప్రియా, సంతోష్, అనిల్, దేవీ ప్రసాద్

''బాలకృష్ణ, చిరంజీవిగార్ల సినిమాలతో (వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య) సంక్రాంతికి మళ్లీ ఒక కళ వచ్చింది. ఆ చిత్రాలతో పాటు మా సినిమా వస్తుండటం అదృష్టంగా భావిస్తున్నాం'' అని సంతోష్ శోభన్ అన్నారు. అనిల్ కుమార్ ఆళ్ల దర్శకత్వంలో సంతోష్ శోభన్, ప్రియా భవానీ శంకర్ నటించిన చిత్రం 'కళ్యాణం కమనీయం'. యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా రేపు రిలీజవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో సంతోష్ మాట్లాడుతూ– ''నాకు వెన్నుదన్నుగా ఉంటున్న నిర్మాతలు వంశీ, విక్కీ, అజయ్ అన్నలకు థ్యాంక్స్. ప్రియ నటన, కార్తీక్ సినిమాటోగ్రఫీ, శ్రవణ్ భరద్వాజ్ సంగీతం ఈ సినిమాకి ప్లస్'' అన్నారు. ''జీవితంలో నేర్చుకోవాల్సిన చాలా పాఠాలు 'కళ్యాణం కమనీయం'లో ఉన్నాయి. ఒక నిజాయితీ కథ, కథనాలతో చేసిన మూవీ ఇది'' అన్నారు అనిల్ కుమార్ ఆళ్ల. ''తెలుగులో నాకిది మొదటి సినిమా'' అన్నారు ప్రియా భవానీ శంకర్. ''ఈ సినిమా చూశాక ప్రేక్షకులకు వాళ్ల రియల్ లైఫ్‌లోని పాత్రలు, కొన్ని ఘటనలు గుర్తొస్తాయి'' అన్నారు దేవీ ప్రసాద్.

దేశం కోసం...



● రవీంద్ర

దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలర్పించిన సమరయోధుల చరిత్ర ఆధారంగా రూపొందిన చిత్రం 'దేశం కోసం భగత్ సింగ్'. గతంలో 'అన్నల రాజ్యం, నాగమనాయుడు, రాఘవేంద్ర మహత్యం' వంటి చిత్రాలను నిర్మించిన రవీంద్ర గోపాల ఈ చిత్రాన్ని స్వీయదర్శకత్వంలో నిర్మించారు. దేశభక్తి నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో రవీంద్ర గోపాల, రాఘవ, మనోహర్ ప్రధాన పాత్రల్లో నటించారు. త్వరలో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: ప్రమోద్ కుమార్, కెమెరా: సీవీ ఆనంద్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
147	38
59,958	17,858

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	10,996	▲	64
డోజోన్స్	34,272	▲	299
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,794	▲	69
డాక్స్	15,058	▲	110
షాంఘై	3,163	▲	2
నికాయ్	26,450	▲	4

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)		
56,110	▽	5
బంగారం (99.5 స్వచ్ఛత)		
55,885	▽	5
వెండి (కిలో)		
68,025	▽	338

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎకటి	80.91	82.58
£	బ్రిటన్ పౌండ్	ఎకటి	97.69	101.01
€	యూరో	ఎకటి	86.20	89.28
¥	జపాన్ ఎన్ (100)	ఎకటి	60.72	62.71
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎకటి	55.30	57.65
S$	సింగపూర్ డాలర్	ఎకటి	60.40	62.40
SAR	సౌదీ రియాల్	ట్రావెలర్స్	20.75	22.42
UAE D	యూఏఈ దిర్హామ్	ట్రావెలర్స్	21.31	23.10
¥	చైనా యువాన్	ట్రావెలర్స్	10.96	12.99

మస్క్‌.. టెస్లాకు 'ట్విటర్' షాక్!

ఏడాదిలో టెస్లా షేరు 70% కుదేలు • మస్క్ సంపద 188 బిలియన్ డాలర్లు డౌన్
ట్విటర్ టేకోవర్, పెరుగుతున్న పోటీతో కష్టకాలం

సాక్షి, బిజినెస్ డెస్క్

అమెరికన్ ఎలక్ట్రిక్ కార్ల దిగ్గజం టెస్లా షేరు ఏడాది క్రితం దాకా బ్రేకుల్లేని బండిలా రివ్వున దూసుకెళ్లిపోయింది. కంపెనీ బాసు ఎలాన్ మస్క్‌ను ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడి స్థానంలో కూర్చోబెట్టింది. కానీ ఇప్పుడదే షేరు ఏకంగా 70 శాతం పడిపోయి .. నానా తంటాలు పడుతోంది. ఈ క్రమంలో మస్క్ సంపదా భారీగా హరించుకుపోయింది. చరిత్రలోనే అత్యంత వేగంగా భారీ సంపదను పోగొట్టుకున్న కుబేరుడిగా రికార్డును కూడా మూటగట్టుకున్నారు. ముచ్చట పడి, పంతం పట్టి కొనుక్కున్న ట్విటర్‌కే సమయం అంతా వెచ్చిస్తూ టెస్లాను మస్క్ పట్టించుకోకపోతూ ఉండటమే ఇన్ని అనర్థాలకు కారణమనే విమర్శలు వస్తున్నాయి. అయితే, అదొక్కటే కాకుండా టెస్లాకు మార్కెట్లో పోటీ పెరిగిపోతుండటం, డిమాండ్ తగ్గుతుండటం, కంపెనీపై ఇన్వెస్టర్లకు నమ్మకం సడలుతుండటం మొదలైనవి మరికొన్ని కారణాలని పరిశీలకులు భావిస్తున్నారు. అయితే ఇదంతా ఒక దశ మాత్రమేనని, మళ్లీ పుంజుకునే సామర్థ్యాలు టెస్లాకు పుష్కలంగా ఉన్నాయన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది.

ట్విటర్‌తో కష్టాలు..

మైక్రోబ్లాగింగ్ సైటు ట్విటర్‌ను కొనడంతోనే అటు టెస్లాకు ఇటు మస్క్‌కు కష్టాలు వచ్చాయనే అభిప్రాయాలు ఉన్నాయి. ట్విటర్‌ను 44 బిలియన్ డాలర్లకు కొంటానంటూ గతేడాది ఏప్రిల్‌లో ప్రకటించిన మస్క్, బోలెడంత ఊగిసలాట తర్వాత అక్టోబర్‌లో ఎట్టకేలకు కొన్నారు. డీల్ గురించి ప్రకటించిన దగ్గర్నుంచి ఆయన 23 బిలియన్ డాలర్ల విలువ చేసే టెస్లా షేర్లను అమ్మేశారు. ట్విటర్‌ను కొన్నప్పటి నుంచి గరిష్ఠంగా దానికే సమయాన్ని వెచ్చిస్తున్నారని, టెస్లాను పట్టించుకోవడం లేదనే అభిప్రాయంతో మిగతా షేర్‌హోల్డర్లూ అదే బాట పట్టారు. ఇవన్నీ కంపెనీ షేరుపై ప్రతికూల ప్రభావం చూపాయన్న అభిప్రాయం ఉంది.

డిమాండ్ డౌన్..

అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులు, ప్రత్యర్థి సంస్థల నుంచి పోటీ కారణంగా టెస్లా కార్లకు డిమాండ్ బలహీనపడుతోంది. కంపెనీ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా టెస్లా తొలిసారిగా డిస్కౌంట్లు ఆఫర్ చేయడం ఇందుకు నిదర్శనంగా కనిపిస్తోంది. ముందు 3,750 డాలర్ల డిస్కౌంటు ఇస్తామని ప్రకటించిన టెస్లా.. మరింత మంది కస్టమర్లను ఆకట్టుకోవడానికి ఆ తర్వాత దాన్ని ఏకంగా 7,500 డాలర్లకు పెంచింది. ఎలక్ట్రిక్ వాహనాల విభాగంలో పోటీ పెరుగుతున్న క్రమంలో కీలకమైన చైనా, అమెరికా మార్కెట్లలో డిమాండ్ బలహీనపడుతుండటం టెస్లాకు అర్థమవుతోంది కాబట్టే ఇలా డిస్కౌంట్ల బాట పడుతోందని పరిశీలకులు చెబుతున్నారు. ఇదే కాకుండా అమెరికా ఎకానమీ ఈ ఏడాది మాంద్యంలోకి జారుకుంటుందని, కార్లకు డిమాండ్ పడిపోతుందని వస్తున్న వార్తలూ టెస్లాకు ప్రతికూలంగా ఉంటున్నాయి. అంతేకాకుండా ఫోక్స్‌వ్యాగన్, ఫోర్డ్, జీఎం, హ్యుందాయ్ వంటి దిగ్గజాలు బిలియన్ల కొద్దీ డాలర్లు ఇన్వెస్ట్ చేస్తూ టెస్లాకు దీటుగా కొత్త ఎలక్ట్రిక్ వాహనాలను దింపేందుకు కసరత్తు చేస్తుండటమూ కంపెనీకి సవాలుగా మారుతోంది. కీలకమైన అమెరికా ఈవీ మార్కెట్లో టెస్లా వాటా 2020లో 79% కాగా గతేడాది తొలి 9 నెలల్లో 65%కి పడిపోయింది. 2025 నాటికి ఇది 20% దిగువకు పడిపోవచ్చని ఎస్‌అండ్‌పీ గ్లోబల్ మొబిలిటీ అంచనా.



వేల్యుయేషన్‌పై సందేహాలు..

అమ్మకాలు అంతంతే అయినా అసాధారణంగా ట్రిలియన్ డాలర్ల వేల్యుయేషన్‌తో ట్రేడ్ అవడం టెస్లాకు క్రమంగా ప్రతికూలంగా మారింది. ఒక దశలో టెస్లా వేల్యుయేషన్.. ప్రపంచంలోనే టాప్ 12 భారీ ఆటో దిగ్గజాలన్నింటినీ మించి పలికింది. కానీ వాటి అమ్మకాలతో పోలిస్తే టెస్లా విక్రయాలు తూగడం లేదు. ఇదంతా మార్కెట్‌కు అవగతమయ్యే కొద్దీ కంపెనీ వేల్యుయేషన్ ట్రిలియన్ డాలర్ల నుంచి ప్రస్తుతం దాదాపు 400 బిలియన్ డాలర్లకు పడిపోయింది. అంతేగాకుండా మస్క్ చెప్పే దానికి చేసే దానికి పొంతన ఉండకపోతుండటం కూడా ఇన్వెస్టర్లలో అపనమ్మకం కలిగిస్తోంది. ఏదేదో చేసేస్తున్నానంటూ ఆర్భాటంగా ప్రకటనలు చేసే మస్క్ .. వాటిని ఆచరణలో మాత్రం చూపడం లేదంటూ విమర్శలు ఉన్నాయి. ఉదాహరణకు దాదాపు నాలుగేళ్ల క్రితం ఆవిష్కరించిన సైబర్‌ట్రక్ ఉత్పత్తి 2021లో మొదలుపెడతామని మస్క్ చెప్పినప్పటికీ ఈ ఏడాది వరకూ వాయిదా పడుతూ వచ్చింది. 2024లో గానీ పూర్తి స్థాయిలో తయారీ పుంజుకోదు. ఫోర్డ్, రివియన్ లాంటి కంపెనీలు ఇప్పటికే ఎలక్ట్రిక్ పికప్‌లను అమ్మేస్తుండగా టెస్లా ఎప్పటికి పుంజుకుంటుందనేది సందేహంగా మారింది.

టెస్లా మార్కెట్ విలువ ఏడాది క్రితం
1 ట్రిలియన్ డాలర్లు
ప్రస్తుతం 389 బిలియన్ డాలర్లు
మస్క్ సంపద ఏడాది క్రితం
320 బిలియన్ డాలర్లు
ప్రస్తుతం 132 బిలియన్ డాలర్లు

సంపద సృష్టిలోనూ.. కోల్పోవడంలోనూ రికార్డే!



టెస్లా షేరు 2021 ఆఖర్లో దాదాపు 409 డాలర్ల రికార్డు స్థాయిని తాకింది. దానికి అనుగుణంగానే అందులో సుమారు 21 శాతం వాటాలున్న కంపెనీ చీఫ్ మస్క్ 320 బిలియన్ డాలర్ల సంపదతో సంపన్నుల జాబితాలో ఎవరికీ అందనంత ఎత్తులో నంబర్ వన్‌గా ఉండేవారు. అయితే, గట్టిగా ఏడాది తిరిగేసరికి టెస్లా షేరు 123 డాలర్లకు పడిపోయింది. మస్క్–ట్విటర్ డీల్ నేపథ్యంలో గత మూడు నెలల్లో భారీగా పతనమైంది. వెరసి 2022 మొత్తం మీద దాదాపు 65 శాతం క్షీణించింది. దానికి తగ్గట్లే కంపెనీలో 13.4 శాతం (ప్రస్తుతం) వాటాలు ఉన్న మస్క్ సంపద కూడా ఏకంగా 188 బిలియన్ డాలర్ల మేర పడిపోయింది. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం ప్రస్తుతం మస్క్ సంపద విలువ 132 బిలియన్ డాలర్లు. ఇంత స్వల్ప కాలంలో ఇంత భారీగా సంపద కోల్పోవడంలో మస్క్ రికార్డు సృష్టించడం చర్చనీయాంశంగా మారింది. గతంలో ఈ రికార్డు జపాన్ దిగ్గజం సాఫ్ట్‌బ్యాంక్ అధినేత మసయోషి సన్ పేరిట ఉండేది. 2000 ఐటీ బబుల్ బరస్ట్ అయినప్పుడు ఆయన ఏకంగా 58.6 బిలియన్ డాలర్ల సంపద కోల్పోయారు.

హెచ్‌సీఎల్ టెక్ క్యూ3 భళా

- నికర లాభం 19 శాతం అప్
- షేరుకి రూ. 10 డివిడెండ్

న్యూఢిల్లీ: ఐటీ సేవల దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఈ ఆర్థిక సంవత్సరం(2022–23) మూడో త్రైమాసికం(క్యూ3)లో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 19 శాతం ఎగసి రూ. 4,096 కోట్లను తాకింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 3,442 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 20 శాతం పుంజుకుని రూ. 26,700 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 22,331 కోట్ల టర్నోవర్ నమోదైంది. వాటాదారులకు షేరుకి రూ. 10 చొప్పున నాలుగో మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ఇందుకు రికార్డ్ డేట్ ఈ నెల 20.



డీల్స్ ప్లస్

క్యూ3లో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ నికరంగా 2,945 మంది ఉద్యోగులను జత చేసుకుంది. దీంతో మొత్తం సిబ్బంది సంఖ్య 2,22,270కు చేరింది. ఈ కాలంలో 17 భారీ డీల్స్‌ను పొందింది. కొత్త డీల్స్ విలువ గత క్యూ3తో పోలిస్తే 10% అధికంగా 234.7 కోట్ల డాలర్లను తాకినట్లు కంపెనీ వెల్లడించింది. క్యూ2తో పోలిస్తే ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు 23.8% నుంచి 21.7 శాతానికి తగ్గినట్లు తెలియజేసింది.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌సీఎల్ టెక్ షేరు 1.7 శాతం బలపడి రూ. 1,073 వద్ద ముగిసింది.

మూడో రోజూ నేలచూపు

60,000 దిగువకు సెన్సెక్స్



ముంబై: వరుసగా మూడో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు డీలా పడ్డాయి. సెన్సెక్స్ 147 పాయింట్లు క్షీణించి 60,000 దిగువన 59,958 వద్ద ముగిసింది. నిఫ్టీ 38 పాయింట్లు తగ్గి 17,858 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ ఒక దశలో 473 పాయింట్లు పతనమై 59,752కు చేరింది. ఇక నిఫ్టీ సైతం 17,946–17,762 పాయింట్ల మధ్య హెచ్చుతగ్గులు చవిచూసింది. కాగా, సాహ్ పాలిమర్స్ షేరు.. బీఎస్ఈలో 31% ప్రీమియంతో రూ. 85 వద్ద లిస్టయ్యింది (ఇష్యూ ధర రూ. 65). రూ. 89 వరకూ ఎగసింది. అదే స్థాయిలో ముగిసింది.

ఇన్ఫోసిస్ గైడెన్స్ అప్

- ఆదాయ అంచనాల సవరణ
- 2023లో 16–16.5 శాతం వృద్ధి
- క్యూ3లో పటిష్ట ఫలితాలు
- నికర లాభం 13 శాతం అప్

బెంగళూరు: సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం ఇన్ఫోసిస్ మార్చితో ముగిసే ఈ ఏడాది(2022–23) ఆదాయ అంచనాలను పెంచింది. 16–16.5 శాతం వృద్ధిని సాధించగలమంటూ గైడెన్స్‌ను సవరించింది. గతంలో 15–16 శాతం అంచనాలు ప్రకటించింది. ఇక ఈ ఏడాది మూడో త్రైమాసికం(క్యూ3)లో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 13 శాతంపైగా పుంజుకుని రూ. 6,586 కోట్లను తాకింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 5,809 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా 20 శాతం ఎగసి రూ. 38,318 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 31,867 కోట్ల టర్నోవర్ ప్రకటించింది. ఓపెన్ మార్కెట్ ద్వారా చేపట్టిన ప్రస్తుత బైబ్యాక్‌లో భాగంగా 3.13 కోట్ల షేర్లను కొనుగోలు చేసినట్లు ఇన్ఫోసిస్ వెల్లడించింది. ఇందుకు రూ. 4,790 కోట్లు వెచ్చించింది.

- క్యూ3లో గత 8 క్వార్టర్లతో పోలిస్తే ఆర్డర్ల విలువ మెరుగైంది. మొత్తం 3.3 బిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టులు కుదుర్చుకుంది.



ఇన్ఫీ సీఈఓ సలీల్ పరేఖ్

- నికరంగా 1,627 మంది ఉద్యోగులను జత చేసుకుంది. సిబ్బంది సంఖ్య 3,46,845ను తాకింది.
- అట్రిషన్ రేటు 25.5% నుంచి 24.3%కి తగ్గింది. త్రైమాసికంగా చూస్తే 2.8% తగ్గినట్లు తెలిపింది.
- 2021–22 క్యూ3లో నమోదైన ఉద్యోగులు 2,92,067కాగా.. 2022–23 క్యూ3కల్లా 54,778 మంది జత కలిశారు.

ఇన్ఫీ షేరు 1% ఎగసి రూ. 1,483 వద్ద ముగిసింది. మార్కెట్లు ముగిశాక ఫలితాలు ప్రకటించింది.

సాక్షి స్పోర్ట్స్



ధ్రువ్ షోరే సెంచరీ


ఆంధ్రతో జరుగుతున్న రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో ఢిల్లీ దీటైన రీతిలో జవాబిచ్చింది. మ్యాచ్ మూడో రోజు గురువారం ఆట ముగిసే సమయానికి ఢిల్లీ తమ తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్ల నష్టానికి 300 పరుగులు చేసింది. ఓపెనర్ ధ్రువ్ షోరే (261 బంతుల్లో 142 బ్యాటింగ్; 12 ఫోర్లు, 1 సిక్స్) అజేయ సెంచరీ సాధించగా... హిమ్మత్ సింగ్ (45 బ్యాటింగ్), హృతిక్ షోకీన్ (45) సహకరించారు. ఆంధ్ర బౌలర్లలో షోయబ్ ఖాన్‌కు 2 వికెట్లు దక్కాయి. ప్రస్తుతం ఢిల్లీ మరో 159 పరుగులు వెనుకబడి ఉంది. శుక్రవారం చివరి రోజు కావడంతో మ్యాచ్ 'డ్రా'గా ముగిసే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. అయితే తొలి ఇన్నింగ్స్‌లో ఎవరికి ఆధిక్యం లభిస్తుందనేది చూడాలి.

లమిచానేకు బెయిల్

రేప్ ఆరోపణలతో మూడు నెలల క్రితం అరెస్ట్ అయిన నేపాల్ క్రికెటర్ సందీప్ లమిచానేకు కాస్త ఊరట లభించింది. 22 ఏళ్ల లమిచానేకు కట్మండు కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

సిరీస్ చిక్కింది

- రెండో వన్డేలో భారత్ విజయం
- 2–0తో సిరీస్ సొంతం
- 4 వికెట్లతో ఓడిన శ్రీలంక
- రాణించిన సిరాజ్, కుల్దీప్, రాహుల్
- ఆదివారం చివరి వన్డే


సిరాజ్

భారత్ లక్ష్యం 216 పరుగులే...కానీ ఏమాత్రం బ్యాటింగ్‌కు అనుకూలంగా లేని పిచ్‌పై షాట్లు ఆడటమే కష్టంగా మారిపోయింది.. ఇలాంటి స్థితిలో విజయం కోసం భారత్ 43వ ఓవర్ వరకు శ్రమించింది... స్వల్ప ఛేదనలోనూ కాస్త తడబడినా, రాహుల్ పట్టుదలగా నిలబడటంతో చివరకు భారత్ గెలుపును అందుకొని సిరీస్‌ను తమ ఖాతాలో వేసుకుంది. అంతకు ముందు సిరాజ్, కుల్దీప్‌లు చక్కటి బౌలింగ్‌తో ప్రత్యర్థిని కట్టిపడేశారు. దాంతో కనీస స్కోరు కూడా సాధించలేక శ్రీలంక చేతులెత్తేసింది.

కోల్‌కతా: టి20 మ్యాచ్‌లోనే 228 పరుగులు నమోదై వారం కూడా కాలేదు. అదే వన్డేలకు వచ్చే సరికి పరిస్థితి మారిపోయింది. శ్రీలంక కనాకష్టంగా స్కోరు చేయగా, దానిని ఛేదించేందుకు భారత్ 6 వికెట్లు చేజార్చుకుంది. గురువారం జరిగిన రెండో వన్డేలో భారత్ 4 వికెట్లతో శ్రీలంకను ఓడించింది. మొదట శ్రీలంక 39.4 ఓవర్లలోనే 215 పరుగుల వద్ద ఆలౌటైంది. నువనిదు ఫెర్నాండో (63 బంతుల్లో 50; 6 ఫోర్లు) రాణించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కుల్దీప్, సిరాజ్ చెరో 3 వికెట్లు తీశారు. తర్వాత భారత్ 43.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 219 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (103 బంతుల్లో 64 నాటౌట్; 6 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించాడు. సిరీస్ 2–0తో భారత్ గెలుచుకోగా, చివరి వన్డే ఆదివారం తిరువనంతపురంలో జరుగుతుంది. భుజం గాయంతో దూరమైన చహల్ స్థానంలో కుల్దీప్ ఈ మ్యాచ్‌లోకి వచ్చాడు.

రాణించిన నువనిదు

అవిష్క ఫెర్నాండో (20; 4 ఫోర్లు) ఎక్కువ సేపు నిలబడలేకపోగా, అరంగేట్రం చేసిన నువనిదు ఫెర్నాండో పిచ్ పరిస్థితులకు తగ్గట్లుగా బ్యాటింగ్ చేశాడు. తన ఓవర్లోనే హ్యాట్రిక్ ఫోర్లు కొట్టిన అవిష్కను సిరాజ్ మరుసటి ఓవర్లో బౌల్డ్ చేశాడు. తర్వాత కుశాల్, నువనిదు ఓవర్‌కు 6 పైచిలుకు రన్‌రేట్‌తో జట్టు స్కోరును వంద పరుగులకు చేర్చారు. అంతలోనే కుశాల్ (34 బంతుల్లో 34; 3 ఫోర్లు, 1 సిక్స్)ను కుల్దీప్ ఎల్బీగా పంపడంతో 73 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యం ముగిసింది. తర్వాత స్పిన్, పేస్‌ల వైవిధ్యం లంకను కుదురుకోనివ్వలేదు. ధనంజయ (0)ను అక్షర్ డకౌట్ చేయగా, అసలంక (15), కెప్టెన్ షనక (2)లను కుల్దీప్ బోల్తా కొట్టించాడు. హసరంగ (21; 3 ఫోర్లు, 1 సిక్స్) ధాటికి ఉమ్రాన్ బ్రేకులేయగా, లోయర్ ఆర్డర్‌లో దునిత్ వెలలగే (34 బంతుల్లో 32; 3 ఫోర్లు, 1 సిక్స్) చేసిన స్కోరుతో లంక కష్టంగా 200 పరుగులు దాటింది.

హార్దిక్ సహకారం

లక్ష్యం చిన్నదే అయినా గెలుపు సులువుగా ఏమీ రాలేదు. గత మ్యాచ్ 'టాప్ 3' రోహిత్ (17; 2 ఫోర్లు, 1 సిక్స్), శుబ్‌మన్ గిల్ (12 బంతుల్లో 21; 5 ఫోర్లు), కోహ్లి (4) తొలి పది ఓవర్లలోపే అవుటైతే గానీ పిచ్ సత్తా తెలియలేదు. 62 పరుగులకే వీళ్లంతా పెవిలియన్‌లో కూర్చున్నారు. మిగిలిన ప్రధాన బ్యాటర్స్ ముగ్గురే... అయ్యర్, రాహుల్, పాండ్యా! కానీ లక్ష్యదూరం మాత్రం 154 పరుగులు. కీలక దశలో శ్రేయస్ అయ్యర్ (33 బంతుల్లో 28; 5 ఫోర్లు) కూడా వెనుదిరిగాడు. అయితే రాహుల్, హార్దిక్ పాండ్యా (53 బంతుల్లో 36; 4 ఫోర్లు) భాగస్వామ్యం జట్టును విజయం దిశగా నడిపించింది. ఈ జోడీ ఐదో వికెట్‌కు 75 పరుగులు జోడించింది. 161 స్కోరు వద్ద పాండ్యా అవుటైనా... రాహుల్ కడదాకా నిలబడ్డాడు. అక్షర్ (21 బంతుల్లో 21; 1 ఫోర్, 1 సిక్స్), కుల్దీప్ (10 నాటౌట్; 2 ఫోర్లు)లతో కలిసి జట్టును గెలిపించాడు. 93 బంతుల్లో (3 ఫోర్లు) అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.


రాహుల్

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: అవిష్క (బి) సిరాజ్ 20; నువనిదు రనౌట్ 50; మెండిస్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 34; ధనంజయ (బి) అక్షర్ 0; అసలంక (సి) అండ్ (బి) కుల్దీప్ 15; షనక (బి) కుల్దీప్ 2; హసరంగ (సి) అక్షర్ (బి) ఉమ్రాన్ 21; దునిత్ (సి) అక్షర్ (బి) సిరాజ్ 32; కరుణరత్నే (సి) అక్షర్ (బి) ఉమ్రాన్ 17; రజిత నాటౌట్ 17; లహిరు (బి) సిరాజ్ 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (39.4 ఓవర్లలో ఆలౌట్) 215. వికెట్ల పతనం:** 1–29, 2–102, 3–103, 4–118, 5–125, 6–126, 7–152, 8–177, 9–215, 10–215. **బౌలింగ్:** షమీ 7–0–43–0, సిరాజ్ 5.4–0–30–3, పాండ్యా 5–0–26–0, ఉమ్రాన్ 7–0–48–2, కుల్దీప్ 10–0–51–3, అక్షర్ 5–0–16–1.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) మెండిస్ (బి) కరుణరత్నే 17; గిల్ (సి) అవిష్క (బి) లహిరు 21; కోహ్లి (బి) లహిరు 4; అయ్యర్ (ఎల్బీ) (బి) రజిత 28; రాహుల్ నాటౌట్ 64; పాండ్యా (సి) మెండిస్ (బి) కరుణరత్నే 36; అక్షర్ (సి) కరుణరత్నే (బి) ధనంజయ 21; కుల్దీప్ నాటౌట్ 10; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం (43.2 ఓవర్లలో 6 వికెట్లకు) 219.**
వికెట్ల పతనం: 1–33, 2–41, 3–62, 4–86, 5–161, 6–191.
బౌలింగ్: కసున్ రజిత 9–0–46–1, లహిరు 9.2–0–64–2, కరుణరత్నే 8–0–51–2, హసరంగ 10–0–28–0, దునిత్ 2–0–12–0, షనక 2–0–6–0, ధనంజయ 3–0–9–1.

48 ఏళ్ల కల నెరవేరేనా!

- రెండో టైటిల్ లక్ష్యంగా భారత్
- నేటి నుంచి హాకీ ప్రపంచ కప్
- బరిలో 16 జట్లు
- జనవరి 29న ఫైనల్

ఎప్పుడో 1975లో... భారత హాకీ జట్టు అజిత్‌పాల్ సింగ్ నాయకత్వంలో ఫైనల్లో పాకిస్తాన్‌ను ఓడించి విశ్వ విజేతగా నిలిచింది. అయితే ఆ తర్వాత ఎన్ని ప్రయత్నాలు చేసినా నాటి మేటి ప్రదర్శనను పునరావృతం చేయలేకపోయింది. ట్రోఫీ గెలవడం సంగతేమో గానీ ఆ తర్వాత 11 ప్రపంచ కప్‌లు జరిగినా మన టీమ్ కనీసం సెమీ ఫైనల్ కూడా చేరలేకపోవడం నిరాశ కలిగించే అంశం. వరుసగా రెండో సారి మనమే ఆతిథ్యమిస్తున్న నేపథ్యంలో భారత జట్టు రాత మారుతుందా... కొన్నాళ్ల క్రితం ఒలింపిక్స్‌లో అత్యుత్తమ ఆటను ప్రదర్శించి కాంస్యం సాధించిన మన టీమ్ అదే జోరును చూపిస్తుందా అనేది ఆసక్తికరం.

భువనేశ్వర్: భారత గడ్డపై మరో విశ్వ సంబరానికి సమయం ఆసన్నమైంది. 15వ హాకీ వరల్డ్ కప్ నేడు లాంఛనంగా ప్రారంభం కానుంది. ఒడిశాలోని రెండు వేదికలు భువనేశ్వర్, రూర్కెలాలలో 17 రోజుల పాటు మొత్తం 44 మ్యాచ్‌లు జరుగుతాయి. టోర్నమెంట్ తొలి మ్యాచ్‌లో అర్జెంటీనాతో దక్షిణాఫ్రికా తలపడుతుంది. తొలి రోజే బరిలోకి దిగనున్న భారత్... స్పెయిన్‌ను ఎదుర్కోనుంది. భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియం ఇప్పటికే అందుబాటులో ఉండగా... కొత్తగా ఈ టోర్నీ కోసం మరో పెద్ద హాకీ స్టేడియాన్ని రూర్కెలాలో నిర్మించారు. 24 మ్యాచ్‌లు భువనేశ్వర్‌లో, 20 మ్యాచ్‌లు రూర్కెలాలో జరుగుతాయి. మొత్తం 16 జట్లు బరిలోకి దిగుతుండగా వాటిని నాలుగు పూల్‌లుగా విభజించారు. ముందుగా తమ గ్రూప్‌లో ఇతర మూడు జట్లతో తలపడాల్సి ఉంటుంది. ఆ తర్వాత 'క్రాస్ ఓవర్స్', క్వార్టర్స్, సెమీస్ ఉంటాయి. జనవరి 29న ఫైనల్ నిర్వహిస్తారు.



భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్

నేటి మ్యాచ్‌లు

- అర్జెంటీనా x దక్షిణాఫ్రికా (మ.గం. 1.00 నుంచి)
- ఆస్ట్రేలియా x ఫ్రాన్స్ (మం.గం. 3.00 నుంచి)
- ఇంగ్లండ్ x వేల్స్ (సా.గం. 5.00 నుంచి)
- భారత్ x స్పెయిన్ (సా.గం. 7.00 నుంచి)

పూల్‌ల వివరాలు

- 'ఎ' – అర్జెంటీనా, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, దక్షిణాఫ్రికా
- 'బి' – బెల్జియం, జర్మనీ, జపాన్, కొరియా
- 'సి' – చిలీ, మలేసియా, నెదర్లాండ్స్, న్యూజిలాండ్
- 'డి' – భారత్, స్పెయిన్, ఇంగ్లండ్, వేల్స్

★ ప్రపంచకప్‌ను అత్యధికంగా పాకిస్తాన్ (4 సార్లు) గెలవగా...నెదర్లాండ్స్, ఆస్ట్రేలియా చెరో 3 టైటిల్స్ సాధించాయి. జర్మనీ రెండు సార్లు విజేతగా నిలవగా...భారత్, బెల్జియం ఒక్కో సారి ట్రోఫీని అందుకున్నాయి.

క్వార్టర్ ఫైనల్లో ప్రణయ్

కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత ఆటగాడు హెచ్‌ఎస్ ప్రణయ్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. గురువారం జరిగిన ప్రిక్వార్టర్స్ మ్యాచ్‌లో ప్రణయ్ 21–9, 15–21, 21–16 స్కోరుతో చికో అరా వర్డాయో (ఇండోనేసియా)పై విజయం సాధించాడు. పురుషుల డబుల్స్‌లో భారత జోడి సాత్విక్ సాయిరాజ్ – చిరాగ్ శెట్టి కూడా క్వార్టర్స్‌కు చేరింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో ఏడో సీడ్ సాత్విక్–చిరాగ్ 21–19, 22–20తో 49 నిమిషాల్లోనే షోహిబుల్ ఫిక్రి–మౌలానా బగస్ (ఇండోనేసియా)ను చిత్తు చేశారు. అయితే మహిళల డబుల్స్‌లో మాత్రం భారత్ కథ ముగిసింది. హోరాహోరీగా సాగిన ప్రిక్వార్టర్స్ మ్యాచ్‌లో భారత ద్వయం పుల్లెల గాయత్రి గోపీచంద్ – ట్రీసా జాలీ 13–21, 21–15, 17–21 తేడాతో గాబ్రియా స్టోవా – స్టెఫానీ స్టోవా (బల్గేరియా) చేతిలో ఓటమిపాలయ్యారు.

హైదరాబాద్ మ్యాచ్ 'డ్రా'

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ జోరుకు 'డ్రా'తో బ్రేక్ పడింది. వరుసగా ఐదు విజయాల తర్వాత సొంతగడ్డపై గురువారం చెన్నైయిన్ ఎఫ్‌సీతో జరిగిన మ్యాచ్ 1–1తో హైదరాబాద్ డ్రా చేసుకుంది. చెన్నై జట్టుకు పీటర్ స్లిస్కొవిచ్ (57వ ని.) ఆధిక్యం అందించగా, హైదరాబాద్ తరఫున బర్తొలొమివ్ ఒగ్బెచె (87వ ని.) పెనాల్టీ కిక్‌తో గోల్ చేయడంతో స్కోరు సమమైంది.





Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.